# కె. చిరంజీవి గారి రేడియో నాటికలు - ఒక పరిశీలన

(A CRITICAL STUDY ON K. CHIRANJEEVI'S RADIO PLAYS)


పరిశోధన :

**ఘనపురం దేవేందర్**

పర్యవేక్షణ :

**ఆచార్య బేతవోలు రామబ్రహ్మం**


**పొట్టి శ్రీరాములు**

తెలుగు విశ్వవిద్యాలయానికి

ఎం.ఫిల్., పట్టం కోసం సమర్పించిన

లఘుసిద్ధాంత వ్యాసం


**సాహిత్య పీఠం**

రాజమండ్రి ప్రాంగణం

**జనవరి 1997**

# హామీపత్రం

'కె. చిరంజీవిగారి రేడియో నాటికలు - ఒక పరిశీలన' అనే లఘుసిద్ధాంత వ్యాసాన్ని, నేనే స్వయంగా రాశానని, ఈ పరిశోధన నా స్వయంకృషి ఫలితమేనని, దీనిని మా పర్యవేక్షకుల ఆధ్వర్యంలో రచించానని ధృవీకరిస్తున్నాను.

ఘనపురం దేవేందర్
పరిశోధకుడు.

# ధ్రువీకరణ పత్రం.

నా పర్యవేక్షణలో పరిశోధన సాగించి సాహిత్యపీఠం నుంచి తెలుగు విశ్వవిద్యాలయానికి ఘనపురం దేవేందర్ సమర్పిస్తున్న "కె. చిరంజీవి గారి రేడియో నాటికలు - ఒక పరిశీలన" అనే లఘు సిద్ధాంత వ్యాసం ఎం.ఫిల్ పట్టంకోసం అన్ని విధాల అర్హమైనదనీ, వీరు సొంతగా రూపొందించిందనీ ధ్రువీకరిస్తున్నాను. ఇదికానీ ఇందులోని భాగాలుకానీ ఇంతకు పూర్వం మరొక డిగ్రీ, డిప్లొమాలకు మరింకే విశ్వవిద్యాలయానికి, ఏ సంస్థకూ సమర్పింపబడలేదు.

1.2.97

పర్యవేక్షకులు.

శాఖాధిపతి
సంప్రదాయ సాహిత్యశాఖ
సాహిత్యపీఠం
తెలుగు విశ్వవిద్యాలయం
రాజమండ్రి ప్రాంగణం

# విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| | కృతజ్ఞతలు. | I |
| | ఉపక్రమణిక. | III |
| I | ప్రథమాధ్యాయం. | 1 – 22 |
| | 1. చిరంజీవిగారి సాహితీ జీవితం - రచనల పరిచయం. | |
| II | ద్వితీయాధ్యాయం. | 23 – 68 |
| | 1. తెలుగులో శ్రవ్యరూపకాలు - ఆవిర్భావ వికాసాలు. | 23 – 45 |
| | 2. శ్రవ్యదృశ్యరూపకాలు, లక్షణాలు, భేదసాదృశ్యాలు. | 46 – 68 |
| III | తృతీయాధ్యాయం. | 69 – 175 |
| | 1. చిరంజీవిగారి రేడియో నాటకాలు – వర్గీకరణ. | 69 – 71 |
| | 2. వస్తువైవిధ్యం – సందేశాత్మకత. | 72 – 107 |
| | 3. పాత్రచిత్రణ - వాస్తవికత | 108 – 139 |
| | 4. సంభాషణలు. | 140 – 160 |
| | 5. శిల్పసౌందర్యం. | 161 – 175 |
| | ఉపయుక్త గ్రంథసూచిక. | 176 – 181 |

# కృతజ్ఞతలు

నన్నింతవాడిగా తీర్చిదిద్దిన
అమ్మానాన్నలకు ....

ఎం.ఫిల్ పరిశోధనకు నాకు అవకాశం
ఇచ్చిన నాటి వైస్ ఛాన్సలర్ ఆచార్య పేర్వారం
జగన్నాథం గారికి, నేటి వైస్ ఛాన్సలర్
ఆచార్య నాయని కృష్ణకుమారి గారికి. సాహిత్యపీఠం
పీఠాధిపతి ఆచార్య కడప రమణయ్య గారికి....

నా పరిశోధనకు పర్యవేక్షక బాధ్యత
వహించి, మార్గదర్శకత్వం వహించి అండగా నిలిచిన
ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారికి...

సలహాలందించిన అధ్యాపకులు
డా॥ వై. సుధాకర్, డా॥ శిఖామణి, డా॥ భాస్కరరావు,
డా॥ పి. లీలావతమ్మ, కర్రి నాగార్జున శ్రీ గార్లకు...

అండగా నిలిచిన అక్కా బావలకు,
అన్నా వదినలకు....

అడగగానే ఆత్మీయతతో సలహాలందించిన శ్రీమతి శారదా శ్రీనివాసన్, ఇందుగంటి శ్రీకాంతశర్మ, వి.పి. చందనరావు, సేనాపతి భాష్యకాచార్యులు, రాజబాబు డా॥ కె. పద్మావతి, అయినంపూడి శ్రీలక్ష్మి గార్లకు...

సాహిత్యపీఠం గ్రంథాలయ సిబ్బంది మొత్తానికి,..

మిత్రులు సింగ్, కృష్ణయ్య, విజయ్, హరి, ఈశ్వర్, రాజు, అజయ్, రవి, శారద, శ్రీదేవి, ఇక్బాల్, రమణ, ఖాజా మరియు ఇతర మిత్రులకు...

నన్నెంతో ప్రోత్సహించిన చిన్ననాటి మిత్రులు ప్రసాద్, కైలాస్, శ్రీను, నగేష్, సంతోష్, వాస్సం, ఆంజనేయులు రవి, రేణుకళ, పద్మకళ, మాధవి లకు...

నా పరిశోధన సర్వం, నాకు ప్రేరణ అయిన కే. చిరంజీవి గారికి...

అందంగా శీర్షికలు రాసిచ్చిన రవి కి, సురేందర్ కి, అక్షరాలంకరణ చేసిన చిన్నారులు జై. సౌమ్య, పూర్ణిమలకు..

# ఉపక్రమణిక:

ఆధునిక సాహిత్యంలో కె. చిరంజీవి గారిది ఒక ప్రత్యేకస్థానం. తన జీవితంలో ఎదురైన సంఘటనలకు మరియు సమస్యలకు స్పందించి, తనకు తోచిన రీతిలో పరిష్కారం చూపడానికి తనరచనల ద్వారా ప్రయత్నించారు. కె. చిరంజీవి గారు.

అత్యంత శక్తివంతమైన మాధ్యమాల్లో రేడియో ఒకటి. ప్రజలకు చాలా చేరువగా వెళ్ళిన రేడియో నాటకాల ద్వారా తన ఆవేదనని, ఆలోచనని శ్రోతలతో (ప్రజలతో) పంచుకున్నారు. వాటి పరిశీలననే ఈ లఘుసిద్ధాంత వ్యాసం.

ఈ లఘు సిద్ధాంత వ్యాసంలో అధ్యాయాలు మూడు వున్నాయి. ప్రథమాధ్యాయంలో కె. చిరంజీవి గారి సాహిత్య జీవితం, రచన పరిచయం చేయబడింది.

ద్వితీయాధ్యాయంలో తెలుగులో శ్రవ్యరూపకాల ఆవిర్భావ వికాసాలతో పాటు, శ్రవ్య దృశ్య రూపకాల లక్షణాలు, భేదసాదృశ్యాలను వివరించడం జరిగింది.

తృతీయాధ్యాయంలో చిరంజీవి గారి రేడియో నాటకాల వర్గీకరణాలతో పాటు వస్తువైవిధ్యం — సందేశాత్మకత, పాత్రచిత్రణ — వాస్తవికత, సంభాషణలు, శిల్ప సౌందర్యం తదితర అంశాలను పరిశీలించడం జరిగింది.

ప్రథమాధ్యాయం :-

కే. చిరంజీవిగారి సాహితీ జీవితం, రచనల పరిచయం

# కె. చిరంజీవి గారి సాహితీ జీవితం, రచనల పరిచయం.

కె. చిరంజీవి గారు కేవలం ఒక రచయిత కాదు. ఆయన సాహితీవేత్త, రేడియో నాటక కర్త, నటుడు, ప్రయోక్త, నవలా రచయిత, దృశ్య నాటక రచయిత, కథా రచయిత. వెరసి బహుముఖ ప్రజ్ఞాశాలి.

## జననం — విద్యాభ్యాసం

కె. చిరంజీవి గారు 1935, మార్చి 18 న ఒక రైతు కుటుంబంలో జన్మించారు. తండ్రి కుంటముక్కల రామదాసు, తల్లి రామమ్మ. ఈ దంపతులకు చివరి సంతానం ఆయన. అన్న పేరు వెంకటేశ్వర్లు, అక్క పేరు లక్ష్మమ్మ. పుట్టిన గ్రామం ప్రస్తుతం ప్రకాశం జిల్లా అద్దంకి తాలుకాలోని వైదన. అప్పట్లో ఈ గ్రామం గుంటూరు జిల్లా, నరసారావు పేట తాలుకాలో ఉండేది.

ఆ గ్రామంలో విద్యావసతులు లేని కారణంగా తెనాలిలోని తన మేనమామల వద్దకు వచ్చి ఎస్. ఎస్. ఎల్. సి దాకా చదువుకున్నారు.

కె. చిరంజీవిగారు స్కూలు గోడల మధ్య నేర్చుకున్నది తక్కువ. బతుకు పుస్తకంలో నేర్చుకున్నది ఎక్కువ. మౌనిలా ఈ లోకాన్ని పరికిస్తూ ఆత్మావలోకనం చేసుకోవడం అతని ప్రత్యేకత.

## వివాహం

1959, జూలై 19న, తన మేనమామ గంపా రంగ నాయకులు పెద్ద కుమార్తె అంజమ్మను వివాహమాడారు. ఆయన వివాహం ఖర్చు కేవలం రూపాయిన్నర. అది రెండు పూల మాలల ఖర్చు. కామ్రేడ్ చింతల సూర్యనారాయణ గారు తెనాలి సత్యనారాయణ టాకీసులో వీరి వివాహం జరిపించారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం స్థిర నివాసం ఏర్పరుచుకున్న వీరి సంతానం నలుగురు. వీరి అబ్బాయి చిన్న ఈత కొలనులో ప్రమాదవశాత్తు మరణించారు. ప్రస్తుతం కవిత, నవత అనే అమ్మాయిలు చైతన్య అనే ఒక అబ్బాయి వున్నారు.

రచనా వ్యాసంగం :- ప్రారంభం :

పుష్పం పుట్టగానే పరిమళిస్తుంది అన్నట్లు కె. చిరంజీవి గారు తన పధ్నాల్గవ యేటనే 'విధి విలాసం' అనే చిన్న నాటికను రచించాడు. ఆ నాటిక వాళ్ళ స్కూల్ టీచర్లు ప్రదర్శించారు. ఆ తర్వాత కూడా ఆయన వ్యాసాంగాన్ని కొనసాగించారు. 'చిత్రగుప్త' అనే పత్రికలో ఆయన రాసిన వ్యాసం కూడా ఒకటి అచ్చయింది. అదే స్ఫూర్తిలో ఆయన కవిత్వ రచన కూడా చేసాడు. చదివింది ఎస్.ఎస్.ఎల్.సి అయినా సాహితీ ప్రపంచంలో తన అనుభవాల్ని వస్తువులుగా స్వీకరించి నవలలు, నాటకాలు, కథలు, నాటికలు రాసాడు.

స్కూల్ ఫైనల్ అయి కావడంతోనే కె. చిరంజీవి గారికి 'ఆంధ్ర క్రాంతి థియేటర్స్'తో పరిచయమైంది. అది 1952 ప్రాంతం. కమ్యూనిస్టులు తెలంగాణా సాయుధ పోరాటాన్ని విరమించుకుని బయటికి వస్తున్న రోజులు. అలాంటి నేపథ్యంలో 'క్రాంతి థియేటర్స్'తో ఏర్పడిన పరిచయం ఆయన

జీవితం ఒక మలుపు తిరగడానికి కారణమైంది.
ఆయన జీవితంలో ప్రధానమైన మలుపు ఇది.
ఇక చిరంజీవి గారి జీవితమంతా నాటకాలు, సాహిత్యం,
కమ్యూనిజం ఇవే సర్వస్వమై పోయాయి. మార్గనిర్దేశం
లభించినట్లయింది. జీవిత గమ్యమేమిటో
బోధపడినట్లయింది.

**ఉద్యోగం :**

1957 వ సంవత్సరంలో హైదరాబాదు నుంచి
వెలువడే సోషలిస్టు పార్టీ పత్రిక "నవశక్తి"లో
రెండు సంవత్సరాలు ఆ తర్వాత రెండేళ్ళ పాటు
చక్రపాణి గారి "యువ"లోను పనిచేసి, ఆ పిమ్మట
రేడియోలో చేరారు. 1961 ఏప్రిల్ 1 నుంచి ఆకాశవాణి
హైదరాబాద్ కేంద్రంలో 32 ఏళ్ళ పాటు పని చేసి
1993 మార్చి 17న పదవీ విరమణ చేసారు.
అనంతరం 'ఉషాకిరణ్ మూవీస్' సంస్థలో
ఎక్జిక్యూటివ్ గా చేరి, ప్రస్తుతం అక్కడే
కొనసాగుతున్నారు.

కె. చిరంజీవిగారు ప్రముఖ పాత్ర వహించి ప్రసారం చేసిన రేడియో నాటకాలలో 'కంఠాభరణం', 'రాజా ఈడిపస్', 'పురూరవ', 'భాగ్యనగరం', సంపగి, ఉత్తమ ఇల్లాలు, తుగ్లక్, షాజహాన్, పతితప్రత, పొగమేడ, ప్రజాశత్రువు, హృదయ కమలం, హిమశిఖరం, పవిత్రపాపి, కాబులీవాలా, గుడ్డివాడు, పరీక్షణ, ఆశఖరీదు అణా మొదలైనవి ప్రముఖమైనవి.

## కె. చిరంజీవి గారి ముద్రిత రచనలు :

ఆయన ముళ్ళగులాబి, అనంతయాత్ర, ఎకరుడికి ప్రస్థానం, చోలో స్వాతంత్ర భారత్ కో హై, చిమమనుషులు అనే ఆణిముత్యాల్లాంటి నవలలు రచించారు.

నర్తనబాల, నీలిదీపాలు, సోసార్ బంగ్లా, ఇకరుడు పెళ్ళి చేయబడును, ప్రేమ పక్షులు, దేవుడెరుగని నిజం, శ్రీకృష్ణ శిరోభారం, వంశాంకురం, కొక్కొరోకో, చెళ్ళు తిరగబడుతున్నాయి, శాంతి సమరం, కాలయంత్రం, ఆకలి మందు, పొలిట్రిక్స్, ఊరోళ్ళు మేలొంటున్నారు, మహా నిప్రుబుమణం అనే

నాటకాలను రచించారు. వీటిలో కొన్ని సంకలనాలుగా పునర్ముద్రించబడ్డాయి. దృశ్య నాటక సంకలనం 'ఆట బొమ్మలు' పేరుతో, శ్రవ్య నాటక సంకలన 'జీవితమే నాటకరంగం' పేరుతో వెలువడ్డాయి. 'రెండు కన్నీటి చుక్కలు' అనే కథా సంకలనం కూడా వెలువడింది. తెలుగు లిపి ఆవశ్యకతను గుర్తించి, ఇప్పుడున్న మన తెలుగు లిపిని దోషరహితం గావించి, దానిపై ప్రామాణికమైన ఒక పుస్తకాన్ని కె. చిరంజీవి గారు 1973 లోనే ప్రకటించారు.

## రచనలు - పరిచయం:

### భోలో స్వతంత్ర భారత్ కి జై:

"భోలో స్వతంత్ర భారత్ కి జై" ఇది ఒక నవల. అని అందరంటే కె. చిరంజీవిగారు మాత్రం దాని తగ్గట్టుగా మరో పేరు పెట్టారు. 'సామాజిక జీవిత చిత్రణా పత్రం' అని. స్వాతంత్ర్యానంతరం మూడున్నర దశాబ్దాల (అంటే 1947 నుంచి 1983 వరకు). భారతదేశ చరిత్రను ఇందులో చిత్రీకరించారు.

ఆ కాలంలో మన దేశంలో ఏం జరిగిందో, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, నైతికంగా పరిణామాలేమిటో పూసగుచ్చినట్లు డాక్యుమెంటరీ ఎవిడెన్సుతో రాసిన సవిమర్శక నవల ఇది. ఉన్నదున్నట్లుగా పలుకోణాల నుంచి చూసి సజీవమైన అనేకానేక పాత్రలతో రూపుకట్టించారు.

ఈ నవల గురించి ఆయన మాటల్లో చెప్పాలంటే "కొండ అద్దమందు కొంచెమై యుండదా" అన్నట్లు ప్రస్తుత ప్రపంచాన్ని ఈ చిన్న చట్రంలో బిగించడానికి ప్రయత్నించాను. అందువల్ల కొన్ని చిత్రాలు, స్పష్టంగా, కొన్ని అస్పష్టంగా, కొన్ని మరీ రేఖామాత్రంగా వుంటాయి. ఆ రేఖలు కూడా లేకుండా కొన్ని చోట్ల కేవలం రంగులే వుండవచ్చు. ఈ రంగులు, రేఖలు, చిత్రాలు వీటన్నింటితో కలిపిన ఏక మొత్తం బొమ్మ, ఒకటే ఇక్కడ ప్రధానం."[1]

---

1. కె. చిరంజీవి. చలో స్వతంత్ర భారత్ కీ జై, పీఠిక, పుట 3,4.

ఈ నవల రూపొందించడం ఒక పవిత్ర కర్తవ్యంగా ఎంచి, డైరీ రాసుకున్నంత చిత్తశుద్ధితో రాసారు.

దేశప్రజల గుండెల్లో సర్వావస్థలలో, సర్వకాలాల్లో మారుమ్రోగాల్సిన నినాదం 'బోలో స్వాతంత్ర భారత్ కీ జై' అని, అదే భారతదేశాన్ని శక్తిమంతం చేస్తుందని ఈ నవల ద్వారా ఉద్బోధించారు. ఈ నవల సజీవ చరిత్రకు ప్రతిబింబం. భారతీయ సాహిత్యంలోనే ఇది ఒక అపురూపమైన రచన. 1985 లో తెలుగు విశ్వవిద్యాలయం ఈ నవలకు ఉత్తమ నవల బహుమతి నిచ్చింది. 1984 లో విజయలక్ష్మి మెమోరియల్ ట్రస్టు హైదరాబాద్ వారి అవార్డు నందుకొన్నది.

## చీమ మనుషులు :-

1978, మార్చిలో జరగరాని ఒక సంఘటన జరిగింది. ఒక అబలను పోలీస్టేషన్లో చెరబట్టి, ఆమె భర్తను దారుణంగా కొట్టి చంపారు

పోలీసులు. ఈ ఘోరానికి స్పందించిన జనసమూహం కదిలింది. పోలీసు స్టేషన్ మీద విరుచుకు పడింది. కాల్పులు జరిగాయి, నగరంలో కర్ఫ్యూ విధించబడింది. అసెంబ్లీలో అలజడి చెలరేగింది, తత్ఫలితంగా తప్పని పరిస్థితుల్లో ప్రభుత్వం న్యాయవిచారణ జరిపించింది. న్యాయమూర్తి కేసును క్షుణ్ణంగా పరిశీలించి ఒక అద్భుతమైన తీర్పు చెప్పారు. అందులో.....

"......ఈ తీర్పు సందర్భంగా ఒక మాట మనవి చేయదలుచుకున్నాను. పోలీసు శాఖ తీరుతెన్నులను, ఎంతైన సంస్కరించాల్సిన అవసరం వుంది. వారు రక్షక భటులు కావాలేగాని భక్షక భటులు కారాదు. అల్లాగే ధర్మాసుపత్రులలో ధర్మం నాలుగు పాదాల నడవకపోయినా కనీసం మూడు పాదాల మీద కుంటుతూ నడచినా గడ్డిలో మెల్ల అన్నట్లు ప్రజలు బ్రతికి పోతారు" [1]

---

1. కె. చిరంజీవి, చీమమనుషులు, పుట. 120.

అంటూ తీర్పు చెప్పాడు.

ఆ ఘోర సంఘటనకు స్పందించి, వివరాలన్నీ సేకరించి, చీమల జీవనానికి, మనుష్యుల జీవనానికి గల సామ్యాలనుదహరిస్తూ, ఆచార్య నర్కిదేవ్ (సుప్రసిద్ధ పరిశోధకులు, మానవుల భాష మీద, పక్షులు, జంతువుల యొక్క భాష మీద అధ్యయనం చేస్తున్నారు) అందించిన 'కలదయ కొలని' (విషాదోదంతం) అనే చీమల గ్రంథం ఆధారంగా రచించిన నవల ఇది. (ఆచార్య నర్కిదేవ్ వృత్తాంతం ఒక ఫిక్షన్).

పోలీసుల దురాకృతాలకు అద్దం పట్టే ఈ నవల అచ్చు వేయడానికి రచయిత భయపడ్డట్టే యే పత్రికలు ముందుకు రాలేదు. చివరకు 'జ్యోతి' మాస పత్రికలో అచ్చు అయింది. ఆ తర్వాత రాయగఢ (ఒరిస్సా) నుంచి వెలువడే 'పరశు' పత్రిక ఈ నవలను ఒరియా భాషలోకి అనువదించి ప్రచురించింది. 1987 లో

'విశాలాంధ్ర'వారు తెలుగులో ప్రచురించారు. నిజాన్ని నిర్భయంగా, నాన్చుడు ధోరణి లేకుండా అక్షర రూపంలోకి మార్చబడిన రచన 'చేము ముసుగులు'.

ముళ్ళ గులాబి:-

ఇది చిరంజీవిగారి మొదటి నవల. ఇందులో 1958 కి పూర్వపు భారతదేశ సాంఘిక సమస్యలను ఆయన ఇందులో చిత్రీకరించారు. కె. చిరంజీవిగారిని ఈ నవల ఒక నవలా రచయితగా సాహిత్యలోకంలో సముచిత స్థానాన్ని సంపాదించి పెట్టింది.

అనంత యాత్ర:-

1959 లో కె. చిరంజీవిగారు ప్రకటించిన నవల ఇది. ఆయన పుట్టి పెరిగింది గ్రామీణ పరిస్థితులలో, అందునా రైతు కుటుంబానికి చెందినవారు. గ్రామాలతో తనకు గల అనుబంధాన్ని, స్వానుభవంతో గడించిన గ్రామీణతను ఆయన

అద్భుతంగా అక్షరీకరించారు. గ్రామ ప్రజల, వివిధ వర్గాల జీవన గతుల్ని సహజంగా ఈ నవలలో చిత్రీకరించడం జరిగింది.

ఏకాకికి ప్రస్థానం:-

1962 లో చిరంజీవి రచించిన నవల ఇది. కమ్యూనిష్టు భావాలతో ప్రభావితులై, అందుకనుగుణంగా తన జీవన విధానాన్ని రూపొందించుకున్న చిరంజీవిగారు భారత దేశంలో కమ్యూనిష్టు నేతలు పెడత్రోవ పడుతుంటే ఆందోళన చెంది 'తామెటు వైపు వెళుతున్నామో' కమ్యూనిష్టులంతా ఒక్కసారి ఆత్మావలోకనం చేసుకోవాలని కోరుతూ తన అభిప్రాయాల్ని ఈ నవల ద్వారా వ్యక్తపరిచారు.

ఈ ఐదు నవలల్లో తన అనుభవంలో తటస్థించిన అన్ని రకాల పరిస్థితుల్ని, అనుభవం ద్వారా నేర్చుకున్న ఎన్నో విషయాల్ని డాక్యుమెంట్స్‌తో, ఫిక్షన్స్‌తో వివరించారు చిరంజీవి గారు.

## రెండు కన్నీటి చుక్కలు :

ఇది కథల సంపుటం. చిరంజీవి సాహిత్య జీవితంలో వివిధ పత్రికలలో అచ్చయిన 12 కథలను ఈ సంపుటంగా ప్రచురించారు.

# దృశ్య నాటకాలు

## నర్తన బాల:-

'ప్రేమ' అంటే స్వార్థం, త్యాగం కాదని, ఒకరి కోసం ఒకరు సర్వావస్థలలో అండగా నిలవాలి అని ఈ నాటకం ద్వారా ఉద్బోధిస్తాడు రచయిత. కథానాయికను ఒక రచయిత ఆరాధిస్తాడు. రచయిత స్నేహితుడైన ఒక గాయకుణ్ని కథానాయిక ప్రేమిస్తుంది. రచయిత ప్రేమను తిరస్కరిస్తుంది కథానాయిక. కథానాయిక ప్రేమను ఆహ్వానిస్తాడు గాయకుడు. పల్లెటూరి అమాయకుడు కథానాయిక బావ ఆమెను ప్రేమిస్తాడు. ఆమె అంటే ఆయనకు

పంచప్రాణాలు. ఒక ప్రమాదంలో కథానాయిక కళ్ళు పోతాయి. తన వంటి దురదృష్టవంతురాల్ని పెళ్ళి చేసుకోవద్దని గాయకున్ని కోరుతుంది. అందుకు మనసు చలించిన ఆయన ఒక ఆక్సిడెంట్‌లో చనిపోతాడు. ప్రేమ ఎన్ని అనర్థాలకు దారి తీస్తుందోనని రచయిత వెళ్ళిపోతాడు. అమాయకుడైన 'బావ' కథానాయిక కష్టాల కడలిలో నిస్వార్థంగా తోడుగా నిలవాలనుకుంటాడు.

## నీతి దీపాలు:-

~~ఈ~~ నాటకం భూస్వామ్య వ్యవస్థను, వర్ణవ్యవస్థను తూర్పార బట్టింది. భూస్వామ్య విధానం ఇకపై చెల్లదని, అణగార్చబడిన బడుగులు ఒకటై అన్యాయాలనెదిరిస్తారని వారు జరిపే ధర్మపోరాటానికి భూస్వాముల అరాచకాలు భస్మం అవుతాయని, 'వెట్టిచాకిరి' చేయించుకునే తత్వం నుండి భూస్వాములు మారిపోవాలని వివరిస్తూ దున్నేవాడిదే భూమి అంటూ, రెకలు ముకలు చేసి పంట పండించే రైతాంగానికి సమాజంలో

తగు స్థానం ఇవ్వాలన్న ఆవశ్యకతను ఈ నాటకం ద్వారా నొక్కి చెప్పారు.

సోనార్ బంగ్లా:-

బంగ్లాదేశ్ స్వాతంత్ర్య సమరల నాటి చారిత్రాత్మక సాంఘిక పరిస్థితులను ఈ నాటకంలో చక్కగా వివరించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడే ప్రతి దేశ పౌరుల ఆవేదన ఇదంటూ ఒక ప్రొఫెసర్ కుటుంబం యొక్క కథను ఇందులో చిత్రీకరించారు. పాకిస్తానీ సైనికుల అరాచకాలు బంగ్లా జాతీయుల జ్వాలాగ్ని కారణమైన పరిస్థితులను ఈ నాటకంలో కళ్ళకు కట్టినట్లు చూపారు. దేశం కోసం రక్తంధారపోయడానికి సైతం వెనుకాడకుండా తనని స్వార్థానికి ఉపయోగించుకోజూసిన సైనికాధికారుల ప్రలోభాలకు, హెచ్చరికలకు లొంగకుండా జాతి జనులలో స్ఫూర్తి నింపిన ఒక ప్రొఫెసర్ వీరోచిత గాథ ఇది.

## దేవుడెరుగని నిజం :-

'డబ్బు ఎంతటి అనురాగాన్నైనా, రక్తసంబంధాన్నైనా శత్రువుగా మారుస్తుందని ఈ నాటకం వివరిస్తుంది. డబ్బు కోసం స్నేహితున్నే చంపడానికి వెనుకాడని, ఒక ఇన్‌స్పెక్టర్, డబ్బు దొంగిలించాడని ఆధారం లేకున్నా కేవలం అనుమానంతో సొంత బావమరిదిని చంపిన బావ, లాంటి విభిన్న పాత్రలలో ఈ నాటకం చక్కగా రూపు దిద్దుకుంది. డబ్బు చూపే ఈ చెడు ప్రభావాన్ని తప్పించడం ఎంత వరకు సాధ్యం? అంటూ ప్రజల్ని పరిష్కారం కనుగొనాల్సిందిగా, రచయిత కోరతాడు.

## పొలిట్రిక్స్ :-

ఇది జనజీవితంలోనే చెత్త రాజకీయాలకు దర్పణం పట్టే నాటకం. ఇది ఒక వీధి నాటకం. ఒక యువతి బావిలో పడిపోతే, ఆమెను బావి నుండి తీసి రక్షించమని కోరితే, తన ఏరియా

కాదంటూ తప్పించుకోవడమే కాక లంచం ఇస్తే సరే. అనే కానిస్టేబుల్, నా ఏరియాలో బావిలో పడిన వారిని నేనే తీయాలి! ఎవరూ తీయనవసర్లేదు! తీయడానికి డబ్బులివ్వండి అని నిలదీసే గూండా. బావిలో పడిన యువతి విషయం తెలుసుకుని హుటాహుటిన వచ్చే రాజకీయ నాయకులు, ఆ సంఘటనను కూడా రాజకీయంగా మలుచుకునే తీరు. వీరంతా కలిసి 'బావిలో పడిన వన్ని తీస్తాను' అంటూ తిరిగే ఒక కార్మికుని ఆ పని చేయకుండా అడ్డుకోవడం, ఈ నాటకంలో నేటి కుళ్ళు వ్యవస్థకు చిత్రీకరించడం జరిగింది.

## మహా నిష్క్రమణం:-

ఒక మహర్షి తనకు బహుమానంగా ఇచ్చిన 'జీవ ఫలాన్ని' రాజు తన ప్రియ సఖి, మహారాణికి బహుమానంగా ఇస్తాడు. ఆ ఫలం తింటె నిత్యాయవ్వనవంతులుగా వెలగడమే కాకుండా, చిరంజీవులవుతారు. ఆ ఫలాన్ని

తన ప్రియుడైన పల్లకీ మోసే బోయీకిస్తుంది.
ఆ బోయి ఆ ఫలాన్ని తన ప్రియురాలైన పూలమ్మే యువతికిస్తాడు. తన అందమైన విషయాలు చెబుతూ తనప్రియం కలిగించే, తన ఆరాధనీయుడైన ఒక కవికి ఆ పులమ్మే యువతి ఫలం ఇస్తుంది. ఆ కవి 'వేశ్యాలోలుడు' డబ్బు లేక ఒక వేశ్యకు ఆ ఫలాన్ని ప్రతి ఫలంగా ఇస్తాడు. ఆ వేశ్య రాజుగారు చూసే అనురాగానికి ముగ్ధురాలై ఆ ఫలాన్ని ఆయనకిస్తుంది. తాను రాణికి అత్యంత ప్రేమతో ఇచ్చిన 'జీవ ఫలం'. ఒక వేశ్య ద్వారా తిరిగి తన దగ్గరకు రావడం భరించలేకపోతాడు. 'ఈ 'రంకు' ను సహించలేక జీవితంపైన విరక్తి గలిగి యోగిగా మారి అడవులకు మహాభిప్రస్థానం చేస్తాడు.

## ప్రేమ పక్షులు:-

ఏ అమ్మాయి తనని ప్రేమించకపోవడంతో చివరకు తామే ఎవర్నయినా ప్రేమించాలని

'వేటలో' పడే ఇద్దరు యువకుల కథ. ఎవరి ప్రేమకు నోచుకోని ఒక స్త్రీ తమ ఇద్దర్నీ ప్రేమించడంతో ఎవరు ఆమెను వరించాలో తెలియక మథనపడే తీరును ఈ నాటకంలో వివరించడం జరిగింది. ఇది ఆద్యంతం హాస్య ప్రధానమైన నాటకం. ప్రేమ మనసు నుండి పుట్టాలనేది ఈ నాటకమిచ్చే సందేశం.

ఇక్కడ పెళ్ళి చేయబడును :-

ఇది ఒక హాస్య నాటకం. పెళ్ళి కాని వారికి సలహాలిస్తూ, వారి పెళ్ళిలను సెటిల్ చేయడానికి చేసే ప్రయత్నాలు ఈ నాటకంలో కడుపుబ్బ నవ్విస్తాయి.

కె. చిరంజీవిగారు రాసిన రేడియో నాటకాలను తృతీయాధ్యాయంలో వివరించడమైంది.

## ౩. చిరంజీవి - వ్యక్తిత్వం:

బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన కె. చిరంజీవి గారిని డా|| ఎస్వీ. సత్యనారాయణ 'అభ్యుదయ సాహిత్య జీవి' అని శ్లాఘించారు[1]. ఆయన రచనలన్నీ అభ్యుదయ పంథాలోనే సాగాయి. 'రేడియో నాటకం' గురించి చెప్పాలంటే అది కె. చిరంజీవి గారికే సాధ్యం అంటారు శ్రీమతి శారదా శ్రీనివాసన్. "ఆకాశవాణి ద్వారా శ్రవ్య నాటక ప్రక్రియ మీద ఎన్నో విజయవంతమైన ప్రయోగాలు చేసింది చిరంజీవి గారే"[2] అంటారు ఇంద్రగంటి శ్రీకాంత శర్మ గారు.

ప్రపంచంలో ఎవరికీ ఋణపడకుండా, అన్ని ఋణాలు తీర్చుకుని వెళ్ళిపోవాలన్నది ఆయన ఆకాంక్ష. సమాజం నుంచి మనం తీసుకున్న దానికంటే మనం ఆ సమాజానికి

---

1. ఎస్వీ. సత్యనారాయణ. రేఖాచిత్రాలు, పుట
2. ఇంద్రగంటి శ్రీకాంత శర్మ. ఆలోచన, పుట. 119.

ఇచ్చింది అవగింజంత ఎక్కువైనప్పుడు ఆ జన్మ సార్థకమే అంటారు, ఆయన.

మనిషికి లభించే కీర్తి గురించి ఆయన వ్యాఖ్యానిస్తూ "తెనాలిలో ఒకప్పుడు 'గాడిబావి' వుండేది. ఇప్పుడు లేదు. తెనాలిలో ఒకప్పుడు 'కోతుల చెట్టు' వుండేది. ఇప్పుడు లేదు. అవి లేకపోయినా వాటి జ్ఞాపకాలు మాత్రం మిగిలేవుంటాయి. అలాగే మానవ జీవితమూను. మనం పోతాం, మన జ్ఞాపకాలు మాత్రమే మిగులుతాయి. మనం మంచి చేస్తే, మంచి మిగులుతుంది. చెడు చేస్తే చెడు మిగులుతుంది". ఈ మాటల్లో ఆయన హుందాతనం, గర్వం లేని తనం ప్రతిబింబిస్తుంది.

ఆయన రచనలు సమాజ అభ్యున్నతి మినహా యేది ఆశించి సాగలేదు. ఆయన ఏనాడూ తన "అక్షరా"న్ని డబ్బుకు తాకట్టు పెట్టని మనిషి. తలదింపులు, ఆశ్రయింపులు,

ప్రలోభాలు, ప్రచారాలు ఎరగని విశిష్టవ్యక్తిత్వం. ఆయన రాసిన నాలుగు నాటకాలు జాతీయ నాటకాలుగా భారతీయ భాషలన్నింటిలోకి అనువదించబడి ప్రసారమయ్యాయి. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించబడే ఏషియా - పసిఫిక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బ్రాడ్‌కాస్ట్ డెవలప్‌మెంట్ సంస్థ వీరు రాసిన 'ఆకలి మందు' నాటికను ఒక 'నమూనా రేడియో నాటకం' గా వాడుకుంటున్నది. ఇదంతా కె. చిరంజీవి గారు స్వయంకృషితో సాధించిన విజయాలు.

ఆయన జీవితం సుసాహిత్య స్రవంతికి అంకితమయింది.. రేడియో నాటకం వున్నన్ని రోజులు కె. చిరంజీవి గారి ఖ్యాతి చెక్కు చెదరదు. తెలుగు సాహిత్య జగతిలో ఆయన కలం మరిన్ని మంచి రచనలు వెలయిస్తుందని ఆశిద్దాం. అభ్యుదయ పంథాలో వారి నమ్మకం, వారి ఆత్మవిశ్వాసం ఆయనకు అండగా నిలుస్తాయి.

# ద్వితీయాధ్యాయం :-

1. తెలుగులో శ్రవ్యరూపకాలు - ఆవిర్భావ వికాసాలు.

2. శ్రవ్య దృశ్య రూపకాలు, లక్షణాలు, భేదసాదృశ్యాలు.

# తెలుగులో శ్రవ్యరూపకాలు - ఆవిర్భావ వికాసాలు

నాటక సాహిత్యంలో శ్రవ్యరూపకాలు సముచిత స్థానాన్ని కలిగి వున్నాయి. పాశ్చాత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలో మొగ్గతొడిగిన శ్రవ్యరూపక ప్రక్రియ రోజురోజుకి ప్రవర్థమానం చెందుతోంది. ప్రస్తుతం శ్రవ్యరూపకాలంటే 'రేడియో ద్వారా ప్రసారమయ్యే రూపకాలు' అని అర్థం చెప్పుకుంటున్నాం. అయితే కావ్యాలలో దృశ్యకావ్యాలు, శ్రవ్యకావ్యాలు అన్న భేదం వుండేది.[1]

అచ్చుయంత్రాలు లేని ప్రాచీన కాలంలో ప్రజలు తాటాకు పుస్తకాలపై రచింపబడిన కావ్యాలను రాజసభలలో, దేవాలయాలలో, పండిత కూటములలో, ఉత్సవాలలో ఒకరు చదువుతుండగా విని ఆనందించేవారు. అందువల్ల వాటిని శ్రవ్యకావ్యాలు అనేవారు. ఈ కావ్యపఠనాన్ని విని

---

1. సాహిత్య విమర్శనము, విజయ్ కిరణ్, పుట.93.

పండితులతో పాటు పామరులు కూడా ఆనందించేవారు. 'ఈ శ్రవ్యకావ్యాలలో కవి కథా పాత్రలను తన వెనుక నిలుపుకొని, పాఠకులకు, పాత్రలకు మధ్య తాను నిలిచి, అవసరమైనప్పుడు తానే మాట్లాడుతూ కథను రక్తి కట్టిస్తాడు'[1].

ప్రపంచం వైజ్ఞానికంగా అభివృద్ధి చెందడంతో సాహిత్యంలో కూడా పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. నేడు కావ్యశ్రవణాల జాడ కనబడడం లేదు కాని 'రేడియో రూపకాలు' ఆ పాత్రను విజయవంతంగా పోషిస్తున్నాయి. మన సాహిత్యంలో నూతన ప్రక్రియల ఆవిర్భావానికి ఆంగ్ల సాహిత్య ప్రభావం ఎంతో వుంది. ఆ ప్రభావంతో 'రేడియో రూపకం' వెలుగు చూసి నేడు వెలుగులు విరజిమ్ముతోంది.

---

1. సాహిత్య విమర్శనము. విజయ్ కిరణ్, పుట. 93.

ప్రసారమైంది[2]. దీని రచయిత 'Lance sieveking'.

గమనించ వలసిన విషయం ఏమిటంటే 1923 నుండి 1930 నాటికి బి.బి.సి ప్రతి సంవత్సరానికి 200ల నాటికలు ప్రసారం చేస్తూ ఉన్నత స్థాయికెదిగింది[2]. రేడియో రూపకం వినోద సాధనంగా మారింది. అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మని, ఇటలీ, స్కాండినేవియా, నార్వే, స్వీడన్, డెన్మార్క్, ఐర్లాండ్, తదితర దేశాలలో రేడియో నాటకం వెల్లివిరిసింది.

రేడియో నాటిక ఆవిర్భవించిన తొలి రోజుల్లో కావ్యాలు, కథలు, నవలలు రేడియో ప్రసారానికి అనుగుణంగా మలిచేవారు. అందులో చాలావరకు పేలవంగా సాగేవి. తత్ఫలితంగా రేడియో కోసం ప్రత్యేకంగా నాటకాల్ని రచించడం

---

1. పి. శివలక్ష్మి, శ్రీశ్రీ రేడియో నాటికలు, ప్రయోగ వాద ధోరణులు, పుట. 9.
2. పి. శివలక్ష్మి, శ్రీశ్రీ రేడియో నాటికలు, ప్రయోగ వాద ధోరణులు, పుట. 10.

ప్రారంభించారు. కాలానుగుణంగా రేడియో నాటికలు కేవలం వినోద సాధనాలుగానే కాక, సమకాలీన సమస్యలు, యుద్ధాలు, నేరాలు, శిక్షలు, విస్మృతమైన వ్యక్తిత్వం, ఒంటరితనం తదితర జీవిత సమస్యల్ని, ఇతివృత్తాలుగా ఎన్నుకుని రేడియో నాటకాల్ని రూపొందించారు[1].

రేడియో నాటకం అనతి కాలంలోనే జనాదరణ పొందింది. విజ్ఞాన శాస్త్రం మరింత విస్తృతమై టెలివిజన్లు రంగప్రవేశం చేసినా, రేడియో శ్రోతలు చెక్కు చెదర లేదు. '1946 సెప్టెంబర్ 29 నుండి బి.బి.సి 'Third programme' అనే ప్రత్యేక శీర్షికన ప్రయోగాత్మక నాటకాల్ని ప్రసారం చేయడం ప్రారంభించింది[2].

---

1. పి. శివలక్ష్మి. శ్రీశ్రీ రేడియో నాటికలు, ప్రయోగ వాద ధోరణులు, పు. 9.
2. పి. శివలక్ష్మి. శ్రీశ్రీ రేడియో నాటికలు, ప్రయోగ వాద ధోరణులు, పుట, 10.

ఈ విధంగా పాశ్చాత్య దేశాలలో 'రేడియో నాటకం' ప్రవర్ధమానంగా వర్ధిల్లింది.

## తెలుగులో 'రేడియో రూపకం':

1938 లో ముద్దుకృష్ణ 'అనార్కలి' ద్వారా తెలుగులో ఆవిర్భవించిన రేడియో నాటకం అనంతర కాలంలో మంచి పరిణతిని, పరిణామాన్ని పొందింది. ఈనాడు 'రేడియో నాటకం' ప్రతిరోజు పలకరిస్తోంది.

1938లో ముద్దుకృష్ణ రూపొందించిన 'అనార్కలి' సంగీతప్రధానమైన రూపకం. ఇందులో దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి పాటలు వున్నాయి. అంతేకాకుండా కృష్ణశాస్త్రి గారే సలీం పాత్రను పోషించారు[1].

---

1. పి. ఎస్. ఆర్. అప్పారావు. తెలుగు నాటక వికాసం, పుట, 497.

'తెలుగులో' ఎందరు నాటికా- నాటకా రచయితలున్నారో అంతమంది శ్రవ్యరూపకకర్తలు ఉన్నారనుట అతిశయోక్తి కాజాలదేమో'[1]. ఎందరో రేడియో నాటక కర్తలు కేవలం శ్రోతల వీనులకే పరిచయం అయినా తమ రచనల ద్వారా శ్రోతల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. వారిలో కొందరిని పరిచయం చేస్తాను.

ముద్దుకృష్ణ 'అనార్కలి' విషాద నాటిక. కె.వి. గోపాలస్వామిగారు పేర్కొన్నట్లు ఆర్థికవ్యవస్థకును, ఆవేశ ప్రధానమైన ప్రేమకును సంఘర్షణ ప్రధానంగా చిత్రితమైనది 'అనార్కలి'[2].

గోరాశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు, హితశ్రీ, పాలగుమ్మి పద్మరాజు, దేవులపల్లి

---

1. పి.యస్. ఆర్. అప్పారావు. తెలుగు నాటక వికాసం, పుట, 413
2. అదే. పుట, 413.

కృష్ణశాస్త్రి, త్రిపురనేని గోపీచంద్, మల్లవరపు విశ్వేశ్వర రావు, ఆరుద్ర, శ్రీశ్రీ, నాగభూషణ్, కాటూరి వేంకటేశ్వరరావు, అమరేంద్ర, ప్రయాగ, భరద్వాజ, ఏడిద కామేశ్వర రావు, జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి, జనమంచి రామకృష్ణ, దాశరథి, శ్రీవాత్సవ తదితరులు 'శ్రవ్యరూపక ప్రక్రియను' పరిపుష్టం చేసారు.

వింజమూరి శివరామారావు గారు రేడియోలో రూపకరచనకై ప్రత్యేకంగా నియమింపబడి దాదాపు వేయివరకు రూపకాలు రచించారు.

## గోరా శాస్త్రి:

గోరాశాస్త్రిగారు ఆర్ద్రములైన సన్నివేశముల సమ్మేళనంలో మనసుని కదిలించెడి నాటికలు వ్రాసారు. ఆర్ద్రత, విషాదభావ సంజనితమైన సన్నివేశానికి హాస్యముతో, యుక్తి ప్రత్యుక్తులలో

కూడిన సంభాషణలు చేర్చి తమ ప్రతి శ్రవ్యరూపకానికి జీవంపోసారు గోరాశాస్త్రి'[1]

శ్రోతలెంతో ఆదరించిన వీరి 'ఆశ ఖరీదు అణా', 'అమరజ్యోతి' రూపకాలు శ్రవ్యరూపక రంగంలో నాటికి, నేటికి, ఏనాటికీ అపురూపాలే. హృదయములందు జరగు సంఘర్షణము, ఒక తీయని తలపు, దాని వెంట వచ్చు అనేకానేకములైన విషాద ఫలితములు, ద్వంద్వభావమున నడుచు జీవనగతి వీరి రూపకాలకు కథావస్తువులు[2].

మూర్ఖుడైన భర్త, బ్రతికున్నంత కాలం భార్యను వేధించుకుతిని, ఆమె మరణించిన తర్వాత ఆమె విలువను గుర్తించుట అనే అంశానికి చకటి రూపాన్ని 'లోహ గంటలు' ద్వారా కల్పించారు గోరాశాస్త్రిగారు.

---

1. పి.ఎస్.ఆర్. అప్పారావు. తెలుగు నాటక వికాసం, పుట, 452.

2. అదే, పుట, 452.

ఒక కుటుంబంలోని సుఖ దు:ఖాలకు ప్రతీకగా 'దీపావళి'ని సూచించి మూడు దీపావళి రాత్రులలో జరిగిన కథను హృద్యంగా 'కాలాతీత వ్యక్తులు' అనే శ్రవ్యరూపకంలో పొందు పరిచారు గోరాశాస్త్రిగారు.

చిన్నవాడు ప్రేమించిన యువతిని భీరుడై త్యజించి, ఆమె పాము కాటుకు గురై మరణించిందన్న ప్రవాదాన్ని నమ్మి, జీవితాంతం ఆమెకు సంబంధించిన కొమ్మి సంపెంగకు, కోడె త్రాచుకు భయపడి, పశ్చాత్తప్తుడైన వాని కథకు రేడియో రూపకమే 'కొమ్మి సంపెంగ'.

నగరంలోని ఒక కుటుంబం సెలవులలో అల్లుని గ్రామానికి పోయినపుడు పట్టణవాసులకు, పల్లెవాసులకు గల మానసిక వ్యత్యాసాలను హృదయాంగమంగా 'సెలవల్లో'(1953) అనే రూపకంలో చిత్రించారు, గోరాశాస్త్రిగారు. ఇది సీరియల్‌గా ప్రసారమైంది.

ఇల్లుకట్టి చూడు అనే సామెతననుసరించి, ఇంటివారినందరిని వేపుకుతినే తండ్రి, భగవంతునికి నివేదనం తప్ప వేరు తలపని తల్లి..... ఈ విధంగా ఎవరి స్వార్థాన్ని వారు చూసుకొనే నలుగురు స్వార్థపరులు ఒకచోట చేరితే అది ఎంతటి ఆనంద నిలయమైనను విషాదమయం అవగలదని వివరిస్తూ.... చివరకు వారి సమస్యాలెట్లు పరిష్కరింపబడినవో హాస్యా పూరితంగా 'ఆనందనిలయం' అనే శ్రవ్యరూపకంలో చిత్రించారు గోరా శాస్త్రి గారు. ఈ రూపకం కూడా ధారావాహికంగా ప్రసారమైంది.

వీరి శ్రవ్యరూపకాలు పున:ప్రసారం కూడా చేయబడ్డాయి.

## **కొడవగంటి కుటుంబరావు:-**

బహుళ శ్రవ్యరూపక కర్తలుగా పేరు గాంచిన కొడవగంటి కుటుంబరావు 'రేడియో

నాటకాన్ని' వినోద సాధనంగా, చైతన్య సాధనంగా ఉపయోగించుకున్నారు. భార్య 'రూపవతి', 'కోరకరాని కోయ్య' మొదలగు ఉత్తమరచనలు రేడియోలో పలుమార్లు ప్రసారమయ్యాయి. సాంఘిక సమస్యలే ఇతివృత్తాలుగా వీరి రూపకాలు నిర్మితమయ్యాయి. 'ఎంతటి రహస్యమునైనను యదార్థంగా బయట పెట్టించుగల మందును సేవించిన ఒక కుటుంబం యొకరు రహస్యముల వ్యక్తీకరణము, పెండ్లి కొడుకుల కొరకు గాలం వేయు స్త్రీల మనస్తత్వం, నడుమంత్రపు సిరి మనుష్యుల మానసిక స్థితిని చెడగొట్టుట వంటి కథా వస్తువులు వీరి రచనకు ఆధారములు'.[1] సామాన్యమైన కథలోనైతం బలమైన సన్నివేశములను సృష్టించి శ్రోతల మనస్సులను ఆకట్టుకొనే సమర్థమైన శ్రవ్యరూపక కర్త

---

1. పి.యస్. ఆర్. అప్పారావు. తెలుగు నాటక వికాసం, పుట, 453.

కొడవగంటి కుటుంబరావు.

**హితశ్రీ:-**

రేడియోరూపకాల రూపకల్పనలో 'హితశ్రీ' గారికి ప్రత్యేకత వుంది. 'ప్రాగ్జ్యోతి', 'చరిత్ర కందని కొందరు', 'అద్దం తిరిగిన కథ', 'పరీక్ష' వంటి శ్రవ్యరూపకాలు హితశ్రీ ప్రతిభకు నిదర్శనాలు. 'ప్రాగ్జ్యోతి' ఊహా చిత్రమైతే, 'చరిత్ర కందని కొందరు' కాల్పనిక చిత్రం, 'అద్దం తిరిగిన కథ' ఒక సరళ రచన.

**ఆరుద్ర:-**

1958 లో 'ఆరుద్ర నాటికలు' అనే పేరుతో వెలువడిన సంపుటిలో ఏడు నాటికలున్నాయి. అందులో 'విష ప్రయోగం', 'దేవుని ఎదుట', అనే రెండు నాటికలు తప్ప 'న్యాయాధికారి', 'పారుబ బెంచి', 'నన్ను గురించే',

'దరఖాస్తు ఫారం', 'అకబయ్యాకి ప్ర   షన్' అనే ఐదు నాటికలు శ్రవ్య నాటికలు కావడం విశేషం.

శ్రీశ్రీ :-[1]

తెలుగు సాహిత్యరంగంలో విప్లవం తెచ్చిన అభ్యుదయ వేత్త మహాకవి శ్రీశ్రీ రేడియో నాటకాన్ని ప్రజల్ని చైతన్యం చేయడానికి సాధనంగా ఎన్నుకున్నాడు.

మానవుని భవిష్యత్తుని గురించిన ఊహలకు ప్రతిరూపం 'చతురస్రం', 'మరో ప్రపంచం', 'అనంతయాత్ర', 'గణేషణ' అనే నాటికలు. చావు, శ్మశానాలకు సంబంధించిన మంత్రతంత్ర వాతావరణం ప్రతిబింబించేవి,

---

1. పి. శివలక్ష్మి. శ్రీశ్రీ రేడియో నాటికలు – ప్రయోగ వాద ధోరణులు, పుట. 20,21,22.

'బంటరి బావి', 'సుప్తాస్థికలు', 'ఘాతల కొలిమి' అనే నాటికలు. 'సుప్తాస్థికలు' గాంధీమహాత్ముని స్మృతికి సంబంధించినది. 'విదూషకుని ఆత్మహత్య', 'గుమస్తా కల', 'శిరస్సు చెప్పిన రహస్యం' చైతన్య స్రవంతి పద్ధతిని ఆశ్రయించుకుని సమాజంలోని బాధాసర్పద్రష్టుల జీవిత చిత్రాలను చూపిస్తాయి.

'గ్రామఫోను రికార్డుల తిరుగుబాటు', సంగీతం లాంటి లలిత కళల్లో వుండవలసిన స్వేచ్ఛా నవ్యతలను గురించి ప్రతిపాదిస్తుంది. 'బలి' అనే నాటిక ప్రాచీనమైన పురాణకథకు విప్లవాత్మకమైన వ్యాఖ్యానాన్ని అందిస్తుంది.

'దడిగాడు వానసిరా' అనే రూపకం చిత్రసీమలో కవి, డైరెక్టర్, నాయకుడు మొదలైన వారి ప్రవృత్తులకు దర్పణం పడుతుంది. 'స్వామి-భూస్వామి' సాంఘిక దురాచారాలకు సంబంధించిన సాంఘిక ఇతివృత్తం గలది.

'చరిత్ర చెప్పని సందేశం' దేశచరిత్రలు అనే గేయానికి నాటకీకరణ. 'జడ భరతుడు' సమాజంలో కవి స్థానాన్ని విశ్లేషిస్తుంది. శ్రీశ్రీ రేడియో నాటికలకు నాటక సాహిత్యంలో ప్రత్యేక స్థానం వుంది.

## పాలగుమ్మి పద్మరాజు[1]:-

1946 లో మద్రాసు రేడియో వారు జరిపిన పోటీలలో పాలగుమ్మి పద్మరాజు గారి 'ఖూని' నాటకం ప్రథమ బహుమతి పొందింది. ఇది బిహేవియరిజం సూత్రం ఆధారంగా చేసిన రచన.

## త్రిపురనేని గోపీచంద్[2]:-

1956 లో వీరు 'మాంచాల' అనే

---

1. పి.ఎస్. ఆర్. అప్పారావు. తెలుగు నాటక వికాసం పుట, 415.

2. అదే. పుట, 436.

చారిత్రాత్మక నాటకాన్ని రూపొందించారు. ఇది ప్రత్యేకంగా రేడియో కొరకు వ్రాయబడింది. పలనాటి వీర చరిత్రకు సంబంధించిన 'మాంచాల' ప్రధాన పాత్రగా ఈ నాటిక రచించబడింది.

## మొదలి నాగభూషణ శర్మ:-

వీరు రచించిన 'కలకాపురం' అనేది శ్రవ్యరూపకం యువతీయువకుల కాల్పనిక - వాస్తవిక జీవితములను పోల్చిచూపిన రచన. దీనికి ఆకాశవాణివారి బహుమతి లభించింది. 'సర్వద్రష్టులు', 'వడించిన విస్తరి' వీరి ప్రముఖ రచనలు.

## కాటూరి వెంకటేశ్వర రావు:-

వీరు 'ముద్దుగోపాల' అనేది శ్రవ్యనాటికను రచించారు. అనంతరం 1961లో

ఆరు నాటికల సంపుటం ప్రకటించబడింది. వీరి శైలి ఆర్ద్రమైంది.

శ్రవ్య నాటకాలలో 'సమయం' చాలా ముఖ్యమైంది. కాబట్టి రచయితలు అమితమైన ప్రాతలతో గంట, అరగంట, పావుగంట, పదినిమిషాలు, ఐదు నిమిషాలు నిడివిగల నాటికలు రూపొందిస్తున్నారు. అవి కూడా శ్రోతల అభిమానాన్ని ఎంతగానో చూరగొన్నాయి.

మల్లాది విశ్వనాథకవిరాజుగారి 'నాటికి నేడు' హాస్యనాటిక అల్పవ్యవధి కలది. రెండే పాత్రలు. రైలు ప్రయాణం నేపథ్యం. ఇది ఆదర్శమైన శ్రవ్య నాటికకుదాహరణ.[1] పురాణం సుబ్రహ్మణ్యం గారి 'సైకిల్ అప్పారావు', 'మూడంతస్తుల మేడ'. ఫూసల వెంకటేశ్వరరావు

---

1. ఇంద్రగంటి శ్రీకాంత శర్మ. ఆలోచన (శ్రవ్య నాటకాలు వ్యాసం), పుట, 127.

గారి 'ప్రేమాయణం', 'అల్లుళ్ళు మాకూ ఓ ఛాన్సు ఇవ్వండి' మొదలైనవి శ్రోతల్ని విశేషంగా ఆకర్షించిన శ్రవ్యరూపకాలు.

పుట్టపర్తి నారాయణాచార్యులు గారి ... ... ... ... ... ... ... ... ... ...

ఫుల్వాడ శేషగిరి రావు గారి 'నాట్లుపోల', జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి గారి 'వాసవి కన్యకలు' చెప్పుకోదగిన చారిత్రక నాటకాలు.

## గేయ నాటికలు:-

రేడియో రూపకాలలో గేయ నాటికలు చొచ్చుకు వచ్చాయి. రేడియోలో ప్రసారమైన తొలి సంపూర్ణ గేయరూపకం మల్లవరపు విశ్వేశ్వర రావుగారి 'చిల్వాణీయం' (1939)[2]. షెల్లి రచించిన 'ప్రామిథియస్ అన్ బౌండు' ను మల్లవరపు విశ్వేశ్వర రావు గారు సంగీత

---

2. పి.ఎస్.ఆర్. అప్పారావు. తెలుగు నాటక వికాసం, పుట, 495.

రూపకంగా ఆంధ్రీకరించారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి ఊర్వశి, శర్మిష్ఠ, విద్యాపతి, ఏడాది పొడుగూ, వేణుకుంజం, ధనుర్దాసు, కాటూరి వారి 'శ్రీనివాస కళ్యాణం', సూరంపూడి భాస్కరరావు గారి భ్రమ, కలి, శునశ్శేపుడు తదితరాలు రేడియోలో ప్రసారం అయ్యాయి. డా॥ బాలంత్రపు రజనీ కాంతరావు గేయనాటికా రచనలో సిద్ధహస్తులు.

శ్రవ్య నాటకాన్ని పరిపుష్టం చేసిన వారిలో మునిమాణిక్యం, నోరి నరసింహశాస్త్రి, విశ్వనాథ, కృష్ణశాస్త్రి తదితరులే కాకుండా ప్రస్తుతం ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్, ఆదివిష్ణు, కె. చిరంజీవి, తణికెళ్ళ భరణి, గొల్లపూడి మారుతీరావు మొదలగు వారు రేడియో నాటక రంగ వికాసంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

రేడియో వారు విజయవంతంగా

కొనసాగించిన రూపక ప్రయోగాలలో "భాణము (సంస్కృతం)" వంటి వాక్చిత్రము ఒకటి. ఒకే వ్యక్తి యొక్క భావాలను ఒక సంఘటన ఆధారంగా వివరించుట ఇందులో ప్రధానము. కొన్ని రూపకములందు ఇరువురి స్వగతములు కూడా ప్రకటప్రకటన చూపబడినవి. ఈ ప్రయోగం కూడా విజయవంతమైంది. గోరాశాస్త్రి గారు రచించిన 'నైట్ డ్యూటీ', 'చదువుల రాణి', 'తలపోతల గతుకులు', ఆరుద్ర రాసిన 'కలియని పట్టాలు' ఇటువంటి రచనలకు ఉదాహరణలు.[1]

ఇవే కాక కొన్ని అనువాదములు, కొన్ని నవలలకు నాటకీకరణములు కూడా రేడియోలో ప్రసారం చేయబడినవి. అనువాదాలలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు

---

1. పి. ఎస్. ఆర్. అప్పారావు. తెలుగు నాటక వికాసం, పుట, 454.

ప్రసారం చేసిన సంస్కృత రూపకాలను పేర్కొనవచ్చు. అమరేంద్ర ప్రభృతులు చేసిన ఆంగ్లానువాదాలు కూడా వున్నాయి. ఇవే కాక అఖిల భారతీయ రూపక కార్యక్రమం శీర్షికన ప్రతిభాష యందలి ఉత్తమ నాటకములను తెలుగులోనికి అనువాదం చేసి తరుచుగా ప్రసారం చేయబడుచున్నవి[1].

నాటకీకరింపబడి ప్రసారం చేయబడిన నవలల్లో విశ్వనాథ సత్యనారాయణ గారి 'వేయి పడగలు', చిలకమర్తి లక్ష్మీ నరసింహం పంతులు గారి 'గణపతి', మొక్కపాటి హనుమంతరావు గారి 'బారిష్టర్ పార్వతీశం', అడవి బాపిరాజు గారి 'నారాయణ రావు', అనునవి ముఖ్యమైనవి.

---

1. పి. ఎస్. ఆర్. అప్పారావు. తెలుగు నాటక వికాసం, పుట, 455.

శ్రవ్య నాటక ప్రక్రియ ప్రజలకు ఎంతో చేరువవడం వల్ల అభ్యుదయ సమాజం నిర్మాణంలో శ్రవ్య నాటక కర్తల పాత్ర ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది.

# శ్రవ్య దృశ్య రూపకాలు - లక్షణాలు, భేదసాదృశ్యాలు.

ప్రదర్శనము నకుపయుక్తమైన నాటకాలను దృశ్యరూపకాలని, ప్రదర్శనకనుపయుక్తమైన నాటకాలను శ్రవ్యరూపకాలని, అనుట పరిపాటి. లాటిన్ భాషలోని 'సెనికారూపకములు', సంస్కృతంలోని మురారి 'అనర్ఘరాఘవము' మొదలైనవి శ్రవ్యరూపకాలు కాని నేడు శ్రవ్యరూపకాలంటే అర్థమది కాదు. "రూపకం విధిగా ప్రేక్ష్యము లేదా ప్రదర్శన ప్రధానం అనేడి సిద్ధాంతానికి అపవాదము శ్రవ్యరూపకం (Radio Play)". అనేది నేటి నిర్వచనం.[1]

ప్రదర్శనకుద్దిష్టం కాని నాటికను 'శ్రవ్యనాటిక'[2] అంటారు ఆచార్య కొలకలూరి ఇనాక్. దృశ్య శ్రవ్య రూపకాలను ప్రధాన భేదం ఏమిటంటూ కళ్ళుండి చూచేవారే దృశ్య రూపకంద్వారా రసానందాన్ని పొందగలరు. ఈ

---

1. పి. ఎస్. ఆర్. అప్పారావు. తెలుగు నాటక వికాసం, పుట 496.
2. కొలకలూరి ఇనాక్. సాహిత్యదర్శిని, పుట 40.

దృశ్యరూపక ప్రక్రియకు పూర్తి విరుద్ధమైన శ్రవ్యరూపక ఒక పాశ్చాత్య విమర్శకుడు 'అంధుల థియేటర్' [Blind man's theatre] అని వర్ణించాడు[1]. అంటే ఒక అంధ విద్యార్థుల పాఠశాలకు వెళ్ళి నాటకమంతా వాళ్ళకు సుబోధకమయ్యేలా ప్రదర్శించడం ఎటువంటిదో అదే రేడియో నాటకం. రేడియో నాటకం కనిపించదు. కేవలం వినిపిస్తుంది రంగస్థల రూపకం అటు నయనానందం, ఇటు శ్రవణానందం కలిగిస్తుంది. రంగస్థలం మీద ప్రేక్షకునికి కావలిసినవన్నీ కన్పిస్తాయి. కాని రేడియోనాటకంలో కేవలం 'ధ్వని' ద్వారనే శ్రోతకు కావల్సినవన్నీ అందివ్వాలి.

దృశ్యరూపకాలకు, శ్రవ్యరూపకాలకు భేదసాదృశ్యాలెన్నో వున్నాయి. మామూలు రంగస్థల

---

1. కె. చిరంజీవి - జీవితమే నాటకరంగం, పుట V

రూపక ప్రదర్శనములో వలనే రేడియోలో ప్రసారం చేయబడే శ్రవ్యరూపకాలలో కూడా ఒక్కొక్క భూమికకు ఒక్కొక్క పాత్ర వుంటుంది.

దృశ్యరూపకాలకి, శ్రవ్యరూపకాలకి అవినాభావ సంబంధం ఏమిటంటే దృశ్య రూపకాలు రంగస్థల నాటకాలుగా ప్రజలకు చేరువయ్యాయి. సినిమా, దూరదర్శనలకు జన్మ-నిచ్చింది రంగస్థలమే. ఈ శ్రవ్యరూపకాలకు జన్మనిచ్చింది రంగస్థల నాటకరంగమే. శ్రవ్య నాటకం Theatre కు Electronics కి కలిగిన బిడ్డగా వర్ణించారు కె. చిరంజీవి.[1]

అది దృశ్యనాటకం కాని, శ్రవ్య నాటకం కాని నాటకం నాటకమే. యే నాటకానికైనా

---

1. కె. చిరంజీవి. జీవితమే నాటకరంగం, పుట IV.

లక్షణాలు, లక్ష్యాలు దాదాపుగా ఒకే విధంగా వుంటాయి. అయితే ఈ రెండింటికి మీడియాలోనే తేడా. రంగస్థల రూపకంలో నటులకు, ప్రేక్షకులకు సంబంధం వుంటుంది. కాని శ్రవ్యరూపకాల విషయానికొస్తే ఆ సంబంధం వుండదు. అసలు ఇక్కడ ప్రేక్షకులు ప్రేక్షకులే కారు. రేడియో నాటకానికి వుండేది శ్రోతలు మాత్రమే.

ఇంద్రగంటి శ్రీకాంతశర్మ మాటల్లో చెప్పాలంటే, "రంగస్థల నాటకం చూసే ప్రేక్షకుడి ప్రధాన సాధనమైన "కన్ను", శ్రవ్యనాటకంలో శ్రోతమనస్సుకి వుంటుంది. ఈ మనోనేత్రానికి విజయవంతంగా పరితోషం కలిగించి నందు వల్లనే శ్రవ్యనాటకం ఒక విశిష్టప్రక్రియగా స్థిరపడింది.[1]

దృశ్యనాటకాలలో నటుల ఆహార్య, ఆంగిక,

---

1. ఇం.ద్ర.గంటి శ్రీకాంత శర్మ. ఆలోచన, పుట 118.

సాత్త్విక, అభినయాలను ప్రత్యక్షంగా ప్రేక్షకుడు అనుభవిస్తాడు. కాని రేడియోనాటకంలో శ్రోతకు ఆ అవకాశం లేదు. రేడియోనటులు ప్రదర్శించేది కేవలం వాచికం మాత్రమే. రేడియో శ్రోతలు వాచికం ద్వారానే అన్నింటిని ఆస్వాదించాల్సి వుంటుంది. ఆ అనుభూతిని రేడియో నటులు శ్రోతలకు అందించాలి. ఈ రేడియో నాటకాలు శబ్ద ప్రధానములు, కాబట్టి వీటికి శబ్దరూపకాలని పేరు.[1]

దృశ్యరూపకాలలో కాలం, స్థలం మొదలైనవి పాటించవలసి యుండును. కాని శ్రవ్యరూపకంలో ఆ బాధ లేదు. రంగస్థలంలో ప్రదర్శించుటకు సాధ్యం కాని వానిలో సహా, చేతనాచేతనమైన సమస్తప్రపంచాన్ని శ్రోతకు అందించే అవకాశం ఈ రేడియో నాటకానికి వుంది.

---

1. పి.ఎస్.ఆర్. అప్పారావు. తెలుగునాటక వికాసం. పుట 496

శబ్దజాలం దృశ్యరూపకంలోను, శ్రవ్య రూపకంలోనూ ప్రధానపాత్ర వహిస్తుంది. ఈ శబ్దజాలాన్ని కె. చిరంజీవి గారు డైలాగ్, సౌండ్ ఎఫెక్ట్స్, మ్యూజిక్ అనే మూడు భాగాలుగా విభజించారు[1]. ఖచ్చితంగా చెప్పాలంటే రేడియో నాటకానికి ఈ మూడు ఆధారాలు దృశ్య నాటకానికి ఈ మూడు ఒకభాగం మాత్రమే.

## డైలాగ్ :-

డైలాగ్ అనేది శ్రవ్యనాటకంలోనూ, దృశ్యనాటకంలోనూ అత్యంత ప్రధానమైంది. డైలాగ్ దృశ్యరూపకంలో పాత్రల యొక్క స్వభావాన్ని ప్రస్ఫుటం చేస్తుంది. ఆ డైలాగ్కు, అభినయం తోడై ప్రేక్షకునికి రసానందం కలిగిస్తుంది. కాని రేడియో నాటకంలో పాత్రల యొక్క ఉనికిని, వారి ప్రవేశ నిష్క్రమణాలను

---

1. కె. చిరంజీవి, జీవితమే నాటకరంగం, పుట. V

మొత్తం అభినయాన్ని కేవలం డైలాగ్ ద్వారానే శ్రోతకు అందించాల్సి వుంటుంది. దృశ్యరూపకంలో డైలాగ్ పెద్దగా వున్నా, క్లుప్తంగా వున్నా ఆహార్య ఆంగికాల వలన ప్రేక్షకునిలో ఉత్సాహాన్ని రేకెత్తిస్తుంది. రేడియో నాటకంలో డైలాగ్ స్పష్టంగా క్లుప్తంగా వుండాలి.

రంగస్థలరూపకంలో డైలాగ్ 'ఎలా చెప్పాడు' అనేది ముఖ్యం. ఎందుకంటే అక్కడ అభినయం అనేది డైలాగ్‌కు జంటగా నిలుస్తుంది. రేడియో రూపకంలో మాత్రం 'ఏం చెప్పాడు' అనేది ప్రధానం. అయితే ఎలా అయితే అలా చెప్పవచ్చుని కాదు. రేడియో నటుడు లేదా నటి 'ఏం చెప్పాడో' స్పష్టంగా అర్థం కావాలి. ఈ స్పష్టతద్వారా శ్రోత నటనను ఊహించుకునే అవకాశం వుంది.

శ్రవ్య నాటకాలలో నటుని
ప్రతిభావ్యుత్పత్తులన్నీ శబ్దంలోకి అనువదింపబడాలి.
ఆపాత్ర ఎలాంటిది? ఆపాత్ర ఎటువంటిది?
స్వభావ స్వరూపాలేమిటి? ఎలాంటి స్థితిలో వుంది?
ఎవరితో ఏ తీరున మాట్లాడుతున్నది? స్పందన,
ప్రతిస్పందన ఇవన్నీ కేవలం ఒక గొంతుక
ద్వారనే పలికించగలగాలి. దృశ్యనాటకంలోని
ఆంగికం, సాత్వికం, ఆహార్యం, వాచికం అనే
చతుర్విధాభినయాలను 'వాచికం' అనే ఏకైక
అభినయవిధంలోకి ప్రవర్తింపజేయాలి[1]. డైలాగ్
చెప్పడం అనేది రేడియో నటులకు సర్కస్ ఫీటు
లాంటిది. సుశిక్షితుడైన సైనికుడు తన బాధ్యతలను
నిర్వర్తించేటప్పుడు ఎంత ఏకాగ్రతగా వుంటాడో
డైలాగ్ చెప్పేముందు రేడియో నటుడు ఆస్థితిలోకి
రావాలి. శ్రోత దృష్టి డైలాగ్ మీదే కేంద్రీకృతం
అయితే దృశ్యనాటకాలలో ప్రేక్షకుని దృష్టి అభినయం
పైన కేంద్రీకృతమై వుంటుంది.

---

1. కె. చిరంజీవి. జీవితమే నాటక రంగం, పుట. VI

## సౌండ్ ఎఫెక్ట్స్ :-

దృశ్యనాటకాలలో సౌండ్ ఎఫెక్ట్స్ ఉపయోగం వుంటుంది. అయితే శ్రవ్యనాటకంలో సౌండ్ ఎఫెక్ట్స్ కీలక పాత్ర వహిస్తున్నాయి.

దృశ్యరూపకం ప్రదర్శించేప్పుడు అక్కడి పరిస్థితులకు అర్థం పట్టేది స్టేజి సెట్టింగ్. ఆ సెట్టింగ్ రియాలిస్టిక్‌గా కాని, సింబాలిక్‌గా గాని, ఊహాత్మకంగా కాని యే విధంగైనా సరే చివరకు చిన్న అట్టముక్క మీద రాసినా ఆ నాటకం పరిస్థితులను ప్రేక్షకుడు అర్థం చేసుకోగలడు. ఇవేవి రేడియోనాటకంలో వుండవు. కాబట్టి అక్కడి పరిస్థితులను శ్రోతకు అవగాహన పరచడానికి సౌండ్ ఎఫెక్ట్స్ వాడుతారు. రంగస్థల స్టేజికి[1] ప్రత్యామ్నాయం శ్రవ్యనాటకంలో సౌండ్ ఎఫెక్ట్స్.

---

1. అదే. పుట. VII

దృశ్యనాటకాలలో సౌండ్ ఎఫెక్ట్స్‌ని ఆయా పాత్రల ప్రవేశ, నిష్క్రమణాల సందర్భంగా వాడడం జరుగుతుంది. ఆయా సన్నివేశాలు హాస్యానికి సంబంధించినవా, దుఃఖానికి సంబంధించినవా లేదా 'భారమైన (సీరియస్) సన్నివేశమా వంటి అంశాలను ఈ సౌండ్ ఎఫెక్ట్స్ ద్వారా ప్రేక్షకునికి ముందే తెలియజేసే ప్రయత్నం చేస్తారు. ఈ సౌండ్ ఎఫెక్ట్స్‌ని ఆయా పాత్రల ప్రత్యేకతను తెలియజెప్పడానికి కూడా వాడడం జరుగుతుంది. ఉదాహరణకి ప్రతినాయకుని రాకను తెలియజేయడం, హాస్యనటుని రాకను ముందుగానే నిర్దేశించడం మొదలైన అంశాలను తెలియజేసేందుకు సౌండ్ ఎఫెక్ట్స్‌ని వాడతారు.

శ్రవ్యనాటకంలో స్థలనిర్దేశం చేయడానికి సౌండ్ ఎఫెక్ట్స్‌ని వాడతారని ముందే చెప్పుకున్నాం. పక్షుల కిలకిలా రావాలు, వర్షం చప్పుడు,

సెలయేటి గలగలలు, బూట్ల చప్పుడు, తలుపు వేసిన చప్పుడు, మూసిన చప్పుడు, తట్టిన చప్పుడు, రైలు శబ్దం ... ఇవితరాలు రేడియో నాటకంలో వాడే సౌండ్ ఎఫెక్ట్స్‌లో కొన్ని కొన్ని పాత్రల భౌతికమైన వాతావరణాన్ని కల్పించడంలో ఈ సౌండ్ ఎఫెక్ట్స్‌ని ఉపయోగిస్తారు. రేడియో నాటకంలో సౌండ్ ఎఫెక్ట్స్ వాడినప్పుడు అది ఆ సన్నివేశంలో, సంభాషణలలో ఇక్క భావం పొందగలగాలి."[1] ఈ సౌండ్ ఎఫెక్ట్స్‌ని విచక్షణా రహితంగా వాడ కూడదు. అలా వాడితే నాటకం రసాభాస అవుతుంది.

**సంగీతం:-**

సంగీతం శ్రవ్యరూపకంలో గాని,

---

1. ఇంద్రగంటి శ్రీకాంతశర్మ. ఆలోచన పుట. 120.

దృశ్యరూపకంలో గాని ప్రేక్షకుడు లేదా శ్రోత యొక్క ఏకాగ్రతను నిలపడానికి దోహదం చేస్తుంది. రెండురకాల నాటకాలలోని పాత్రలు పాటలు పాడడం గాని, పద్యాల పఠిస్తున్నప్పుడు ఈ సంగీతం ఉపయోగపడుతుంది. సౌండ్ ఎఫెక్ట్స్ సంగీతం మరింత వన్నె తెస్తుంది. ఒక సన్నివేశంలో మానసికమైన వాతావరణాన్ని, అంటే ఆనందం, దుఃఖం, ఉద్వేగం వంటి వాటిని వాద్య సంగీతం అభివ్యక్తం చేయగలదు.[1]

కె. చిరంజీవి గారు మ్యూజిక్‌ని ఆబ్జెక్టివ్ మ్యూజిక్, సబ్జెక్టివ్ మ్యూజిక్ గా విభజించాడు. నాటకంలోని పాత్రలు పాడే పాటలు గాని, లేదా ఆ నాటకం జరిగే ప్రాంతంలో పాడుకునే సంగీతం గాని,

---

1. ఇంద్రగంటి శ్రీకాంత శర్మ. ఆలోచన, పుట. 119.

ఆబ్జెక్టివ్ మ్యూజిక్ కిందికి వస్తుంది. బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ గాను, స్పాట్ మ్యూజిక్ గాను, మూడ్ మ్యూజిక్ గాను ఉపయుక్తమయ్యేదాన్ని సబ్జెక్టివ్ మ్యూజిక్ అనవచ్చు.[1]

దృశ్యనాటకాలలో రెండురకాల సంగీతం ఉపయోగపడగా రేడియో నాటకంలో సబ్జెక్టివ్ మ్యూజిక్ ఎక్కువగా ఉపకరిస్తుంది. భావోద్వేగాన్ని, రసపుష్టిని కలిగించడమే సంగీతం ప్రధానోద్దేశ్యం.

మైక్ :-

దృశ్య, శ్రవ్యరూపకాలలో ప్రధానంగా కనిపించే సాధనం మైక్. దృశ్యరూపకంలో డైలాగని ప్రేక్షకునికి ఏ రేంజిలో చేరవేస్తే అతను ఆస్వాధిస్తాడో నటుడు తెలుసుకుని

---

1. కె. చిరంజీవి, జీవితమే నాటకరంగం, పుట. VIII.

'మైక్' కి తనకి దూరం మెంటైన్ చేస్తాడు. రేడియో నాటకంలో ప్రధాన సాధనం మైక్ నటుడు లేదా నటి మైక్‌కి బాగా దగ్గరగా, మధ్యమ దూరంలో, అతిదూరంలో సంభాషణలు చెప్పడాన్ని బట్టి close-up, Mid-shot, Long-shot effects కలిగించవచ్చు.[1] 'మైక్' ఉపయోగించే టెక్నిక్, పరిజ్ఞానం లేని వాళ్ళు రేడియో నాటకానికి 'ఎరంగంలోనూ' పనికి రారు.

నాటక రచన :-

దృశ్య, శ్రవ్య నాటకాల రచన 'మీడియా' తేడా వలన విభిన్నంగా సాగుతుంది. దృశ్యనాటక రచన చేయడానికి కొన్ని హద్దులుంటాయి. కాని శ్రవ్య నాటక

---

1. ఇంద్రగంటి శ్రీకాంత శర్మ. ఆలోచన. పుట. 122.

రచనకు హద్దులుండవు. దృశ్యనాటకంలో ఒక సెట్టింగ్‌ను దృష్టిలో వుంచుకుని చేయాల్సివస్తుంది. అంకాలెక్కువున్న నాటకమైతే ఎన్ని అంకాలుంటే, అన్ని సెట్టింగ్‌లను దృష్టిలో వుంచుకుని నాటక రచన చేయాలి. ఆ హద్దుల్లోనే రచన సాగాలి.

కాని శ్రవ్యనాటకరచనలో అటువంటి ఇబ్బందులు లేవు. ఈ సమయంలో ఇండియాలో టిఫిన్ చేసి, టీ తాగి, అమెరికాలో షాపింగ్ చేసి, ఇంగ్లాండ్‌లో లంచ్ చేసి, ఫ్రాన్స్‌లో సినిమా చూసి, తిరిగి ఇండియాలో సప్పర్ చేసినట్లు రేడియో నాటకంలో సన్నివేశాలకు రచయిత రూపకల్పన చేయవచ్చు. కాని, రూపక నిర్మాణ శిల్పదృష్టితో వస్త్వైక్యమును పరిరక్షించుకొనుట రచయిత విధి.[1] కాబట్టి రచయిత జాగ్రత్త వహించాల్సి వుంటుంది.

---

1. పి.ఎస్.ఆర్. అప్పారావు. తెలుగు నాటక వికాసం, పుట. 497.

ఫ్లాష్ బ్యాక్‌కు సంబంధించిన సన్నివేశాలను రంగస్థల నాటక రచనలో ఊహించుట కష్టం. ప్రదర్శించుట కష్టమే. కాని రేడియో నాటకంలో ఆ అవస్థలు లేవు. ఎన్ని ఫ్లాష్‌బ్యాక్‌లనైనా సృష్టించవచ్చు. వాటి ఆధారంతో నాటకాన్ని మరింత రక్తకట్టించే అవకాశం రచయితకు ఎక్కువ.

ఊహలకు అవకాశం లేనిది దృశ్య రూపకం, ఊహలకు ఎన్ని రెక్కలనైనా మొలిపించగలిగింది రేడియో నాటకం. కె. చిరంజీవి గారి మాటల్లో చెప్పాలంటే "శ్రోత ఊహలకు పురులు విప్పుతుంది రేడియో నాటకం."[1]

రంగస్థలం నందు ప్రదర్శించు నాటకానికి ప్రేక్షకుల్ని తనవైపుకు ఆకర్షించుకునేందుకు ఎన్నో

---

1. కె. చిరంజీవి. జీవితమే నాటకరంగం, పుట xii

హంగులుంటాయి. రచయిత రచనా పటిమకు తోడు, నటుని హావభావాలు, సెట్టింగు, ఆహార్యం ఇవన్నీ సహకరిస్తాయి. కాని రేడియోశ్రోతను ఆకర్షించడానికి రచయిత చాలా కష్టపడాలి. సంభాషణల రచనలో చాలా శ్రద్ధవహించాలి. క్లుప్తంగా, స్పష్టంగా మంచి పటుత్వం వున్న, సరళమైన డైలాగ్స్‌కి మాత్రమే రచయిత సృష్టించాలి. రచయిత యొక్క సామర్థ్యం పైననే ఎక్కువ శాతం శ్రవ్యరూపకం శ్రోతను ఆకర్షించగలుగుతుంది.

రంగస్థల నాటకం సందర్శించే ప్రేక్షకుల సంఖ్య వందల్లోనే వుంటుంది. అందులో అధికశాతం పెద్దలుండడం సహజం. కాబట్టి రంగస్థలనాటక రచన ఎలాసాగినా, అక్కడి ప్రదర్శనను బట్టి విజయ వంత మౌతుంది ఇక సినిమాల విషయానికొస్తే 'A' సర్టిఫికెట్లు, 'U' సర్టిఫికెట్లు ఇస్తారు. కాని రేడియోనాటకం

అట్లా కాదు . దీనికి యే సర్టిఫికెట్లు వుండవు
శ్రోతలంతా భిన్నవయస్కులు వుంటారు.
వృద్ధులు, మహిళలు, పిల్లలు వుంటారు.
కాబట్టి రచయిత ఈ అంశాలన్నింటిని
దృష్టిలో పెట్టుకుని రచన చేయాలి.
కె. చిరంజీవి గారు రేడియో నాటకాలు ఎప్పుడూ
'With in the bounds of decency' లో
తప్పక ఉండాలి[1] అంటారు.

ఇలాగే రంగస్థలనాటకం స్క్రిప్టులో
రచయిత బ్రాకెట్లో 'రంగయ్య నిష్క్రమిస్తాడు
అని రాస్తే అది చదువుకుని ఆ పాత్రధారి
అక్కన్నుంచి వెళ్ళిపోతాడు. అదే అంశం
రేడియో నాటక రచయిత వ్రాస్తే అది
చదువుకుని ఆ పాత్రధారి వెళ్ళిపోతే....
కుదిరే పని కాదు. కాబట్టి అతను
వెళ్ళిపోతున్న విషయాన్ని శ్రోతకు డైలాగ్

1. కె. చిరంజీవి. జీవితమే నాటక రంగం, పుట ౫.

ద్వారా చెప్పించాలి రచయిత. 

రంగస్థల నాటకంలో లేని ఒక సౌలభ్యం శ్రవ్య నాటకానికి ఉందంటారు, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ గారు. అదేమిటంటే "నేడు తెలుగు నాటక రంగస్థలం మీద రంగాలంకరణ విషయంలో, దృశ్యాల కల్పనా విషయంలో ఎన్నో ప్రతిబంధకాలున్నాయి. శ్రవ్య నాటకానికి ఈ బాధలు లేవు. నాటక వ్యవధానాన్ని బట్టి అవసరమైన సన్నివేశాలను, విభిన్న ప్రదేశాలలో కల్పించవచ్చు"[1]. అవసరాన్ని బట్టి ఎన్ని స్త్రీ పాత్రలనైనా రేడియో నాటకం కోసం సృష్టించవచ్చు. ఈ అవకాశం వల్ల రేడియో నాటక కర్త తాను చెప్పాలనుకున్న భావాలను, చెప్పించాలనుకున్న పాత్రల ద్వార చెప్పించ గలడు.

దృశ్య నాటకం ప్రేక్షకున్ని ఒక పరిమిత వాతావరణంలో లీనమయ్యేట్టు చేస్తుంది.

---

1. ఇంద్రగంటి శ్రీకాంత శర్మ. ఆలోచన, పుట, 120.

కాని శ్రవ్య నాటకం ఈ క్షణం యుద్ధరంగంలో, మరో క్షణం ప్రేయసి మనసులో, ఆ తరువాతి క్షణం మానససరోవరప్రాంతానికి శ్రోతను తీసుకెళ్ళగలదు. ఒకటి మాటలో చెప్పాలంటే శ్రవ్య నాటకం, మనసు పరిగెత్తేంత వేగంగా శ్రోతను పరుగెత్తించగలదు.

దృశ్య నాటకంలో ఒక పాత్రకు నటుణ్ని ఎంచుకోవాలంటే ఆ పాత్రకు సరిపడా వయసు, ఫిజిక్ కావాలి, గొంతు కావాలి, అభినయం అవలీలగా చేయగలగాలి. అన్నింటికి మించి సభాకంపనం (stage fear) వుండకూడదు. అప్పుడే అతడు రాణించగలడు. కాని రేడియో నాటకానికి అవసరమయే నటునికి అవసరమైంది కేవలం గొంతు. అతడు యాభై సంవత్సరాల వృద్ధుడైనా పరవాలేదు 'గొంతు' కుర్రవాడికి సరిపడా వుంటే 20 ఏళ్ళ పాత్రను పోషింపజేయవచ్చు. డెబ్భై ఏళ్ళ వృద్ధురాలిని 16 ఏళ్ళ కన్నెపిల్ల పాత్రకి గొంతు సరిపోతే

ఎంపిక చేయవచ్చు.

దృశ్యరూపకం లాగా శ్రవ్యరూపకానికి ఒక నిర్థిష్టమైన రూపం లేదు. పెద్దనాటకాన్ని, నాటికను, ఏకాంకికను, పద్యరూపకాన్ని, గేయ రూపకాన్ని దేన్నయినా సరే జాగ్రత్తగా మార్పులు, చేర్పులు చేసి రేడియోలో ప్రసారం చేయవచ్చు.[1] 'ఏకాంకికలు' రేడియో ప్రసారానికి ఎక్కువగా అనుకూలంగా వుంటాయన్న విషయం గమనార్హం. అయితే రేడియో వాళ్ళు తెలుచుకుంటే బహిరంగ ప్రదేశాలలో ప్రదర్శించే నాటకాల్ని రికార్డు చేసి ప్రసారం చేయవచ్చు, అంతే కాదు ప్రత్యక్షప్రసారం కూడా చేయవచ్చు.

ప్రస్తుతం ప్రతిరోజు రేడియో కేంద్రాలు నాటకాల్ని, నాటికల్ని ప్రసారం చేస్తున్నాయి.

---

1. పి. ఎస్. ఆర్. అప్పారావు. తెలుగు నాటక వికాసం, పుట. 497.

60 నిమిషాల నిడివి గల నాటకాలు, 30 నిమిషాల నిడివి గలవి, 20 నిమిషాల నిడివి గలవి, 15 నిమిషాల నిడివి గలవి, 10 నిమిషాల నిడివి గల నాటికలను ప్రసారం చేస్తున్నాయి. సంగీత రూపకాలను కూడా ప్రసారం చేస్తున్నాయి. పెద్ద పెద్ద నాటకాలను ధారావాహికలుగా ప్రసారం చేస్తున్నాయి.

తెలుగులో నాటకరచన పాశ్చాత్యుల ప్రభావమేనన్న విషయం తెలిసిందే. ఆ ప్రభావం వల్లనే శ్రవ్యరూపకాలు తెలుగు నాటక సాహిత్యంలో స్థానాన్ని సంపాదించుకున్నవి. డా|| పోణంగి శ్రీరామ అప్పారావు గారి మాటల్లో చెప్పాలంటే "తెలుగులో దృశ్యరూపక, శ్రవ్య రూపక ప్రక్రియలకు మార్గదర్శకులు పాశ్చాత్యులే అయినప్పటికినీ, తెలుగు రచయితలు గ్రహించిన, లేదా సృష్టించుకొన్న కథలలో, నూటికి నూరు పాళ్ళు, జాతీయతయే అందునా ముఖ్యంగా తెలుగుదనమే - ప్రతిబింబించుట

విశేషం[1]

దృశ్యరూపకాలు రాసిన రచయితలె శ్రవ్యరూపకాలు రాస్తున్నారు. శ్రవ్య నాటక రచయితలు సైతం దృశ్య నాటకాల రూపకల్పనలో ప్రతిభ కనబరుస్తున్నారు. అందుకే ఈ దృశ్య శ్రవ్య రూపకాలు 'ఒకే కొమ్మకు పూచిన పువ్వులు'. అవి తెలుగు నాటక సాహిత్యంలో నిత్యం సౌరభాలు వెదజల్లుతూ వుంటాయి. జాతీయ సమైక్యతా సాధనలో, విజ్ఞానాత్మక విషయాలను ప్రజలందరికీ చేరవేయడంలో ఈ దృశ్య, శ్రవ్య రూపకాలు విజయవంతమైన పాత్రను నిర్వహిస్తున్నాయి.

---

1. పి. ఎస్. ఆర్. అప్పారావు. తెలుగు నాటక వికాసం, పుట 497.

# తృతీయాధ్యాయం :-

1. చిరంజీవి గారి రేడియో నాటికలు (శ్రవ్య రూపకాలు) వర్గీకరణ
2. వస్తు వైవిధ్యం - సందేశాత్మకత
3. పాత్ర చిత్రణ - వాస్తవికత
4. సంభాషణలు - మాండలికత
5. శిల్ప సౌందర్యం - ముగింపు

# చిరంజీవిగారి రేడియో నాటకాలు (నృత్యరూపకాలు) వర్గీకరణ

కె. చిరంజీవిగారి రేడియోనాటకాలు "జీవితమే నాటకరంగం" అన్న శీర్షికలో సంపుటంగా వెలువడ్డాయి. అందులో 'వంశాంకురం', 'శ్రీకృష్ణ శిరోభారం', 'ఊరోళ్ళు మేల్కొంటున్నారు', 'అకాలమందు', 'బోళ్ళు తిరగబడుతున్నాయి', 'శాంతిసమరం', 'కాలయంత్రం' వున్నాయి.

వీటిలో 'వంశాంకురం', 'ఊరోళ్ళు మేల్కొంటున్నారు', 'అకాలమందు', 'బోళ్ళు తిరగబడుతున్నాయి', 'శాంతిసమరం' సాంఘిక నాటకాలు.

'ఆర్టిఫిషియల్' ఇన్‌సెమినేషన్' అన్న అంశం ప్రధానంగా సాగి, ప్రేమను సఫలం చేసుకోడానికి ధైర్యం

ఎంత అవసరమో చక్కగా వివరించిన సాంఘిక నాటకం వంశాంకురం.

పూర్తి తెలంగాణా మాండలికంలో దరిద్రం అంచున పల్లెటూరులో నివసించే కుటుంబం పడే అవస్థలు, ఆడపిల్ల పెళ్ళిచేస్తే కట్న పిశాచి చేసే అకృత్యాలు మొదలగు వాటిని హృదయ విదారకంగా చెప్పిన సాంఘిక నాటకం "ఊరోళ్ళు మేలొంటున్నారు".

పారిశ్రామిక వేత్తల వ్యాపార వైఖర్ని, ఊహా సౌధాలు నిర్మించుకుంటూ కలలే జీవితంగా సాగిస్తున్న ఒక యువకుడు "తానొక శాస్త్రజ్ఞుడిగా మారి ఆకలిమందు కనుగొనడంలో బడాబడా వ్యాపార వేత్తలు తన ముందు క్యూలో నిల్చోవడం, దేశమంతా అల్లకల్లోలం చెలరేగినట్లు ఊహించుకోవడం, మెలకువ వచ్చిన తర్వాత తన ఊహలపట్ల తానే నవ్వుకోవడం ఈ 'ఆకలిమందు' అనే సాంఘిక నాటకంలో వివరించబడింది.

భూస్వాముల దౌర్జన్య ధోరణికి, దళితుల

పట్ల సమాజంలో చూసే చిన్న చూపుకు వ్యతిరేకంగా వచ్చిన రెండు సాంఘిక నాటకాలు 'భిక్షు తిరగబడుతున్నాయి', 'శాంతి సమరం'.

'శ్రీకృష్ణశిరోభారం' ఒక ఫాంటసి, ప్రయోజనాత్మక పౌరాణికం. సామాజికత మేళవించిన హాస్యభరిత సందేశాత్మక నాటకం ఇది. భూలోకంలో ఆకలితో నకనకలాడుతున్న ఒక బిచ్చమ్మకి ఒక చిన్నారి తన ఇంట్లో వున్న కూడుపెట్టి ఆకలి తీర్చడంలో ఆగ్రహించి వాళ్ళమ్మ దారుణంగా హింసించడంలో, ఆ పిల్ల పడే బాధలకు స్వర్గంలోని శ్రీకృష్ణశిరోభారానికి సంబంధం కల్పించి, నాటకీయంగా పరిష్కారం అందించిన ఫాంటసి 'శ్రీకృష్ణశిరోభారం'.

'కాలయంత్రం' ఒక సైన్‌ఫిక్ నాటకం. కాలయంత్రం అనే అత్యాధునిక యంత్రంలో ప్రయాణించి భూత భవిష్యత్తు కాలాలలో, వర్తమానంలోనే సంచరించవచ్చు. ఈ సైంటిఫిక్ నాటకం ఒక ప్రయోగం.

# వస్తు వైవిధ్యం - సందేశాత్మకత

## వంశాంకురం:

దేశికాచార్యులు, పావని ఆదర్శదంపతులు. దేశికాచార్యులు కవి. పావని ఉద్యోగస్తురాలు. వారికిద్దరు మగపిల్లలు. ధర్మారావు, సుందరి మరో జంట. సుందరికి సంతానయోగం లేదని మిసెస్ అండ్ మిస్టర్ డాక్టర్ జేమ్స్‌లు నిర్ధారిస్తారు. వంశోద్ధారకుని కొరకు తపించే ధర్మారావు డాక్టర్ల సలహా కోరతాడు. డాక్టర్ జేమ్స్ రెండవపెళ్లి చేసుకోమని లేదా 'ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్'[1] అనే మార్గాలను సూచిస్తాడు. రెండోపెళ్లికి ఇష్టపడని ధర్మారావు 'ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్'కు అంగీకరించి అందుకు పత్రికా ప్రకటన ఇవ్వవలసిందిగా కోరతాడు. "శారీరక సంబంధానికి తావులేని ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ వల్ల బిడ్డను కనిచ్చిన వారికి యాభైవేల రూపాయల బహుమతి

---

1. కృత్రిమ సంపర్కం : టెస్ట్‌ట్యూబ్ బేబి ద్వారా కాకుండా స్త్రీగర్భాశయంలోకి శారీరక సంబంధం లేకుండా వీర్యాన్నిపంపి గర్భాధారణం చేయడం.

ఇవ్వబడును" అనే ప్రకటన ఇస్తాడు.

ప్రతిరోజు క్రమం తప్పకుండా పేపరు చదివే అలవాటు వున్న దేశికాచార్యులు పేపర్ బాయ్ పట్ల సానుభూతితో వుంటాడు. పేపర్ బాయ్ కోరిక మేరకు అతని జీవనగాథకు అక్షరరూపం ఇస్తానంటాడు. డాక్టర్ జేమ్స్ ప్రకటన పేపర్లో చదివిన దేశికాచార్యులు పావనిని అందుకు ఒప్పుకోవలసిందిగా సూచిస్తాడు. తన ప్రకటనకు ఎంతో రెస్పాన్స్ వచ్చినా పావనినే అందుకు ఎన్నుకుంటాడు డాక్టర్ జేమ్స్.

డబ్బుకోసం కాకుండా ధర్మనిర్వహణకోసమే తాము ఈ పనికి అంగీకరించినట్లు దేశికాచార్యులు డాక్టర్‌కి వివరిస్తాడు. ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ కు అంగీకరించిన వ్యక్తి, క్షేత్రార్థి ఇరువురు ఒకరికొకరు తెలియకుండా వుంటామన్న హామీతో డాక్టర్ జేమ్స్ ఒప్పందం కుదురుస్తాడు. ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ ద్వారా పావని గర్భం దాలుస్తుంది. హెల్త్ చెకింగ్ కై ఆసుపత్రికి వచ్చిన పావనికి ధర్మరాజ్ తటస్థపడతాడు.

వారి పూర్వ పరిచయం. పావనికి మదిలో మెదులుతుంది.

ధర్మారావు, పావని ప్రేమికులు. అయితే పావని పూర్వీకులలో 'హై ఫెర్టిలిటీ'[1] లేని కారణంగా వారి ప్రేమ పెళ్ళి వరకు చేరకుండా పోతుంది. ధర్మారావు, పావని ఆసుపత్రిలో ఒకర్నొకరు పలకరించుకోవడం చూసి డాక్టర్ మిసెస్ జేమ్స్ వారిమధ్య రహస్యాన్ని నోరు జారుతుంది. గతంలో తనను మోసం చేసిన వ్యక్తికి సంతానాన్ని తను సంతానాన్ని అందించడం జీర్ణించుకోలేక పోతుంది. అబార్షన్‌కు కూడా సిద్ధపడుతుంది. ధర్మారావు క్షమాపణ కోరినా తిరస్కరిస్తుంది. దేశికాచార్యులు, డాక్టర్లు నచ్చచెప్పడం వల్ల ధర్మ నిర్వాహణకు కట్టుబడుతుంది.

నెలలు నిండిన పావనికి ఇద్దరు ఆడపిల్లలకు (కవలలు) జన్మనిచ్చి చనిపోతుంది. అప్పుడు అక్కడికి వచ్చిన సుందరి తండ్రి కొండలరావు ఆడపిల్లల్ని

---

1. వంశంలో ఎక్కువ సంతానం కలిగివుండడం.

వద్దంటాడు. తనకూతురు గర్భవతి అవ్వతుందని పెద్ద డాక్టర్లు చెప్పారని వాదిస్తాడు. ధర్మారావు దగ్గర తోటమాలిగా పని చేస్తున్న రామయ్య అక్కడికి వచ్చి పరిస్థితులను గమనించి ధర్మారావుతో "అసలు ఏమి పండదు అనుకున్న మీ భూమిలో పనస పండించాను. పిల్లలు లేని నేను 'మారుమనువు కూతుర్ని'[1] సొంత కూతురుకన్నా ఎక్కువగా ప్రేమతో పెంచి మీ దయవల్ల పెళ్ళిచేసాను. ఇప్పుడు అప్పగింతలు. నేను వెళ్తాను". అంటూ వెళ్ళి పోతాడు.

ఈ నాటకంద్వారా శ్రోతలకు అందించే సందేశం

ఈ నాటకానికి వున్న ముగింపే. ఈ నాటకం చివర్లో "దేశికాచార్యులు రామయ్యను నమస్కరించి ఎవరికో పుట్టిన మారుమనువు కూతుర్ని విశాల హృదయంతో చేరదీసిన అతని ఔన్నత్యానికి జోహార్లర్పిస్తాడు. క్షేత్రము, బీజము కన్న 'స్థితి' ప్రధానమని రామయ్యను చూసి నేర్చుకోవాలంటాడు. పావని మరణానికి దుఃఖిస్తాడు.

---

1. రెండవ భార్యకు ఆమె మొదటి భర్త ద్వారా కలిగిన కూతురు.

ఎప్పుడూ తన కథ వ్రాయమని అడుగుతూ వుండే పేపర్ బాయ్ "సార్! బిడ్డల్ని ఇప్పుడివ్వరట వెళ్దాం" అంటాడు. "నా పావని చితి మంటల దగ్గరే తల్లిదండ్రీ తెలియని నీ కథకు నాంది పలుకుతాను" అంటాడు దేశికాచార్యులు.

ఈ నాటకంలో మనిషి వైజ్ఞానిక అభివృద్ధికి తార్కాణంగా టెస్ట్‌ట్యూబ్ బేబీ, ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్‌లను రచయిత పరిచయం చేస్తూ, సంతానం కలగడానికి ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్స్‌ను పరిశీలించే మూఢ విశ్వాసాల్ని తుంచడానికి ప్రయత్నం చేసాడు. పుట్టబోయే శిశువు ఆడనో, మగనో అవడానికి పురుషుడే కారణమని స్త్రీలలో 'x x' క్రోమోజోములు, పురుషులలో 'x y' క్రోమోజోములుంటాయని, 'x' కు 'x' కలిస్తే ఆడ, 'x కు y' కలిస్తే మగ శిశువులు జన్మిస్తారని తెలుపుతూ రచయిత ఆడపిల్లల్ని కనే తల్లులను బాధించే ఈ సమాజం యొక్క కళ్ళు తెరిపించేందుకు ప్రయత్నించాడు. 'ప్రేమ' అనేది కడుపులో వుండదని, హృదయంలో వుంటుందని సందేశమిచ్చాడు.

# ఊరోళ్ళు మేల్కొంటున్నారు.

భర్త రాక్షసుడై, అమాయకురాలైన భార్యను కట్నం అంటూ, ఆడపిల్లను కన్నావు అంటూ నానా హింసలు పెడుతూ చివరికి చంపడానికి సైతం సిద్ధపడిన ఒక కిరాతకున్ని ఊరినుంచి బహిష్కరించి ఆ స్త్రీని తమ ఊరి ఆడపడుచుగా గౌరవించి ప్రజలే ఆమె బాధ్యతను స్వీకరించడం ఈ నాటకం యొక్క ఇతివృత్తం.

బాలరాజు, వరమ్మల పెళ్ళినాడు, వరమ్మ అన్న రంగయ్య ఇస్తానన్న కట్నం ఇవ్వలేకపోతాడు. బాలరాజు తండ్రి బ్రహ్మయ్య పీటలమీది పెళ్ళి ఆపేస్తానంటాడు. చివరకు అనంతయ్య అనే ఊరిపెద్ద జోక్యంతో ఆనాడు పెళ్ళి జరిగిపోతుంది. అయితే దీపావళి అమావాస్య నాటికి ఇవ్వాల్సిన కట్నం ఇచ్చేయాలని ఒప్పందం చేస్తారు.

ఇస్తానన్న కట్నం ఇవ్వని కారణంగా, వరమ్మకు అత్తారింట్లో భర్త పెట్టే అవస్థలు వర్ణనాతీతం. ఆడ-కూతురు అనికూడా చూడకుండా భార్యను కమ్మరిపని

చేయమని ప్రమాయిస్తాడు. అందుకోసం తనదగ్గర పనిచేసే వాళ్ళే కూడా వెళ్ళిపోతారు.

పారిపోయిన తన తమ్ముడిని వెదకడానికి వెళ్ళి ఇంటికి వచ్చిన రంగయ్య, వరమ్మ కష్టాలు చూసి తన అశక్తతను తిట్టుకుంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంటాడు. అప్పుడు కూడా బాలరాజు " తన కట్నం డబ్బులు, దీపావళి " అంటూ గుర్తు చేస్తాడు. తనను చదివించకుండా, షావుకారు దగ్గర పనికి పంపినందుకు రంగయ్య తమ్ముడు పారిపోతాడు.

బాలరాజు మళ్ళీ ఒకసారి రంగయ్య వాళ్ళింటికెళ్ళి, తాను టూ ఇన్ వన్ (టేప్ రికార్డర్ కమ్ రేడియో) కొన్నానని దానికి ఐదువందలు కావాలని అడుగుతాడు. తన దగ్గర వున్న కేవలం రెండువందల ముప్పైరూపాయలను రంగయ్య ఇవ్వబోవడంతో 'బిచ్చం ఇస్తున్నావా' అంటూ నానా బూతులు తిట్టి, దసరాలోపల కట్నం డబ్బులు ఇవ్వకపోతే వరమ్మను పండగకు పంపనని బెదిరించి వెళ్ళిపోతాడు.

దసరాకు ముందు వరమ్మ తల్లి సీతమ్మ, అన్న రంగయ్య ఐదువందల రూపాయలు బాలరాజుకిచ్చి వరమ్మను తీసుకెళ్లారు. దీపావళికి బాలరాజును తీసుకెళ్తారు. ఇంటికి వచ్చిన తర్వాత తనకెవరు మర్యాదలు చెయ్యలేదని, వరమ్మ ముందు బాలరాజును తిట్టిపోస్తాడు.

బాలరాజు 'భాస్కర్ దందలకు పనికొస్తడని' సర్పంచ్ అసిస్టెంట్ గా నియమించుకుంటాడు. భాస్కర్ దందలలో బాలరాజు చాలా డబ్బు సంపాయిస్తుంటాడు. కొలువు పని మొత్తం వరమ్మకు అప్పజెప్తాడు.

వరమ్మకు ఆడబిడ్డ పుడ్తుంది. ఆమెను బాలరాజు పుట్టినింటినుండి తీసుకెళ్ళనంటాడు. చివరకు కొలువుపనికోసం తీసుకొచ్చుకుంటాడు. సర్పంచ్ దగ్గర కారోబార్గా పనిచేస్తున్న బాలరాజు నాడెట్ కొట్టేపనిని మానుకోవాలనుకుంటాడు. ఆ పని చేసేందుకు రంగయ్యను ఒప్పించమని వరమ్మకు చెప్పడంతో ఆమె ఎదురు తిరుగుతుంది. దాంతో పిల్లతల్లి అనికూడా చూడకుండా

పశువును బాదినట్లు బాదుతాడు. పుట్టింటికి పంపిస్తాడు. వరమ్మను ఇంట్లో వుంచుకోలేక రంగయ్య, సీతమ్మ తమ ఇంటిని అమ్మి బాలరాజుకు ఇవ్వవలసింది ఇచ్చేస్తారు. రంగయ్య ఇల్లు అమ్ముకున్నాడని తెలిసి నిశ్చయమైన పెళ్లి సంబంధం విడిపోతుంది.

రంగయ్య పెళ్లి సంబంధం విడిపోవడంతో బాలరాజు వరమ్మను హేళన చేస్తాడు. దాంతో ఆమె తిరగబడి మాట్లాడుతుంది. షరామామూలు అన్నట్లు 'గొడ్డును బాదినట్లు బాదుతాడు'. తలపై బలంగా దెబ్బలు తగులుతాయి. ఆస్పత్రిలో చేర్పిస్తారు. ఆసుపత్రిలో వరమ్మ పరిస్థితిని చూసిన రంగయ్య, అనంతయ్య కేసుపెడదామంటే, తన [illegible] జైల్లో పెట్టడం ఇష్టంలేక భర్త చెప్పమన్నట్లే 'పోటుగత్తె' వెనక నించి వచ్చి పొడిచిందని పోలీసులకు చెబుతుంది. గాయంవల్ల వరమ్మ ఒక కన్ను కోల్పోతుంది.

వరమ్మను హింసించినందుకు రంగయ్య బాలరాజుపై ఆగ్రహంతో తిడతాడు. అది మనసులో పెట్టుకుని తనను హత్య చేయడానికి ప్రయత్నించినట్లు బాలరాజు రంగయ్యపై

కిపోర్టు ఇస్తాడు. పోలీసులు రంగయ్యను బాగా తన్ని హింసిస్తారు.

ఇల్లును అమ్మేసిన రంగయ్య తన మరో చెల్లెలు వజ్రమ్మ పెళ్ళి చేయలేకపోతాడు. ఈడొచ్చిన పిల్లను ఇంట్లో ఉంచుకోలేక సీతమ్మ వజ్రమ్మ పెళ్ళి ఎలాగైనా చేయమని వరమ్మను కోరుతుంది. ఈ విషయం వరమ్మ బాలరాజుకు చెప్పడంతో మరుక్షణంతో సరేనంటాడు. వజ్రమ్మ కోసం సీతమ్మ తనదగ్గర వున్న కొన్ని పైసలు వరమ్మకిస్తుంది. వరమ్మదగ్గర డబ్బు చూసి బాలరాజు డబ్బెక్కడిదని హింసిస్తాడు. తనదగ్గర పనిచేసే యువకునితో వరమ్మకు అక్రమసంబంధాన్ని అంటగడతాడు. వజ్రమ్మను బాలరాజు పాడుచేసేందుకు ప్రయత్నించడంతో వరమ్మ ప్రతిఘటిస్తుంది. బాలరాజు వరమ్మను చితకబాదుతాడు. బయట చెట్టుకు కట్టి కొడతాడు. (వరమ్మ కడుపుతో వుంటుంది). చావుకు దగ్గరవుతుంది. బాలరాజు పారిపోతాడు. ఊరంతా వరమ్మ అరుపులకు మేలుకుంటుంది. అందరూ వరమ్మపై సానుభూతి చూపుతారు. ఆమెకు జరిగిన అన్యాయానే ఊరు తలచుకుంటుంది. పోలీసు కిపోర్టిస్తారు. పారిపోయిన బాలరాజును ఊరినించి వెలివేయాలని

తొలగిస్తారు. అంతేకాక వరమ్మను ఊరి ఆడపడుచుగా భావించి ఆమె బాధ్యతను స్వీకరించడంతో కథ ముగుస్తుంది.

వరకట్న పిశాచం చేసే ఆకృత్యాలను నిరసిస్తూ, నిరుపేదల జీవితాలకు ఏ విధంగా అది శాపంగా మారుతుందో ఈ నాటకంలో చిరంజీవి గారు చక్కగా ఆవిష్కరించారు. అభాగ్యుల పాలిట ఊరుమొత్తం అండగా నిలిచి వారి జీవితాలకు ఒక ఆధారం చూపించాలన్న సందేశం చాలా అద్భుతమైనది.

## ఆకలి మందు :

డాక్టర్ రాంబోషి 'ఆకలిమందు' కనుక్కొంటాడు. ఒక మాత్ర వేసుకుంటే జీవితాంతం ఆకలి వేయదు. ఆ మందును ఒక యువకునిపై ప్రయోగిస్తాడు. సక్సెస్ అవుతుంది. ఆ యువకుడు ఎత్తైన ఇంద్రకీలాద్రి భవనం పైన నిలబడి ఆకలిమందు గురించి అనౌన్స్ చేస్తూ వంద రూపాయలకొక మాత్ర విక్రయిస్తాడు. ఆ వంద రూపాయి

సంపాదించడానికి ప్రజలు ఎన్నో అరాచకాలకు పాల్పడు తుంటారు. ఒక బ్యాంకు మేనేజర్ బ్యాంకులోని డబ్బంతా ప్రజలకు పంచి పెడతారు. దోపిడీలు జరుగుతాయి. పోలీసులంతా శాంతి భద్రతల విషయమై ఆందోళన చెందుతారు. నిరుద్యోగులంతా ఆకలిమందును గమము ఉచితంగా పంపిణీ చేయాలని ఉద్యమించేందుకు సిద్ధమవుతారు. పరిస్థితిని వివరించి ఆకలిమందు విక్రయాన్ని ఆపించేందుకు కమీషనర్ ఆఫ్ పోలీసు రాంజోషి దగ్గరకు బయలు దేరుతాడు.

రాంజోషి ప్రేయసి కల్పన. రాంజోషి కనుగొన్న అపూర్వ విషయానికి సంబంధించి అతనిని అభినందించి పెళ్ళిచేసుకుంటానని ఖచ్చితంగా హామీ ఇస్తుంది. అప్పుడే డా॥ రాంజోషి రైవల్ డా॥ గోవింద్ వస్తాడు. అభినందిస్తాడు. కల్పన వెళ్ళిపోతుంది. ఆ వెంటనే ప్రఖ్యాత పారిశ్రామిక వేత్త కరణరంజన్ వస్తాడు. వారిరువురు రాంజోషి గదిలో బోనులో వున్న ఎలుకల్ని, కోతుల్ని చూసి ఆశ్చర్యపోతారు. 'వాటికి ఆకలిమందు వేసానా"ని 'గత ఆర్నెళ్ళుగా అవి ఏ ఆహారం ముట్టడం లేద"ని రాంజోషి వారికి వివరిస్తాడు.

అంతలోనే పలు మందుల కంపెనీల యజమాని శ్రీమాన్ జీ పోర్టబుల్ హెలికాప్టర్‌లో అక్కడికి వస్తాడు.

"ఇంద్రకీలాద్రి భవనంపై 'ఇచ్చట ఆకలిమందు వందరూపాయలకే అమ్మబడును' అని ప్రకటన పెట్టి విక్రయిస్తున్న ఆ యువకున్ని వెనక్కి పిలిపించమ"ని అంటాడు శ్రీమాన్‌జీ. 'ఆకలిమందు ఫార్ములా' తన హస్తగతం చేస్తే లక్షరూపాయలు ఇస్తానంటాడు. అందుకు రాంజోషి "మాత్ర ఖరీదు ఒక్కరూపాయి పెట్టినా జనాభా ప్రకారం అరవై కోట్లు లభిస్తాయి" అంటాడు. కరటరంజన్ ముప్పై కోట్లు ఇస్తానంటాడు. శ్రీమాన్, కరటరంజన్ ఈ విషయంపై వాదులాడుకుంటారు. అప్పుడే పోలీస్ కమీషనర్ వస్తాడు. 'ఆకలిమందు' వల్ల చెలరేగిన అల్లకల్లోలం గురించి వివరిస్తాడు. ధనికులు, పేదలు ఈ ఆకలిమందువల్ల సమానులై పోతున్నారని ధనికులు 'ఆకలిమందు సృష్టికర్తని' హతం చేయ యత్నిస్తారు. రాంజోషి మంచం మీద పడిపోతాడు. అక్కడికి కల్పన వస్తుంది. ఆకలిమందు తిన్న యువకుడు, ఎలుకలు, కోతులు పాషాణమై పోయాయని వివరిస్తుంది. ఆహారం తీసుకోని ఈతు పదార్థమైన జడత్వాన్ని పొందుతుందని. ఈ ప్రయత్నంలో నువ్వు ఫెయిల్యూర్

అయ్యావ"ని నిందిస్తుంది. 'పెళ్ళి చేసుకోను బాబా' అని వెళ్ళిపోతుంది.

ఈ కథంతా రామారావ్ అనే నిరుద్యోగి ఒక పార్కులో బెంచీపై పడుకొని కన్న కల. రామారావ్ ఒక కవి. పూటకు గతి లేని పేదవాడు. టైం అయిపోయినా పార్కులోనే వున్నందుకు అతన్ని పోలీసులు స్టేషన్‌కు పదవుంటారు. అతని చేష్టలను గమనించి పిచ్చివాడని వదిలేస్తారు. కథ ముగుస్తుంది

పూటకు గతిలేని వాడు కనే కలలు ఎలా వుంటాయో, అతని ఊహలు ఏ స్థాయిలో సాగుతాయో ఈ నాటకంద్వారా చక్కగా వివరించారు చిరంజీవి గారు. విజ్ఞాన పథంలో పురోగమిస్తూ ఎన్నో అద్భుతాలను సృష్టిస్తున్న మనిషి, ఆకలిమందు కనుక్కోలేకపోవడంలో గల గొప్పదనాన్ని, 'ఆహారం తీసుకొని ఈ దేహమైనా చైతన్యాన్ని పొందుతుందన్న" సున్నితమైన నిజం లా చక్కగా వివరించారు. రచయిత.

# బీళ్ళు తిరగబడుతున్నాయి:

అల్లంత దూరాన కనిపించే నీలగిరిపాల గురించి అవ్వను వీరదాసు అడుగుతాడు. జాతి జనులను జాగృత పరచి వారికి వెలుగును అందించాలన్న మహత్తరమైన లక్ష్యంతో ముందుకు సాగి చివరకు వారి చేతిలోనే అసువులు బాసిన ఒక మహావీరుని కథను అవ్వ వివరిస్తుంది. తాను కూడా అతనిలాగే తన జాతి జనులను జాగృత పరుస్తానని ప్రమాణం చేస్తాడు వీరదాసు.

ఆ ఊర్లో రాయుడు అనే భూస్వామి: ఊరి ప్రజల అవసరాలకు డబ్బులిచ్చి వారితో వెట్టిచాకిరి చేయించుకుని, వారి భూములను 'వేలిముద్రల' సహాయంతో హస్తగతం చేసుకుంటాడు. ఎదురు తిరిగిన వాని పనిబడతాడు.

రాయుడు అరాచకాలకు చరమగీతం పాడడానికి ఉద్యమించాలంటాడు యువకుడూ, బజనపంతులు అయిన వీరదాసు. అతనికి అండగా వుంటానంటాడు మరో యువకుడు సూరప్ప. సూరప్ప తల్లి ఎర్రెమ్మ జాగ్రత్తగా

వుండేమని చెబుతుంది. ఆశీస్సులకోసం కులపెద్ద ముసలయ్య దగ్గరకు వెళతారు. ముసలయ్య వాళ్ళను అభినందించి, రాయుడిపై తిరగబడి భూమిని సాధించు-కోలేకపోయిన వెంకటదాసు గురించి వివరిస్తాడు.

ముత్తమ్మ కొడుకు సర్కారు తోపులోని ముంజె కాయలు కొడుతుంటే అదిచూసిన రాయుడు అతన్ని చితగ్గొడతాడు. ఒకటయ్య ఆ కుర్రాన్ని రక్షిస్తాడు. ఈ విషయం తెలిసిన వీరదాసు, సూరప్ప, ముసలయ్య బాధపడ్తారు. రక్షించిన ఒకటయ్యను అభినందిస్తారు. 'దిక్కులేని వాళ్ళకు దేవుడేదిక్కు' అంటూ వెళ్ళిపోతాడు. వీరదాసు రాయుడిపై జరిపే పోరాటానికి సై అంటాడు ముసలయ్య.

ఒకరోజు జండాచెట్టుదగ్గర మాల, మాదిగల సంయుక్త సభను వీరదాసు ఏర్పాటు చేయిస్తాడు. దండోరా వేయిస్తాడు. అదివిని అందరూ తలోవిధంగా అనుకున్నా ఏం చెబుతారో అన్న ఆసక్తితో అందరూ జండాచెట్టు దగ్గరకు వస్తారు.

కులాలు ఎలా ఏర్పడ్డాయో వివరించి, తిరిగి అవి మనిషి జీవనగమనంలో అడ్డంకిగా ఎలా తయారయ్యాయో వివరిస్తాడు. ఆ పరిస్థితినుంచి బయటపడాలని ఉద్బోధిస్తాడు. ఒకప్పుడు పుట్టింది నాలుగు కులాలయితే ఇప్పుడు నాలుగువందల ఇరవైతొమ్మిదికి పైగా కులాలున్నాయని ఇవన్నీ మన అభివృద్ధికి ఆటంకాలని వివరిస్తాడు వీరదాసు. అతని ఆరాటానికి, చెబుతున్న విషయాలకు, వివరిస్తున్న తీరుకు ముగ్ధులై తమకు సరైన నాయకుడు దొరికాడన్న సంతృప్తిలో అంతా అతనికి జై కొడతారు.

సూరప్ప "రాయుడి సంగతి ఏమిటి"ని ప్రశ్నిస్తే, 'దానికి వేరేమార్గం ఉంద'ని అంటూ, సర్కారు ఇచ్చే బంజరు భూములను తీసుకుని సరికొత్తగా 'జీవనవాడ' నిర్మించుకుందాం అంటాడు వీరదాసు.

అందరూ బంజరు భూముల వద్దకు బండ్లమీద వెళుతుండగా రాయుడి బంటు హనుమంతు 'కర్రెంకజని అడ్డగిస్తాడు'. రాయుని డబ్బు చెల్లించేవరకు బండిని కదలనివ్వనంటాడు. రాయుడి అప్పు తీర్చడానికి

కోళ్ళను, మేకల్ని ఇచ్చేసినానని చెప్తాడు. కర్రెంకడు. అంతలో వీరదాసు కల్యాణసుమని రాయుడికి కర్రెంకడు రూపాయి పావల మాత్రమే ఇవ్వాల్సివస్తుందని, వచ్చే యేడాది ఇస్తాడని, ఈ విషయం రాయుడికి చెప్పమని పంపించేస్తాడు.

సర్కారు అందించిన బంజరుభూముల వద్దకు అందరు వస్తారు. వాటిని సాగు చేయడం సవాలుగా స్వీకరించమంటాడు వీరదాసు. అందరూ సై అంటారు. అందరికి పూట పూట తిండికి కష్టమవుతుంది. పుల్లిగాడు జీవనవాడను వదిలిపోతానంటాడు. కర్రెంకడి పెళ్ళాం ఎంకి తన బిడ్డ పాలకోసం ఏడవడంతో బాడ్దాకు పుడుకబెట్టి తింటుంది. బిడ్డకు పాలు ఇవ్వలేని తన అశక్తతకు తిట్టుకుంటుంది.

అంతలో సూరప్ప, బకన్న, ఫకీరు సర్కారు బియ్యపులారీని దారి మళ్ళించి అక్రమంగా పట్టుకొస్తారు. జనాన్ని ఆ లారీలోని బియ్యాన్ని తీసుకోమంటారు. ఎదిరించిన లారీడ్రైవర్‌ను సూరప్ప కొడతాడు.

వీరదాసు వచ్చి అడ్డుకుంటాడు. ఆ బియ్యాన్ని ముడితే 'తాను చచ్చినంత' అని ఒట్టు వేస్తాడు. అంతలోనే వీరదాసూ కథచెప్పిన అవ్వ వస్తుంది. వీరదాసును అభినందిస్తుంది. బియ్యాన్ని సర్కారుకు అప్పచెప్పి జరిగినదంతా వివరించమంటుంది. ఆకలికి ఆగలేక నాగలిముడు గుబ్బలు వెతుక్కుతినే ముసల్ది రామీ, చంటిపిల్లకు పాలివ్వలేని ఎంకి గురించి కూడా చెప్పమంటుంది. "ఆనాటి వెంకటదాసును 'ఆకలి' భరించలేక వెంటవున్న వారే చంపారు ఎందుకంటే వారిలో నాగరికత లేదు. ఈ నాటి ఈ ప్రజలు నీ మాటకు ఎంతో విలువనిస్తున్నారు. నిజంగా ఇది శుభ-సూచకమవుతుంది" అంటుంది అవ్వ.

అంతలో నీలిమేఘాలు మళ్ళీ దర్శనమిస్తాయి. ఉరుములు, మెరుపులు. ఆవెంటే వర్షం కురుస్తుంది. ఎడారి వంటి బీడు భూమి, బీడు బ్రతుకులు పులకితమవుతాయి. కథ శాంతి సమరం వైపు సాగుతుంది.

ఒకనాడు ఆకలితో అలమటించిన వారు తమని ముందుకు నడిపించిన వెంకటదాసుకు చంపితే

ఈనాటి ఆకలిగ్రస్తులు కొంత అస్థైర్యపడ్డా తమ-నాయకుని మాటకు విలువనిచ్చారు. రాబోయే తరాల సుఖ జీవనం కోసం త్యాగాలకు సిద్ధపడ్డారు. "జాతి ప్రగతికి కావల్సింది ముందు చూపు, అకుంఠిత దీక్ష, ఆకలివంటి అడ్డంకులను అధిగమించే సమయస్ఫూర్తి, త్యాగం అవసరం". అనే సందేశం ఈ నాటకం ద్వారా చక్కగా అందించారు చిరంజీవి గారు. "పులుగు లేసిక పొడిత్తే పేణాం తెని మట్టిగడ్డ తిరగబడుతుంది. ఇంక మనుసులు తిరగబడరా"[1] అన్న మాటలు 'అవ్వ' ద్వారా చెప్పించిన చిరంజీవి గారు జన చైతన్య నిర్వచనాన్ని గొప్పగా ఆవిష్కరించారు.

## శాంతి సమరం:

ఈ నాటకం 'బొమ్మ తిరగబడుతున్నాయి' కి కొనసాగింపు. రాయుడు, కరణప్పంతులు, రాయుడి అల్లుడు ఆనందమూర్తి ఈ ముగ్గురు జీవన వాదను మృత్యు-వాతకగా మార్చేందుకు ప్రయత్నిస్తారు. వేదికాల్లో

---

1. కె. చిరంజీవి. జీవితమే నాటకరంగం, బొమ్మ తిరగబడుతున్నాయి, పుట. 123.

డాక్టర్ చదువులు చదివిన ఆనందమూర్తికి రాయుడు ఆ పని అప్పచెప్తాడు. రాయుడుని కొంత మారాలని ఆనందమూర్తి చెప్తాడు. సూరిగాణ్ని సూరిగాడు అని, వీరిగాణ్ని వీరిగాడు అని పిలవవద్దని, వీరన్నగారు, సూర్యనారాయణగారు అని పిలవాలంటాడు. అందుకు ససేమిరా అంటాడు రాయుడుగారు. అయితే మొత్తం ప్లానంతా తానే నడుపుతానంటాడు, తనను పూర్తిగా నమ్మమంటాడు ఆనందమూర్తి. అందుకు రాయుడు. కరణం సరే నంటారు.

బసువులు ఆనందమూర్తికి అసిస్టెంట్. తనబాస్ పురమాయింపుతో బక్కేశ్వర్రావు గారిని (బలిజ బక్కయ్య) ఆనందమూర్తి వద్దకు తీసుకువెడతాడు. ఆనందమూర్తి బక్కయ్యతో 'జీవనవాడ' లో సుఖంగా వుంటున్నారా ? అని ప్రశ్నిస్తూ, వారు పడే బాధలను ఎత్తిచూపుతాడు. వీరదాసు ప్రతిసారి అదే పనిగా పట్నానికి పోవడానికి కారణం అక్కడ ఎవరితోనో తులకడానికే నని చెప్తాడు. వ్యవహారంతా దూరం అయ్యాక రాయుడు చాలా బాధపడుతున్నారని చెప్తాడు. ఈరి గ్రామంలో

లాను పొంగాను ఫాస్ఫరీని పెడుతున్నట్లు, పెట్టుబడి తనదని, పని మీదని, లాభం చెరిసగమని ఆశలు రేపి పంపుతాడు ఆనందమూర్తి, బకెయ్యను.

బకెయ్య అవినమ్మి సూరప్ప ముందు వీరదాసును తూలనాడుతాడు. అయితే వీరదాసు బకెయ్య ఇంటికి బసువుల రావడాన్ని గమనించి పరిస్థితి అర్థం చేసుకుని, బకెయ్య చేత నిజం కక్కిస్తాడు. తన తప్పిదానికి బకెయ్య పశ్చాత్తాప పడతాడు.

ఎదురుదెబ్బ తగలడంతో ఎలాగైనా సరే వీరదాసును దెబ్బ తీయాలని వ్యూహం పన్నుతాడు ఆనందమూర్తి. ఈ సారి తాగుబోతు పుల్లిగాడి పై బసువుల్ని ప్రయోగిస్తాడు. పంచాయితీ మెంబర్ అయిన పుల్లిగాడు కాస్త సారా పోయించడంతో ఆనందమూర్తి వల్లో పడిపోతాడు. "పంచాయితీ సర్పంచ్ అయిన వీరదాసు పంచాయితీకి వచ్చిన డబ్బు కొట్టేస్తున్నాడని ముసలయ్యతో చెబుతాడు పుల్లిగాడు. అక్కడే వున్న సూరప్ప వారించబోవడంతో, అప్పుడే సూరప్ప పెద్దమ్మ

రాములమ్మ అక్కడికి వస్తుంది. రహస్యం చెబుతాను
శేషమ్మంటుంది. సూరప్ప భార్యను వీరదాసు వుంచుకున్నాడని
చెబుతుంది. ఆగ్రహంతో సూరప్ప తనభార్య సరస్వతిని
చంపబోతే సరస్వతి ఎదురు తిరుగుతుంది. తనే పాపం
చేయలేదని చెబుతుంది. సరాసరి ఆనందమూర్తి
దగ్గరకు వెళ్ళి గతంలో ఆనందమూర్తి రాయుడి కొడుకును
చంపినట్లు తనదగ్గర సాక్ష్యాలున్నాయని చెబుతుంది. దాంతో
ఆనందమూర్తి బెంబేలెత్తుతాడు.

ఆనందమూర్తి జీవనవాడలో పంటకుప్పల్ని
తగలబెట్టిస్తాడు. పక్కగ్రామం పెద్దమనిషి అమృతరావు
విపత్కర పరిస్థితుల్లో జీవనవాడకు సహాయం చేస్తాడు.
ఆనందమూర్తిపై సమరం చేద్దామంటాడు సూరప్ప. మనకు
శత్రువులెవరూ లేరంటాడు వీరదాసు. అయితే స్వీయరక్షణ
కోసం సమరం సాగిద్దామంటాడు. అదే 'శాంతిసమరం'
అంటాడు.

అంతలో అమృతరావు అక్కడికి వస్తాడు.
సూరప్పపై రాయుడి పెద్దకొడుకును చంపినట్లు

వారంటును ఆనందమూర్తి సృష్టించినట్లు చెప్పి, వెంటనే పారిపొమ్మంటాడు. రాయుడికి పక్షవాతం వస్తుంది. ఆనందరావు కరణం ని తరిమి కొడతాడు. ఆనందమూర్తి రాక్షసత్వాన్ని గ్రహించిన హనుమంతు వీరదాసు వర్గంలో కలిసిపోతాడు. రాయుడి పెద్దకొడుకును చంపింది ఆనందమూర్తేనని చెబుతాడు.

వీరదాసుపై ఇంజక్షన్ ద్వారా ఆనందమూర్తి విషప్రయోగం చేస్తాడు. తనకు అంతిమగడియలు సమీపించాయని భావించిన వీరదాసు అందరినీ తన దగ్గరకు రమ్మంటాడు. హనుమంతును జీవనవాదులతో అనుమతించమని కోరుతాడు. చెడు మార్గం వైపు చూడకుండా మంచి మార్గం వైపు ప్రయాణించమని సూరప్ప, సరస్వతి తదితరులకు ఉద్బోధిస్తాడు. న్యాయాన్నెదిరించిన వాళ్ళు ఆనందమూర్తిలాగా చీకట్లో కలిసిపోతారని అంటాడు. మనిషికంటే విలువైన వస్తువేదీ లేదంటాడు. అందుకే ప్రపంచాన్ని మానవవాసయోగ్యంగా మార్చమని కోరుతాడు.

అక్కడికి చేరిన వాడవాడంతా తమ జాతి మొనగాణ్ణి రక్షించుకుంటాం అంటూ ముక్తకంఠంతో నినదిస్తారు. నాటకం ముగుస్తుంది.

చేసే పోరాటం, సమరం ఎవరికీ హాని చెయ్యవద్దు. అయితే ఎదుటివాడు మనల్ని నాశనం చెయ్యడానికి వస్తే చేతులు ముడుచుకు కూర్చోకుండా ఎదురుదెబ్బ తీయాల్సిందే. ఇలా స్వరక్షణకోసం చేసే సమరమే 'శాంతి సమరం' అని ఈ ప్రపంచంలో విలువైన వస్తువు మనిషే అని అతనిలో చైతన్యం వచ్చి, స్వార్థపరత్వం నశిస్తే ఇల స్వర్గధామం అవుతుందన్న సందేశాల్ని రచయిత ఈ నాటకం ద్వారా అందించాడు.

## శ్రీ కృష్ణ శిరోభారం:

ఈ నాటకం ఒక ఫాంటసీ. "తనను కలిబారినుండి రక్షించిన పరీక్షిత్తు మహారాజుకు 'శ్రీ కృష్ణుని శిరోభారం' గురించి వైష్ణవుడనే సత్యవింద్యుండు ఒక రహస్యం చెబుతాడని, అందుకై అతని దగ్గరకు వెళ్ళమ" ని

ధర్మదేవుడు సూచిస్తాడు. పరీక్షిత్తు వైష్ణవుని వద్దకు వెళతాడు. వైష్ణవుడు శ్రీకృష్ణశిరోభార వృత్తాంతాన్ని వివరిస్తాడు.

శ్రీకృష్ణునికి శిరోభారం వచ్చినదని అది ఏమిచేసినా ఉపశమించడం లేదని కృష్ణుని చెలికాడు వసంతకుడు, అతని ప్రేయసి వాసంతిక చర్చిస్తూవుంటే నారదుడు అక్కడికి వచ్చి 'విషయమేమిటి'ని అడుగుతాడు.

కృష్ణునికి వల్లమాలిన శిరోభారం వచ్చిందని రుక్మిణి, సత్యభామ, పదహారు వేలమంది అప్సరలు, ఎందరో వైద్యులు సేవచేసినా తగ్గడం లేదని వసంతకుడు నారదునికి చెబుతాడు.

నారదుడు, వసంతకుడు శ్రీకృష్ణుని వద్దకు వెళతారు. కృష్ణుడు తన బాధను నారదునితో చెప్పుకుని తీరేమార్గం చెప్పమంటాడు. శిరోభార విముక్తికి ఈశ్వరుడే మార్గం చూపించగలడని చెప్పి అక్కడినుండి

వెళ్ళిపోబోతాడు. రుక్మిణితో తదితరులు శ్రీకృష్ణ శిరోభార విముక్తికి మార్గం చెప్పమని కోరగా కలహ భోజుడైన నారదుడు "ఈ మూర కొలనులో రెండు వ్రేళ్ళను ముంచి ప్రభువుల వారి కణతలకు రాస్తే శిరోభారం దూరమవుతుంది. అయితే ఎవరయితే ప్రభువుల వారి బాధను తమ బాధగా ఎంచుతున్నారో వారివల్లనే అది సాధ్యం అవుతుంది" అని చెప్పి ఈశ్వరుని వద్దకు బయలుదేరుతాడు.

నారదుని ద్వారా కృష్ణుని బాధను విన్న ఈశ్వరుడు 'పరిహారమేమిటి?' అని లోకసంచారకుడైన నారదున్నే ప్రశ్నిస్తాడు.

అప్పుడు నారదుడు ఈశ్వరునితో "కృష్ణుడు పాలించే భూమండలంలోని ఒక మారుమూల గ్రామంలో ఒక తల్లి తన ఏడేండ్ల బాలికను కొట్టిందని అయితే ఆ పాప కుయ్యమని కూడా అనక పోవడంతో, తిరిగి ఎండలో నిలబెట్టి కొట్టగా ఆ పాప కనీసం ఏడవలేదు కూడా. అప్పుడు

ఆ తల్లి " మూడు దినాల వరకు బువ్వ పెట్టనని బెదిరించడంతో ఆ పాప స్తంభించి పోయింది. ఆమె శరీరంపై చెముటు గడ్డలు పుట్టాయి. అవి బాధించడంతో ఆ పిల్ల రోదిస్తోంది. ఆ రోదనే శ్రీకృష్ణ శిరోభారానికి కారణం" అని వివరించడంతో శివుడు ఆ తల్లి శిరస్సును ఖండిస్తానని అనగా, తొందరపడవద్దని నిజానిజాలు తెలుసుకోడానికి భూలోక యాత్రకు వెళదాం అంటాడు నారదుడు.

కోయదొర రూపంలో శివుడు, యతి రూపంలో నారదుడు భూలోకానికి బయలుదేరుతారు.

శ్రీకృష్ణుని భవనంలో కొలను నుండి నీటిని తీసుకుని కృష్ణుని కణతలకు ఆనిద్దామన్న అందరి ప్రయత్నాలు విఫలమవుతాయి. కృష్ణుని వద్దకు వచ్చేసరికి వారి ప్రేళ్ళకు అంటిన నీళ్ళు ఆరిపోతాయి.

భూలోకానికి బయలుదేరిన ఈశ్వరుడు, నారదుడు గ్రామవాసి నొకన్ని పట్టుకుని అతని గురించి

జ్యోతిష్యం చెబుతారు. దానికెంతో సంతోషించిన ఆ గ్రామ వాసి ఏడేండ్ల పసికూన చెమటగడ్డల ద్వారా పడే బాధను వారికి తెలిపి ఆ పిల్లను రక్షించమంటాడు.

ఆ పిల్ల 'తల్లి' సింగిని పిలిచి 'పిల్లనెందుకు కొట్టినావని ప్రశ్నిస్తాడు శివుడు. అప్పుడు ఆ తల్లి "నేను పనికెళ్ళి వచ్చేసరికి బువ్వబోకె బోర్లించి వుంది. బువ్వ ఏం జేసినవని పిల్లనడిగితే ఏమి చెప్పలేదు. కొడితే అప్పుడు చెప్పింది బిచ్చపమ్మకేసినా అని" అంటూ వివరించింది.

శివుడు బిచ్చపమ్మ వద్దకు వెళ్ళి ప్రశ్నించగా "రెండు రోజులుగా నాకు బువ్వ దొరకడం లేదు. అందుకే ఆ పిల్లను అడిగా. ఆ పిల్ల అన్నం పెట్టగా, ఆ పిల్ల తిన్నదో లేదో తెలుసుకోకుండా అంతా తినేసినా" అని జవాబు చెప్పింది. అంతే కాక "తన బతుకగానొక్క కొడుకు దేశాల పాలవడమే ఈ దుస్థితికి కారణం" అని చెప్పింది.

శివుడు ఆ బిచ్చపమ్మ కొడుకు నడుగగా
" నా తల్లిని పూవుల్లో పెట్టి చూసుకునే వాడి ని,
అయితే నా పొలాన్ని దారుకా కర్కటుడనే వాడు లాక్కొని
ఊరి పొలిమేరల్లో అడుగుపెడ్తే చంపేస్తానని చెప్పి
తరిమి కొట్టాడు. వాడికి వత్తాసులు గోమాయువు,
విపరీత జ్ఞానుడు, నష్టమంగళుడు అనే ముగ్గురున్నారు
వారి వల్లే ఈ అనర్థాలు' అని వివరించాడు.

ఈ వృత్తాంతం విన్న తర్వాత నారదుడు
" పంచభూతాలయిన ఆకాశం, గాలి, నిప్పు, నీరు, భూమి
ఈ ఐదు ఎవడబ్బ సొత్తు కాదని, ఎవడైనా అలా
అనుకొని పెత్తనం సాగిస్తే ఇలా అశాంతి తాండవం
చేస్తుంది." అని అంటాడు. అప్పుడు ఈశ్వరుడు
దారుకాకర్కటుడు, గోమాయువు, అవిపరీత జ్ఞానుడు,
నష్టమంగళులను తన త్రిశూలంతో సంహరిస్తానంటాడు.
అప్పుడు నారదుడు ఈశ్వరున్ని శాంతించమని కోరుతూ
"దుర్జనులైనా వారూ జనులే' అంటూ 'వారిని సంహరించ
ఆస్తిపై యాజమాన్యపు హక్కులను పెకిలించి
వేయుమని కోరుతాడు. శివుడలాగే చేస్తాడు.

బాలక చెమటగడ్డలు అదృశ్యమవుతాయి. శ్రీకృష్ణుని శిరోభారం ఉపశమిస్తుంది. ఇదే కథ.

సహజంగా లభించిన ఆకాశం, గాలి, నీరు, భూమి, నిప్పులపై జనులందరికీ సమానమైన హక్కు వుంటుందని, వీటిపై ఆధిపత్యం చలాయిస్తే అశాంతి తాండవిస్తుందని రచయిత ఈ నాటక ద్వారా తెలియజేసాడు. ఆకలి అందరికీ వుంటుందని, కాబట్టి అన్నం అందరికీ అవసరం. అది అందరికీ దొరకని నాడు ఈశ్వరుడే చోరావల్సి వస్తుంది. కాబట్టి తారతమ్యతలు నశించాలంటాడు రచయిత.

## కాలయంత్రం:

చిన్నతనంలోనే పోలియోవచ్చి కాళ్ళు చచ్చుబడి పోయినా, దిగాలు పడకుండా విశ్వం ధైర్యంగా, దృఢమైన మనోనిబ్బరంతో జీవితాన్ని సాగిస్తూ సైంటిస్ట్‌గా ఎదుగుతాడు. అద్భుతమైన ప్రయోగాలతో ఎన్నో కొత్త అంశాలను వెలుగులోకి తెస్తాడు. ఆయన

సృష్టించిన అద్భుత యంత్రం 'కాలయంత్రం'. కాలయంత్రం ద్వారా వర్తమానం నుండి గతంలోకి, భవిష్యత్తు లోకి ప్రయాణం చేసి అప్పటి స్థితిగతులను అనుభూతిలోకి తెచ్చుకొనవచ్చు.

కుమార్, కృష్ణవేణి ఇద్దరు కాబోయే భార్యాభర్తలు. ప్రేమికులుగా వుండి పెళ్లి చేసుకోబోతున్న ఉత్సాహపరులు. కుమార్ మిత్రుడు సైంటిస్ట్ విశ్వం. కుమార్, కృష్ణవేణిలు తమ వివాహానికి విశ్వంని ఆహ్వానించేందుకు అతనింటికి వెళతారు. అక్కడి వాతావరణం చూసి చాలా ఆశ్చర్యపోతుంది కృష్ణవేణి. అక్కడ 'టుంబు' అనే మరమనిషిని చూసి విస్తుపోతుంది.

విశ్వం తన ఇన్వెన్షన్స్ గురించి తెలియజేస్తూ కాలయంత్రం గురించి చెబుతాడు. మొదట ఆ యంత్రం పట్ల ఆకర్షితురాలైన కృష్ణవేణి, ఆ యంత్రం చేసే శబ్దం వినలేక అందులో ప్రయాణించనంటుంది. తను ముద్దుగా 'డాలీకుట్టి' అని పిలుచుకునే కృష్ణవేణి కాలయంత్రంలో ప్రయాణించనని అనడంతో కుమార్

అందులో ప్రయాణానికి విముఖుడవుతాడు. చివరకు కృష్ణవేణి, విశ్వంలు నచ్చ చెప్పడంలో విశ్వంతో పాటు కాలయంత్రంలో ప్రయాణానికి సిద్ధపడుతాడు కుమార్. కృష్ణవేణి వారి రాక కోసం ఎదురు చూస్తూ వుంటుంది.

కుమార్ కోరిక ప్రకారం భవిష్యత్తులోకి వెళ్ళడానికి కాలయంత్రాన్ని ఫిక్స్ చేస్తారు. భవిష్యత్తు గురించి ఎక్సయిటెడ్ గా ఫీలవుతున్న కుమార్ తన భవిష్యత్తును చూసి ఖంగు తింటాడు.

తాగుబోతుగా మారి అప్పులు చేసి, చివరకు అప్పులు తీర్చుకునేందుకు తన 'కన్ను'ను యాభైఐదు వేల రూపాయలకు అమ్ముకుంటాడు. తన ఇంట్లో తన పరిస్థితి ఎలావుందో తెలుసుకోవాలని కుమార్ కోరడంతో విశ్వం అలాగే ఫిక్స్ చేస్తాడు. ఇంట్లో అతని పరిస్థితి మరీ హీనంగా వుంటుంది. తనకెంతో ప్రియమైన సుకుమారి 'బాలకుట్టి' 'రుబ్బురోలు'లా లావుగా తయారవుతుంది. అప్పు తన పోలికలే గల

కూతురుంటుంది. బాలకుట్టి డాగ్‌రేసులకు అలవాటు పడిపోతుంది. తన కూతురు తల్లిదండ్రులను అమ్మా, నాన్న అనకుండా తల్లిని మిసెస్ కృష్ణవేణి అని, తండ్రిని మిస్టర్ లక్ష్మణ కుమారుడని పిలుస్తుంది. ఒక కన్నును అమ్ముకున్నాడు కాబట్టి కృష్ణవేణి తన భర్తను 'ఏకాక్షి గాడు' అని పిలుస్తుంది.

వారు ఇంట్లో వంట చెయ్యడం మానేసి ఐదు సంవత్సరాలు అవుతుంది. భోజనం హోటల్ నుంచి తెప్పించుకుని తింటారు. అది ఎవరిది వాళ్లే. కుమార్ కొడుకు 'చాకూ మహారాజ్' బాలనేరస్థుల జైల్లో వుంటాడు. మరో పుత్రరత్నం వినయ్. వీడు అనవసరంగా డబ్బులు తగలేస్తుంటాడు. అతని ప్రియురాలు మిస్ శిరీష. ఆమె పెళ్లికి ముందే ట్రయల్ మారేజికి విడాకులిచ్చేస్తుంది. కుమార్ తల్లిని వృద్ధశరణాలయంలో వుంచుతారు.

ఉమెన్స్‌లిబ్ అధ్యక్షురాలి విషయప్పై

చెడుగా పత్రికల్లో వ్రాసినందుకు కుమార్ ని
కృష్ణవేణి 'నారీ ద్వేషి'గా ద్వేషిస్తుంది. కృష్ణవేణిని
కుమార్ 'పురుష ద్వేషి'గా తిడుతాడు. వారి
మధ్య ఇంట్లో వున్న వస్తువులను విసురుకుంటూ
భీకర యుద్ధం జరుగుతుంది.

ఈ దృశ్యాలను, పరిస్థితిని చూడలేక
తిరిగి వర్తమానానికి వెళ్ళిపోదామంటాడు కుమార్.
ఇక తాను కృష్ణవేణిని పెళ్ళి చేసుకోనంటాడు కుమార్.
'అప్పుడు విశ్వం " కృష్ణవేణిని పెళ్ళి చేసుకోకపోతే
ఇంతకుముందు ఆమెను ముద్దుగా 'చాలుకుట్టి' అని
పిలిచినట్లు ఇకపై పిలవవద్దు" అని షరతు పెడతాడు.
ఇంకా 'భవిష్యత్తును మనం ఎలా నిర్ణయించుకుంటే
అలా వుంటుందని హిత బోధ చేస్తాడు. అయినా
కుమార్ తన నిర్ణయాన్ని మార్చుకోనంటాడు. ఇద్దరూ
వర్తమానంలోకి వచ్చేస్తారు.

కాలయంత్రం నుండి బయటకు రాగానే
విశ్వం కృష్ణవేణిలా 'కుమార్ నన్ను పెళ్ళి

చేసుకోండటా!" అని చెబుతాడు. అప్పుడు కృష్ణవేణి తన జీవితం వ్యర్థమని, ఈ పాడు బ్రతుకు వద్దని, చచ్చిపోతానని ఏడుస్తుంది. ఆ బాధను చూడలేక చలించిపోయిన కుమార్ 'దాలకుట్టి' అని ప్రేమగా పిలుస్తాడు. షరతు విధించిన విశ్వం కుమార్‌తో 'పైసా కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకోవాలంటాడు'. సరేనంటాడు కుమార్. కథ ముగుస్తుంది.

ప్రేమించుకున్న రెండు మనసులు, భవిష్యత్తులో తమ మధ్య ఏదో ప్రళయం ముంచుకొస్తుందని తెలిసి, దానికి భయపడి దూరం కారన్న విషయం ఈ నాటకం ద్వారా తెలియజేస్తాడు రచయిత. రాబోయే కాలంలో మానవజీవన గతి ఎటువిధంగా పరిణతి చెందనున్నదో కూడా చాలా చక్కగా వివరించారు రచయిత. ఈ సృష్టిలో ఏవీ అసాధ్యం కావని, దేన్నయినా సాధ్యం చేసుకునే శక్తి మన చేతుల్లోనే వుందని, సరైన మార్గంలో ప్రయాణిస్తే ఆనందమయమైన జీవితం సొంతమవుతుందని 'విశ్వం' పాత్రద్వారా చక్కగా చెప్పగలిగారు కె. చిరంజీవి గారు.

# హాస్య చిత్రాల - విశ్లేషణ

## వంశాంకురం:

### దేశికాచార్యులు:

సమాజంలో చాలా అరుదుగా కనిపించే ఉత్తముడు. సంతాన యోగ్యం లేని వంశానికి తన భార్య ద్వారా ఆర్టిఫిషియల్ ఇన్సెమినేషన్ ద్వారా సంతానాన్ని అందించేందుకు ముందుకు వచ్చిన వితరణశీలి. భార్యకు గౌరవం ఇచ్చే భర్తగా, సరైన రీతిలో స్పందించే ఒక కుమగా, ప్రతి సందర్భంలోనూ వాస్తవానికనుగుణంగా ప్రవర్తించే శీలంగా దేశికాచార్యులు పాత్ర రూపుదిద్దుకుంది. తనను ప్రేమించి, పెళ్లి చేసుకునే ధైర్యం లేని ఒక వ్యక్తికి ఆర్టిఫిషియల్ ఇన్సెమినేషన్ ద్వారా సంతానాన్ని అందించడానికి తెలియకుండా ఒప్పుకుని, తెలిసిన తర్వాత అబార్షన్‌కు సిద్ధపడే భార్యను, సమాధాన పరచి ధర్మనిర్వహణకు వ్యక్తిగత శతృత్వాలు అడ్డురాకూడదని చెప్పాడు.

పితృస్వామ్య వ్యవస్థలో క్షేత్రం కంటె బీజం ప్రధానమని అంటారు కాని, అన్నింటికన్నా స్త్రీత్వ ప్రధానమని తేల్చిచెప్పిన హేతువాదిగా దేశికాచార్యులు పాత్రను శిల్పించాడు రచయిత.

ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ ద్వారా నెలలు నిండని భార్య పావని కాన్పులో ఇద్దరాడశిశువులకు జన్మనిచ్చి చనిపోతే, ఆ బాధను దిగమింగుకుని కర్తవ్యం వైపు దృష్టిని సారించి 'అధైర్యానికి' అంతులేని దూరంలో బ్రతుకును సాగించ నిశ్చయించిన దేశికాచార్యులు పాత్ర ఈ నాటకంలో ప్రధానమైనది.

మూరుమనువు కూతురును ఎంతో ప్రేమగా పెంచుకున్న రామయ్య (తోటమాలి) దేశికాచార్యులు దృష్టిలో అత్యుత్తముడు.

దేశికాచార్యులు కవి. కాబట్టి స్పందించే ఏ అంశం కనబడినా ఇట్టే స్పందిస్తాడు. తనను ఎంతో అభిమానించే పేపర్ బాయ్ ని కూడా తమ్ముడిలా

అభిమానిస్తాడు. పేపర్ బాయ్ కథని వ్రాయడానికి అంగీకరిస్తాడు. 'మనిషిని కొలిచేవి మాటలు కాని చేతలు కావు' అంటూ 'సమాజాన్ని దుమ్మెత్తిపోస్తూ, దేశాన్ని దుమ్మెత్తిపోస్తూ, ఇంతసేపటికి ఈ దేశం నాకేమిచ్చింది, ఈ సమాజం నాకేమిచ్చింది అని సంకుచితంగా ఆలోచించే వారిని 'ఒరే పామును పూజిస్తున్న మూర్ఖుడా! పాతరాతి కాలం నాటి వాడా!' అనిరుద్ధం రాసి చప్పట్లు కొట్టించుకున్న వారు సినిమాలు అవకాశం వస్తే 'నాగపూజకు' పాటలు రాస్తారని అవకాశవాదుల్ని ఈసడించుకుంటాడు. తన ధర్మాన్ని తానెరిగి వృత్తిని ఎన్నుకోవాలంటాడు దీక్షాచార్యులు.

ఒక కవిగా, అభ్యుదయవాదిగా, భార్యకు సరైన భర్తగా, తోటి మనిషిలోని మానవత్వానికి పైకొట్టే మనిషిగా, తక్కువస్థాయి వారిని కూడా ఆదరించే వ్యక్తిగా, బాధల్ని దిగమ్రింగుకుని కొత్త ఉత్తేజాన్ని నింపుకునే ముందుచూపు, గుండె ధైర్యం గల ఉన్నతునిగా దీక్షాచార్యులు పాత్రను కె. చిరంజీవి గారు రూపొందించారు. ఒక్కమాటలో చెప్పాలంటే "సమాజంలో సిసలైన మేధావి

వర్గానికి చెందిన వ్యక్తికి 'దేశికాచార్యులు' పాత్ర నిదర్శనం.

**పావని:**

పావని, దేశికాచార్యులు గారికి తగిన భార్య. ఎం.ఎస్సీ వరకు చదువుకుని, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్‌లో ఉద్యోగం చేస్తూ కుటుంబ భారాన్ని భరిస్తుంది. భర్త ఆధ్యాత్మిక చింతనను సరైన కోణంనుండి అర్థం చేసుకుని సహకరిస్తుంది. పావని తన భార్య అయినందుకు ఎంతో పొంగిపోతారు దేశికాచార్యులు. 'ఆర్టిఫిషియల్ ఇన్సెమినేషన్' ద్వారా పిల్లల్ని కనడం ధర్మ నిర్వహణా అన్న భర్తతో వాదనకు దిగుతుంది. "ఆడదానికి సంతాన యోగ్యత లేనప్పుడు మగవాడు మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నాడు. అలాగే మగవాడు అయోగ్యుడైనప్పుడు ఆడది మళ్ళీ పెళ్ళి చేసుకుని పిల్లల్నెందుకు కనకూడదు? ఇది భర్త అనుమతితో పరపురుషుని వలన సంతానాన్ని పొందే ధర్మవ్యాపారం కంటే మంచిదే కదా అని పురుషాధిక్య సమాజాన్ని నిలదీసే అభ్యుదయ వాది పావని.

ప్రేమలో మోసపోయి చివరకు దేవుడిలాంటి వెంకటాచార్యులుతో పెళ్ళిబంధం బిగించుకుని భర్తకు అనువుగా నడుచుకుంటున్న ఇల్లాలు పావని. అయితే ఏ స్త్రీకి ఎదురుకాని సమస్యనెదుర్కొని భర్త ఆజ్ఞతో మరొకరి సంతానానికి క్షేత్రంగా ఉండేందుకు అంగీకరించడం ఆ మరొక వ్యక్తి తనను ప్రేమించి, తనవంశంలో ఫెర్టిలిటీ లేని కారణాన పెళ్ళిచేసుకోలేకపోయిన వ్యక్తి కావడం ఈ నిజాన్ని భరించలేక అబార్షన్‌కు సిద్ధపడడంలో మామూలు స్త్రీగా కనిపించిన, చివరకు భర్త మాటలకు విలువనిచ్చి 'ధర్మనిర్వహణా'కు వ్యక్తిగత విషయాలు అడ్డురాకూడదని తెలుసుకుని, భర్తను నొప్పించడం ఇష్టంలేక, తనకయిష్టమైన పనికి సిద్ధపడి ప్రాణాలు త్యాగం చేసిన స్త్రీమూర్తి పావని.

ఇటువంటి ఇల్లాలు సమాజంలో అరుదుగా కూడా కనిపించరు. అయినా ఏ మాత్రం ఆశించకుండా గొడ్డుకాబోతున్న ఒక వంశానికి బిడ్డను అందించడానికి సిద్ధపడిన స్త్రీగా ఒక ప్రత్యేకతను సంతరించుకున్న పాత్రగా 'పావని'ని సృష్టించి స్త్రీని మరోవైపునుండి

చైతన్యం పరిచే విధంగా యత్నించిన రచయిత ఈ పాత్రద్వారా స్త్రీ ఔన్నత్యాన్ని పదింతలు పెంచారు.

## రామయ్య:

చదువుకోక పోయినా, ఒకరి చేతుకింద పని చేసి బ్రతుకు వెళ్ళబోసుకునే సామాన్యుడైనా ఈ 'రామయ్య' పాత్ర ఉదాత్తమైనది.

రామయ్య ధర్మారావు వద్ద తోటమాలి. రామయ్య పాత్ర వంశాంకురం నాటకానికి ఒక కొసమెరుపు. అసలు వ్యవసాయానికే పనికి రాదనుకున్న భూమిని కష్టపడి సేద్యం చేసి పనస పండించిన ఈ కష్టజీవి తనకు పిల్లలు లేకపోయినా ఎవరికో పుట్టిన మారు మనువు కూతురును సొంత కూతురుగా భావించి, లాలించి, పెంచి, పెద్దచేసి వివాహం జరిపించాడు. "ప్రేమ అనేది ఉదరానికి సంబంధించింది కాదని హృదయానికి సంబంధించిందని చాటి చెప్పాడు. రామయ్య మాటలతో స్ఫూర్తిగా దేశికాచార్యులు నూతన జీవితాన్ని

సాగించేందుకు ఉత్తేజితుడవుతాడు.

తక్కువ స్థాయిలో జీవనం సాగించినా, ఉన్నతమైన భావాలను ఆచరణలో చూపించిన పాత్ర 'రామయ్య'. ప్రతివ్యక్తి ప్రేమను విశాలహృదయంతో పంచిననాడు ఇల మొత్తం స్వర్గధామం అవుతుందని అంటూ రామయ్య పాత్రను ఆదర్శంగా మలచాడు రచయిత.

## ధర్మారావు:

ప్రేమించడానికి మనసుంది కాని, ప్రేమను విజయవంతం చేసుకోడానికి పెద్దవారిని ఎదిరించే ధైర్యంలేక, డబ్బు, పరపతి వుండే మూఢనమ్మకాల్ని నమ్మి ప్రేమించిన అమ్మాయిని తనదానిగా చేసుకోలేని పాత్ర ధర్మారావు. ఇటువంటి ధర్మారావులు సమాజంలో కోకొల్లలు. అటువంటి వ్యక్తి జీవితంలో చుట్టూ సుఖమయ పరిస్థితులున్నా, జీవితాన్ని ఆనందంగా అనుభవించలేని దురదృష్టవంతుడు.

అప్పుటాండని రచయిత ఈ పాత్ర ద్వారా చెప్పించాడు.

## మిస్టర్ అండ్ మిసెస్ జేమ్స్:

వైజ్ఞానికంగా సాధించిన ప్రగతి ద్వారా మానవ సమాజం తన సమస్యలను దూరం చేసుకునే అవకాశాలను ప్రజలకు అందించే వైద్యులు వీరు. ఇటువంటి పరిస్థితులు సమాజం సద్వినియోగం చేసుకోవాలని తహతహలాడే వైద్యులు. అయితే వీరు నిమిత్త మాత్రులు. కృషిని విశ్వసించేవారు. గొడ్డుగా మారనున్న ధర్మారావు వంశానికి బిడ్డను అందించడం కోసం పావని, దేశికాచార్యులను ఒప్పించగలిగినా, మగబిడ్డను అందించడంలో, పావనిని రక్షించడంలో విఫలమయ్యారు. రిస్కు తీసుకుని సేవలందించే వైద్యులు ఈ సమాజంలో చాలా తక్కువ. ఆ తక్కువమందిలో వీరిని చెప్పవచ్చు.

# ఊరిలోళ్ళు ఏమంటున్నారు:

బాలరాజు:

కట్నం కోసమే భార్యను చేసుకుని ఆ కట్నం డబ్బులు వసూలు చేసుకోడానికి భార్యను, అత్తను, బావమరిదిని నానా హింసలు పెట్టె అతిసామాన్య మోతుబరి ఆసామి బాలరాజు.

ఆ కారణాలు, ఈ కారణాలు చెప్పి అత్తవారి దగ్గర వున్న డబ్బంతా గుంజుకోవడంలో సిద్ధహస్తుడు. అవకాశాలను, అనుకూలంగా మార్చుకునే వ్యూహకారుడు. భార్యను చావగొట్టి, అది తన ప్రాణం మీదకు వచ్చేసరికి ఆసుపత్రిలో చేర్పించి ఆమె చేతనే ఏదు పొడిచిందని చెప్పించిన ఘనుడు.

చెల్లిని హింసించినందుకు ఆగ్రహించిన బావమరిదిపై హత్యాయత్నం కేసు బనాయించిన ఈనాటి బ్రతుకనేర్చిన మనిషి.

ఇన్ని దుర్లక్షణాలున్న వ్యక్తికి ఎవరూ తనను ఏమీ చెయ్యలేరన్న మితిమీరిన ఆత్మవిశ్వాసం, దానితో మరదలును దక్కనియ్యకపోయిన భార్యను గర్భవతి అని కూడా చూడకుండా చెట్టుకు కట్టేసి చావబాదుతాడు. కాని ఊరు ఊరంతా తనకు వ్యతిరేకంగా నిర్ణయాన్ని తీసుకుంటుందని ఊహించలేని మూర్ఖుడు బాలరాజు.

మానవత్వ లక్షణాలు మృగ్యమైన పాత్రగా బాలరాజును మన కళ్ళముందు నిలిపాడు రచయిత. తనకివ్వాల్సిన డబ్బులు తనకివ్వకపోతే మీ కూతుర్ని పండుగకు ఇంటికి పంపనని బెదిరించడం, ఆడపిల్లని కన్నందుకు భార్యను నిందించడం వంటి మనస్తత్వం కలిగిన మనుషులు సమాజంలో అడుగడుగునా కనిపిస్తారు. అటువంటి వారి ప్రతిరూపం ఈ బాలరాజు పాత్ర.

# వరమ్మ:

పుట్టింట అమ్మ, అన్న, చెల్లి, తమ్ముళ్ళ ప్రేమానురాగాల మధ్య జీవించి పెళ్ళితో వాటికన్నిటికీ దూరమవడమే కాక, భర్త అనురాగానికి నోచుకోలేక పోవడమే గాక, యౌవనానికి బలవుతూ తల్లడిల్లి పోయే ఎందరో అభాగ్యులకు ప్రతినిధిగా వరమ్మ పాత్రను చిత్రించాడు రచయిత.

భర్త చావగొట్టినా పసుపు కుంకుమల కోసం తనను ఎద్దు పొడిచిందని చెప్పుకొన్న వరమ్మలో కేవలం ఐదవతనం కోసమే ఆరాటపడే స్త్రీని చూడవచ్చు.

ఇస్తానన్న కట్నం డబ్బులు ఇవ్వలేని పుట్టింటి వాళ్ళు, ఆ డబ్బును సాధించుకోవడంలో ఉత్సాహం చూపుతూ ఆరళ్ళు పెట్టే భర్త మధ్య నలిగిపోతుంది వరమ్మ. ఆడబిడ్డను కని మరింత లోకువవుతుంది.

భర్తకు భయపడి ఎంతో కష్టమయిన కమ్మరి పనిని నేర్చుకున్న వరమ్మ, తన చెల్లిని పాడు చేసేందుకు యత్నించే భర్తపై తిరగబడుతుంది. అన్ని కష్టాలను అనుభవిస్తూ భర్త ప్రేమకు పాత్రురాలు కాకపోయినా ఊళ్ళో సానుభూతికి పాత్రురాలు అవుతుంది.

ఒక ఆడబిడ్డకోసం ఊరు ఊరంతా చైతన్యమయ్యేందుకు కారణమై ఊరికే ఆడపడుచుగా మారిన వరమ్మ పాత్ర ద్వారా ఊళ్ళోళ్ళను మేల్కొల్పి రచయిత కొత్త చరిత్రను సృష్టించాలన్న ఆకాంక్షను వ్యక్తం చేసారు.

## రంగయ్య:

తాతముత్తాతల ఆస్తులు లేక కేవలం రెక్కల కష్టంపై కుటుంబాన్ని పోషిస్తూ ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేసే బాధ్యతను నెరవేర్చడం కోసం పరితపించే రంగయ్య పెద్ద చెల్లెలు వరమ్మ పెళ్ళి

చేస్తాడు. కాని ఒప్పుకున్నంత కట్నం ఇవ్వలేక పోతాడు.

చెల్లెల్ని ఆమె భర్త పెట్టే కష్టాలు చూడలేక ఇంటిని అమ్మేస్తాడు. ఇల్లుతోటి తనకు మిగిలిన సంబంధం విడిపోతుంది. ఏమి చెయ్యరా అంటే ఇల్లు విడిచి పారిపోయిన తమ్ముడు, పెళ్ళికెదిగిన మరో చెల్లి, కన్న తల్లి ఇన్ని బాధ్యతలను కేవలం రెక్కల కష్టంపై మోయలేక పోతాడు. చేసేది లేక చెల్లెలు వజ్రమ్మ పెళ్ళి భారాన్ని బావకు అప్పచెప్పమని తల్లికి చెప్తాడు.

తను సుఖపడకపోయినా, కనీసం తనవాళ్ళను సుఖపెట్టలేక కుమిలిపోయే రంగయ్యలు అక్కడక్కడ సమాజంలో కనపడ్డా ఎందరో తన సుఖం కోసం ఇంటిని వదిలి వెళ్ళిపోయేవాళ్ళే కనబడతారు. అటువంటి వారికి భిన్నంగా రచయిత రూపొందించిన ఈ పాత్ర చేతకాని తనానికే కాక, దౌర్భాగ్యానికే, త్యాగానికి, ప్రతీకగా కనిపిస్తుంది.

# డా॥రాంజోషి:

'ఆకలిమందు' కనుగొన్న రాంజోషి ఆ మందును ఒక యువకునిద్వారా పబ్లిగ్గా విక్రయిస్తాడు. తనలో పట్టుదలకు కారణమైన ప్రేయసి కల్పన ప్రేమను పొంది భార్యగా చేసుకోవాలనుకుంటాడు. ఆకలిమందు ఫార్ములాను సొంతం చేసుకుని డబ్బు గడించాలన్న తపనతో వచ్చిన పారిశ్రామికవేత్త కర్పూరంజన్, వ్యాపారవేత్త శ్రీమాన్‌జీలతో బేరం మాట్లాడుతుంటే, పోలీస్ కమీషనర్ వచ్చి ఆకలిమందు కొరకు వందరూపాయలు సంపాదించడం కోసం చెలరేగిన అలజడిని వివరిస్తాడు. ఆకలిమందు తిన్న యువకుడు, ఎలుకలు, కోతులు పాషాణంగా మారడంతో కల్పన రాంజోషీని తిరస్కరిస్తుంది. హంతకున్ని వివాహం చేసుకోలేనంటుంది.

నిజానికి రాంజోషి రామారావు అనే నిరుద్యోగి కలలో హీరో. రామారావు నిరుద్యోగి అయిన ఒక కవి. పొట్టచేత్తో పట్టుకుని మహానగరానికి

తాగడానికి నీళ్ళు దొరకక సొమ్మసిల్లి పడిపోయి ఈ కలగంటాడు. ఆసర దొరకని ఈ సమాజంలో జీవించలేక, తనను పిచ్చివాడిగా భావించి వదిలేసిన పోలీసులను జైల్లోకి తనను తీసుకెళ్ళమని కోరుతాడు.

ఆశలు తీర్చుకోలేని నిరుద్యోగి కలలలో జీవించడం సమాజంలో చాలాచోట్లలో కనిపిస్తుంది. అటువంటి వారి ప్రతిరూపమే రాంజోషి లేదా రామారావ్ పాత్ర.

## శ్రీమాన్ జీ, కర్మరంజన్:

ఈ రెండు క్యారెక్టర్లు ప్రతి అంశాన్ని వ్యాపారదృష్టితో అంచన వేస్తాయి. 'ఆకలి మందు ఫార్ములా సొంతం చేసుకోడానికి పోటీపడే ఈ పాత్రలు స్వాభావికమైనవి. శ్రీమాన్‌జీ ఆకలిమందుపై బేరాన్ని ప్రారంభిస్తూ రాంజోషికి లక్ష రూపాయలిస్తాననంటాడు. దానికి ప్రతిగా ఒకటే మాత్ర ఖరీదు రూపాయి పెట్టిన జనాభా ప్రకారం అరవైకోట్లు వస్తాయంటాడు రాంజోషి.

వెంటనే తాను పయిష్టైకోట్లు ఇస్తానంటాడు కరత్రరంజన్. దానికి ప్రతిగా 'మందుల వ్యాపారం నాది కాబట్టి పేటెంట్‌రైట్స్ నాకివ్వాలి' అంటాడు శ్రీమాన్‌జీ. వీళ్ళది కేవలం వ్యాపారదృష్టే. తప్పితే కొత్తగా కనుగొన్న 'టీకాలమందు' వలన ప్రపంచంలో జరిగే పరిణామాల గురించి వీళ్ళకి పట్టింపే లేదు. ఇటువంటి మనస్తత్వాలు వ్యాపారవర్గాల్లో ఖచితంగా కనబడుతుంటాయి.

## బీళ్ళు తిరగబడుతున్నాయి & శాంతి సమరం.

'బీళ్ళు తిరగబడుతున్నాయి' నాటకానికి 'శాంతి సమరం' కొనసాగింపు. ఇరునాటకాలలో దాదాపు పాత్రలన్నీ ఒకటే.

## వీరదాసు:

ఇది ఈ రెండు నాటకాలను నాయక పాత్ర. మొదటి నాటకంలో అణగారిన జనాన్ని

ఐక్యం చేసేందుకు యత్నిస్తే, రెండవ నాటకంలో ఐక్యం అయిన ప్రజల్లో చైతన్యం, మానవత్వం నింపేందుకు ప్రయత్నిస్తాడు. విజయం సాధిస్తాడు వీరదాసు. ప్రజలందరినీ తనవాళ్ళుగా భావించిన వీరదాసు, ప్రజలందరికీ దైవసమానుడిగా పరిణతి చెందుతాడు.

రాయుడికి వెట్టిచాకిరి చేస్తూ, ఆయన పెట్టే బాధల్ని విధిలేక సహిస్తున్న ప్రజల్లో, అవ్వ చెప్పిన 'నీలి దీపాలు' కథలోని నాయకుడు, ఎవరైతే జాతిజనుల్ని చీకటి నుండి వెలుగులోనికి నడిపించడానికి ప్రయత్నించి, చివరికి ఓపికలేని జాతిజనుల ఆగ్రహానికి గురై, తన గుండెను చీల్చుకుని దాని వెలుగులో అందరికీ దారి చూపిన 'కలకే' ని స్ఫూర్తిగా తీసుకుని తన జాతి జనులకు వెలుగుబాట వేసిన ధీరోదాత్తనాయకుడు వీరదాసు.

శత్రువుల మాయలు చిక్కిన తనవారిని అందునుండి తప్పించి విజృంభించేలా చేయడంలో

నేర్పరి వీరదాసు. రాయుడి వద్ద వెట్టిచాకిరి మానేసి సర్కార్ అందజేసిన బంజరు భూములను సేద్యం చేసుకునే విధంగా జనాల్లో జాగృత పరచి, రాయుడి పెత్తనానికి 'బీళ్ళు తిరగబడుతున్నాయి' లో గండి కొడితే, 'శాంతి సమరం' లో జనులచే సరికొత్త గ్రామంగా 'జీవనవాడ' ను నిర్మింపజేస్తాడు.

ఈ తరం విలన్ ఆనందమూర్తి ఆగడాలనుండి, జిత్తులమారి ఎత్తులనుండి జనాన్ని రక్షించి, చివరకు ప్రాణాల మీదకు తెచ్చుకుంటాడు 'శాంతి సమరం' లో. అయితే ప్రజలందరి చేత ఆరాధింపబడే స్థాయిని చేరుకుంటాడు.

ముసలయ్య, సూరప్ప, సరస్వతి ఆంటి, తన నమ్మిన బంటుల సహాయ సహకారాలతో, ఆనందమూర్తి మాయలో పడిన పుల్లిగాడు, బలిజ బక్కన్నలను అందులో నుంచి తప్పిస్తాడు.

ఆకలిని భరించలేక తల్లడిల్లుతున్న తమ

వారి ఆకలిని తీర్చడానికి సూరప్ప, ఫకీరులు సర్కారు బియ్యాన్ని లారీని అక్రమంగా 'జీవనవాడ'కు తరలిస్తే వారిని వారించి, న్యాయబద్ధంగా, నీతిగా మాత్రమే తినే తిండిని సాధించుకోవాలని వారిని మానవతోన్ముఖులుగా మారుస్తాడు. ఈ రెండు నాటకాలలో ప్రతిరంగంలో అడుగడుగున ధీరోదాత్తత మూర్తీభవించిన పాత్రగా 'వీరదాసు'ను రచయిత మలిచాడు. అసలు సిసలు ప్రజానాయకుని లక్షణాలను ఈ వీరదాసు పాత్రద్వారా రచయిత ఆవిష్కరించాడు.

## రాయుడు:

'బీళ్ళు తిరగబడుతున్నాయి' నాటకానికి ప్రతినాయకుడు రాయుడు. బడా భూస్వామి. తిరుగబడవస్తాయి జనాన్ని తన కాలి చెప్పు కింద వుంచుకోవాలని చూస్తూ, తిరగబడ్డ వారిని తన్ని తగలేసే క్రూర మనస్తత్వం నిండిన పాత్ర రాయుడు. ఏ కోశాన మానవత్వం కనబడనీయని రాయుడు అందుకు తగిన శాస్తిని అనుభవిస్తాడు. తరతరాలుగా తమ కాలికింద నలిగిన

వారు ఎదురుతిరిగి వీరదాసు నేతృత్వంలో సర్కారు వారి బంజరు భూములను సస్యశ్యామలంగా మార్చుకుని 'జీవనవాడ' ను నిర్మించుకుంటే నిస్సహాయుడిగా మారిపోతాడు. కొన్నాళ్ళక్రితం వరకు ప్రతిగ్రామంలో ఇటువంటి రాయుడులెందరో దర్శనమిచ్చేవారు.

## ఆనందమూర్తి:

'శాంతి సమరం' నాటకానికి ప్రతినాయకుడు. ఆనందమూర్తి. తనను విదేశాలకు పంపించి డాక్టరు చదువు చదివించిన సొంత మామనే కూల్చేందుకు కుట్ర పన్నిన కుటిలతరం విలన్. కౌరవాళ్ళస్తానే ఎదుటి వారి మనసుల్ని కల్మషం చేసే తన పనులను సాధించుకునే తేనెపూసినకత్తి ఆనందమూర్తి.

తాను వేసిన ప్రతి ప్లానుకి ఎదురుదెబ్బతీస్తున్న వీరదాసు ప్రాణాలు తీయడానికి సైతం ప్రాణంపోసే డాక్టర్ వృత్తిని మరచి ప్రాణం తీసే కసాయి ప్రవృత్తిని ప్రదర్శించి ఇంజక్షన్ ద్వారా దొంగచాటుగా విషం ఎక్కించి చీకట్లోకి పారిపోతాడు.

కనికరం అనేమాటకు అర్థం తెలియని వాడు. మానవత్వం అంటే ఏమిటో తెలియని ఈ విచిత్రమనిషి ఆనందమూర్తి ప్రజలచేత సరికొత్త ప్రపంచాన్ని నిర్మింపజేసే వీరదాసుకు అతనికి స్ఫూర్తిగా సహకరిస్తున్న సూరప్ప భార్య సరస్వతితో అక్రమసంబంధం అంటగట్టి వారిమధ్య విభేదాలను సృష్టించే ప్రయత్నం చేసిన జిత్తులమారి నక్క. రాముడు, ఆనందమూర్తి పాత్రలు భూస్వాముల వ్యవస్థలో కుళ్ళునిండిన కర్కశుల జీవితాలకు ప్రతిరూపాలు.

## సూరప్ప:

సూరప్ప జనంకోసం పనిచేసే వీరదాసుకు కుడిభుజం. రాముడికి లక్ష్మణుడెలాంటివాడో వీరదాసుకు సూరప్ప అలాంటి వాడు. వీరదాసుకు, తన భార్య సరస్వతికి అక్రమ సంబంధం వుందన్న విషయాన్ని తన తల్లిలాంటి రాములమ్మ చెబితే విని. ఆగ్రహంలో తన భార్యను తెగనరకాలని వెళ్ళి, నిజాన్ని తెలుసుకుని, ఆమె నిర్దోషిత్వాన్ని నమ్మి, తమ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కుట్రగా తెలుసుకుని సమయస్ఫూర్తిని, విశాలదృష్టిని ప్రదర్శిస్తాడు.

తన జాతి వారి ఆకలిని తీర్చడానికే సర్కారు వారి బియ్యం లారీని 'జీవనవాడ'కు అక్రమంగా తోసుకు రావడంలో అతని ఆవేశం కనిపిస్తుందే తప్ప, తప్పు కనిపించదు. ఈ రెండు నాటకాల్లో సహనాయకుని పాత్ర సూరప్ప. ఉదాత్తత నిష్కల్మషం మూర్తీభవించిన పాత్రగా 'సూరప్ప'ను చిత్రీకరించాడు రచయిత.

## బకలయ్య, పుల్లిగాడు:

జీవితానికి ఒక నిర్దిష్టమైన రూపంలేని పాత్రలు బలిజ బకలయ్య, దొంగ పుల్లిగాడు. ఒకవిధంగా చెప్పాలంటే వీరు నిరాశనిండిన అవకాశవాదులు. నిజానిజాలు గ్రహించి జీవితాన్ని స్వర్గధామం చేసుకునేందుకు వీరదాసును ఆశ్రయించిన వారై, చివరకు వీరే ఆనందమూర్తి అతిమర్యాదలకు ఆశపడి వీరదాసు పైననే అభాండాలు వేయడానికి వెనుకాడలేదు. అందుకే వీరు ఒకవిధమైనటువంటి అవకాశవాదులు. ఇటువంటి వారు సమాజంలో అడుగడుగునా కన్పిస్తారు.

## ముసలయ్య:

కులపెద్ద హోదాలో వున్నా, నవతరం సమాజంలో మార్పు కోసం చేస్తున్న ప్రయత్నాలకు అండగా వుండేందుకు తన వంతు సహకారాన్ని అందించేందుకు ముందుకువచ్చిన ముసలయ్యలో నవీనత గోచరిస్తుంది. కులపెద్దనన్న అహం ఇసుమంత కూడా ముసలయ్యలో కనిపించదు. తమ తరం భూస్వాముల చేతిలో అనుభవించిన కష్టాలు రాబోయే తరాలకు ఉండకూడదని మనస్ఫూర్తిగా భావించిన మానవతా హృదయమూర్తిగా ముసలయ్య పాత్రను ప్రతిష్ఠించారు రచయిత కె. చిరంజీవి గారు.

# శ్రీకృష్ణ శిరోభారం:

## నారదుడు:

ఈ పౌరాణిక నాటకంలో అతి ముఖ్యమైన పాత్ర నారదునిదే. కలహభోజునిగా ఖ్యాతి గాంచిన నారదుడు, తన కలహాలన్నీ లోకకళ్యాణం

కోసమేనని సమర్థించుకోవడంలో గల ఔచిత్యం ఈ నాటకంలో కనిపిస్తుంది. వాసంతిక, వసంతుడుల ద్వారా శ్రీకృష్ణ శిరోభారం విషయం తెలుసుకున్న నారదుడు, ఆ శిరోభారం నుంచి విముక్తి కలిగించగలిగిన వాడు శివుడే నన్న విషయం తెలిసినప్పటికీనీ, శ్రీకృష్ణుని మందిరంలో ఒక విన్యాసానికి ఆరంభం కల్పించి వెళ్ళిపోతాడు. "తామర తూడులనుగాని వీటిని రెండు వ్రేళ్ళతో తీసుకుని ప్రేమగా, కృష్ణుని బాధను, తన బాధగా ఎంచి అతని కణతలకు అద్దితే ఆయన శిరోభారం దూరం అవుతుంది". అని చెప్పి ఈశ్వరుని వద్దకు బయలుదేరుతాడు. దాని పర్యవసానంగా రుక్మిణి, సత్యభామ, పదహారువేలమంది గోపికలు, వీళ్ళంతా కృష్ణుని ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన వారే. అయినప్పటికీనీ వీరు నీటితోడిని కృష్ణుని కణతలకు అంటించడంలో విఫలమయ్యారు. 'బృందావనం' నుంచి వచ్చిన రాధమ్మను జాంబవతీదేవి లోనికి రానీయదు. ఆమె హతాశయై వెళ్ళిపోతుంది. ఆడవాళ్ళలో కృష్ణునిపై అందరికన్నా ఎక్కువ ప్రేమ కలిగిన అమ్మాయిగా పూర్ణకుబ్జ అనే కృష్ణుని భక్తురాలు, మధురాపురనివాసి అని తేలుతుంది.

ఈమె చేతి తడి ఒక కణతకు అంటించిన తర్వాత ఆగిపోతుంది. మిగిలిన వాళ్లలో చాలామంది కొలనులోని నీళ్లనే తాకలేకపోతారు. పురుషులలో కుచేలుడు భేష్ అనిపించుకుంటాడు. కాని అతనూ విఫలమౌతాడు. నారదుడు సృష్టించిన ఈ విన్యాసం వలన (కలహం వలన) కృష్ణునిపై ఎవరికెంత ప్రేమ ఉందో వారికే తెలిసిపోయింది. తమ పరిధి ఏమిటో తెలిసిపోయింది.

ఈశ్వరున్ని శ్రీకృష్ణశిరోభార ఉపశమనానికి ఉన్మత్తున్ని చేసి, మారువేషం ధరింపజేసి భూలోకానికి తీసుకువెడతాడు. యిలాగా అవతరించిన నారదుడు కోయదొరగా అవతరించిన ఈశ్వరునికి సహాయకునిగా వుంటాడు. భూలోకంలో ఒక ఏడేండ్ల చిన్నారిని బాధిస్తున్న చెముటగడ్డలే శ్రీకృష్ణశిరోభారానికి కారణమని శివునికి వివరించి, అసలు ఆ చెముటగడ్డలకు కారణమైన ఆ చిన్నారి తల్లి, బిచ్చపమ్మ, బిచ్చపమ్మ కొడుకు, దారుణాకరుడు అతని అంతరంగికులు, గోమాయువు, విపరీత జ్ఞానుడు, సప్తమంగళుల వృత్తాంతాలను ఈశ్వరుడు తెలుసుకునేటట్లు చేసి, సకల ప్రజలు

సమానంగా హక్కులు కలిగిన ఆకాశం, భూమి, అగ్ని, నీరు, గాలి లపై ఆధిపత్యం చెలాయిస్తూ సకల అశాంతికి హేతువులైన దారుణ కర్మల్ని, ఆత్మని ఆంతరంగికుల్ని యజమాన్య హక్కుల్నుండి దూరం చేయించే విధంగా ఈశ్వరుని అర్థించి, ఆ ఏడేండ్ల చిన్నారిని స్వేదద్రావంల బారినుండి, కృష్ణుని శిరోభారం నుండి దూరం చేయడంలో ప్రముఖ పాత్ర వహిస్తాడు నారదుడు.

లోకకళ్యాణాన్ని కాంక్షించే సహజనైజం గల పాత్రగా 'నారదున్ని' చిత్రించాడు రచయిత.

## ఈశ్వరుడు:

సృష్టి, స్థితి, లయలకు లయకారుడైన ఈశ్వరుడు శ్రీకృష్ణున్ని శిరోభారం నుండి విముక్తుడిని చేసేందుకు నారద ప్రోద్బలం వలన ఉద్యుక్తుడవుతాడు.

హరిహరులిద్దరు ఒకరికొకరు సహకరించుకుని లోకాలకు చేటును దూరం చేస్తారని ఎన్నో ఉదంతాల వలన

తెలుస్తోంది. అటువంటి ఉదంతాలలో, మరో దానిని చేర్చే ప్రయత్నం చేసారు రచయిత. లోకంలో ఈశ్వరుని ప్రశస్తికి ఎటువంటి దెబ్బరాకుండా, అదిమరింత ఇనుమడించేలా ఏడేండ్ల చిన్నారి బాధను దూరం చేయడానికి ఏదో మంత్ర తంత్రాలనుపయోగించక, సమస్య యొక్క మూలాన్ని కనుగొని, సరియైన పరిష్కారాన్ని ఈశ్వరుని పాత్ర ద్వారా చూపించారు రచయిత.

ఆకాశం, గాలి, నిప్పు, నీరు, భూమి ఈ ఐదు ఎవడి సొత్తు కాదని, వీటిని కొందరు దుర్జనులు సొంతం చేసుకోవడం వలననే అనర్థాలు జరిగి అశాంతి విలయ తాండవం చేస్తుందని, ఆ అశాంతియొ ఏడేండ్ల చిన్నారికి కలిగిన రోదన అని, ఆరోదనే కృష్ణుని శిరోభారానికి కారణం అని శివుడు గ్రహిస్తాడు.

నారదుని సలహా వలన సర్వ అనర్థాలకు కారణమైన దారుణాకరుడు, గోమాయువు, విపరీత జ్ఞానుడు, నష్టమంగళుడు తదితరులను నాశనం చేయక, 'విషసర్పానికి కోరలు పీకిన చందమున వారి ఆస్తిపై యాజమాన్యపు

హాకుటిలను పెకిలించివేసి సర్వమానవులలాగా జీవించే విధంగా చేస్తాడు. దుష్టుల్ని హింసించకుండా, వారిని సరియైన మార్గంలో నిలపడమే భగవంతుని శోభను ఇనుమడింప చేస్తుంది. ఈశ్వరుని పాత్ర ద్వారా రచయిత దానిని నిరూపించారు.

## కాలయంత్రం:

### విశ్వం:

'కాలయంత్రం' అనే ఈ సైన్ఫిక్ నాటకంలో సైంటిస్ట్ పాత్ర 'విశ్వం'. చిన్ననాడే పోలియోవల్ల అవిటితనానికి గురైన విశ్వం, సైంటిస్ట్‌గా ఎదిగి ఎన్నో కొత్త అంశాలను కనుక్కోవడం, కాలయంత్రం వంటి అపూర్వమైన యంత్రాన్ని సృష్టించడం వంటి అంశాల ద్వారా గొప్ప ఆత్మవిశ్వాసం, పట్టుదల మూర్తీభవించిన పాత్రగా 'విశ్వం' ను మలిచారు రచయిత.

సేవలు చేసే మరయంత్రాన్ని సృష్టించి

దానికి 'టుంబ' అని పేరుపెడతాడు. తెలుగులో సేవకుణ్ని 'బంటు' అని పిలుస్తారు. 'బంటు' ను వెనకనుంచి ముందుకు రాస్తే 'టుంబ' అవుతుంది. 'బంటు' అనేది సేవకుడైతే 'టుంబ' సేవకుడ్ని మరమనిషే. అలాగే 'హరిశ్చంద్ర' ఇది నిజాన్ని కక్కించే మిషన్. ఉన్న వస్తువులను యుగాలతరబడి చెక్కు చెదరనీయకుండా వుంచే యంత్రం పేరు 'యథాతథా'. ఎలక్ట్రిసిటీ లా పనిచేసే యంత్రం పేరు 'సూర్యతేజ' అంటూ పేర్లు పెడతాడు. ఇది 'విశ్వం' పాత్ర సృజనాత్మకతకు అద్దం పడుతుంది.

భవిష్యత్తు గురించి అన్ని విషయాలు తెలిసినప్పటికీ మన ప్రవర్తనలో న్యూనతాభావం రానీయకూడదన్నది ఈయన సిద్ధాంతం. అందుకే కృష్ణవేణిని పెళ్ళిచేసుకుంటా భవిష్యత్తులో సంభవించే కష్టాలను కాలయంత్రం ద్వారా తెలుసుకున్న కుమార్ తానిక కృష్ణవేణిని పెళ్ళిచేసుకోను అంటాడు. అతని ధోరణిని విశ్వం నిరసిస్తాడు. కుమార్‌కు నచ్చచెబుతాడు. ఈ సందర్భంలో విశ్వం మానవతాధోరణి స్పష్టం అవుతుంది.

విజ్ఞానం, మానవత్వం, సృజనాత్మకత మూర్తీభవించిన క్యారెక్టర్‌గా 'విశ్వం' పాత్రను మలిచారు రచయిత.

## కుమార్:

ఈ నాటకంలో కుమార్ కాబోయే భార్యను అమితంగా ప్రేమించే ప్రేమికునిగా, కాలయంత్రంలో ప్రయాణించి భవిష్యత్తును తెలుసుకోవాలనుకునే తపన కలిగిన ఆసక్తిపరునిగా, భవిష్యత్తును తెలుసుకుని తాను ప్రేమించిన బాలకుట్టి (కృష్ణవేణి) ని పెళ్ళి చేసుకోను అనే ఆలోచన వచ్చిన భీరునిగా, ప్రేమించిన వ్యక్తిని మరిచిపోలేని నిసర్వైన ప్రేమికునిగా కనిపిస్తాడు కుమార్.

కుమార్ కృష్ణవేణిని మనసారా ప్రేమిస్తాడు. తన మిత్రుడు విశ్వంను పెళ్ళికి ఆహ్వానించేందుకు కృష్ణవేణితో కలిసి వెళతాడు. అక్కడ కాలయంత్రంలో భవిష్యత్తులోకి ప్రయాణించిన కుమార్ తన పరిస్థితి తెలుసుకుని నిర్ఘాంతపోతాడు. తను ప్రేమించి

పెళ్ళి చేసుకున్న కృష్ణవేణి డ్రగ్సులకు బానిస కావడం, కూతురు తననే లెక్క చేయకపోవడం, కొడుకులు జల్సాగా డబ్బు ఖర్చు చేసే వాళ్ళుగా తేలడం, తనూ తాగుబోతు కావడం, మొత్తం అయిన అప్పుల్ని తీర్చడం కోసం తన 'కన్ను'ను అమ్ముకోవడం వంటి సంఘటనల్ని చూసి, తనపై తనకే విరక్తి కలిగి ఇక తాను కృష్ణవేణిని పెళ్ళి చేసుకోనని విశ్వంతో చెబుతాడు.

అయితే విశ్వం ఒక షరతు విధిస్తాడు.

కృష్ణవేణిని ఇకపై ముద్దుగా 'డాలుకుట్టి' అని పిలవవద్దని. కాని కృష్ణవేణి అలక చూసిన తర్వాత హృదయంలో దాగిన ప్రేమ పెల్లుబికి 'డాలకుట్టి' అని పిలుస్తాడు. ఓదారుస్తాడు. కృష్ణవేణిని పెళ్ళి చేసుకోకూడదన్న ఆలోచనను మానుకుంటాడు. ఒక గమ్మత్తైన నైజం గల పాత్రగా 'కుమార్' ను మలచాడు రచయిత.

# కృష్ణవేణి :

ప్రేమించిన కుమార్‌తో చక్కని జీవితం గడపాలని భావించే ప్రేమికి కృష్ణవేణి. ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన కుమార్ తనను పెళ్ళి చేసుకోనని చెప్పడంలో హతాశయురాలవుతుంది. కుమార్ బ్రహ్మచారిగానే వుంటానని, నిర్ణయించుకోవడంలో, తను కూడా ఆజన్మ బ్రహ్మచారిణిగా వుండిపోతానని చెప్పడమే కాక చివరకు ప్రాణాన్నే తీసేసుకుంటానని ఏడుస్తుంది. ఒక ఉదాత్తమైన ప్రేమికగా, సున్నిత హృదయం కలిగిన స్త్రీగా 'కృష్ణవేణి' పాత్రను సృష్టించారు చిరంజీవి గారు.

# సంభాషణలు

నాటకానికి సంభాషణలు ప్రాణం. అది దృశ్యనాటకం కావచ్చు. శ్రవ్యనాటకం కావచ్చు. ఇతివృత్తం ఎంతగొప్పదైనా, పాత్రలు ఎంత గొప్పవైనా ప్రేక్షకుల్ని లేదా శ్రోతను ఆకట్టుకునే సంభాషణలు లేకుంటే నాటకం రక్తి కట్టదు. నాటకం ప్రయోజనం నెరవేరదు. 'ప్రతి భాషణం సంభాషణం కాదు'[1] అంటారు కొలకలూరి ఇనాక్ గారు. నాటక రచయిత సంభాషణల రచన ద్వారానే తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటాడు.

శ్రవ్యనాటకాల విషయానికొస్తే అభినయ, ఆంగిక, వాచిక, ఆహార్యాలను కేవలం సంభాషణల ద్వారానే ఆవిష్కరించవలసి వుంటుంది. రేడియో నాటకాలకు సంభాషణలే సర్వం. సంభాషణలు సహజంగా వుంటాయి.

---

1. ఆచార్య కొలకలూరి ఇనాక్, సాహిత్యదర్శిని, పుట. 93

చిరంజీవి గారి రేడియో నాటకాలలో సంభాషణల్లో స్వాభావికత, చమత్కారం, మాండలికతలను పరిశీలిద్దాం.

## స్వాభావికత:

'ఆకలిమందు' అనే నాటకంలో పారిశ్రామిక వేత్తల వ్యాపార శైలిని చక్కగా ఆవిష్కరించారు. డాక్టర్ రాంజోషి కనిపెట్టిన 'ఆకలిమందు' హక్కులను సొంతం చేసుకునేందుకు వ్యాపారవేత్తలయిన శ్రీమాన్‌జీ, కర్ర తంజనీల సంభాషణల్ని పరిశీలిద్దాం.

"శ్రీమాన్‌జీ: హో హో హో! ముందు ఆ ఇంద్రకీలాద్రి భవనం
మీదికెక్కిన పిచ్చికుర్రాన్ని పిలిపించండి.
ఆకలిమందు అమ్మబడును అన్న ప్రకటన
ఆకాశంలోంచి రాసెయించండి. హోహోహో!
ఒక లక్ష రూపాయలిస్తాను.

రాంజోషి: ఆశ్చర్యమా! ఆకలిమందు ఆటం, హైడ్రోజన్,
నైట్రోజన్ బాంబులకంటే విలువైంది. మాత్ర
ఖరీదు వంద కాదు గదా. ఒక రూపాయి

పెట్టినా జనాభా లెక్కల ప్రకారం మనదేశంలోనే
నాకు 60 కోట్లు లాభం.

కర్ణరంజన్ : నేను 30 కోట్లు ఇస్తాను. పేటెంట్ రైట్స్ నాకివ్వండి.
డాక్టర్ సాబ్. తీమూన్ జీ! ముందు వచ్చిన
వాణ్ణి నేను. నేను కాదంటే మీరు తీసుకోవాలి.
అది వ్యాపారధర్మం మీకు తెలిసిందే.

తీమూన్ జీ : హో హో హో! ఈ మందుల వ్యాపారం నాది కదా!
కర్ణరంజన్! మీరెలా కల్పించుకుంటారు?"[1]

'వంశాంకురం' లో దేశికాచార్యులు కవి, తాత్వికుడు. అటువంటి వారి మాటలు మనల్ని సమ్మోహితుల్ని చేస్తాయి. దేశికాచార్యులు స్వభావానికి క్రింది సంభాషణ అద్దం పడుతుంది.

"దేశికాచార్యులు: ఈ సమాజం ఇలా వుండడానికి కారణం
మనమే తమ్ముడూ! మనమే బాధ్యులం.
మనదేమీ బాధ్యత లేదని తప్పించుకోడానికి
వీలు లేదు. మన తాతలు చేసినవి
తండ్రులు అనుభవించారు. తండ్రులు
చేసినవి మనం అనుభవిస్తున్నాం. మనం

1 కె.చిరంజీవి, జీవితమే నాటకరంగం పు.113.

ఈనాడు చేసేది రేపు మనబిడ్డలనుభవిస్తారు.
అది మంచయినాగాని, చెడయినాగానీ, నేను
ఈనాడనుభవిస్తున్న ఒక దౌర్భాగ్యానికి
వ్యక్తిగత కారణాభూతాన్ని కాకపోవచ్చు. కాని
ఇది నా తండ్రి చేసిన పాపం, తల్లి చేసిన
పాపం, తాతముత్తాతలు చేసిన పాపం."1

'ఊరోళ్ళు మేల్కొంటున్నరు' లో బాలరాజు పాత్ర పరంగా విలన్. ఒక భీకరుడు కూడా అతని స్వభావాన్ని తెలిపే ఈ సంభాషణలు చూడండి.

"బాలరాజు: "సర్పంచ్ సాబ్! నీ రూపు పెడగొట్టినందుగ్గాను గా దవకానోల్లతోని కేసేయిస్త. నీ కెందుకు, నిన్ను నిశానెయ్యి, నేన్నడిపిస్త కేసు. నీకు లచ్చ రూపాయిప్పిస్త.

సర్పంచ్: గట్లంటవా బావ! దొరుకుతయంటవా?

బాలరాజు: గో మల్ల? మొన్న మా బావమరిది ఊళ్ళ కేసేపిచ్చిన. ఒక కోడిపుంజు సర్కారు మోటరు కిందబడి సచ్చింది. పందెప్పుంజు! అది పందెప్పుంజని ఒప్పి ఐదువేలు కక్కిచ్చిన! సర్కారోల్లు నోరెల్లబెట్టిన్రు! నీకు గూడ గట్లనే ఇప్పిస్త.

1. కె.శివారెడ్డి. జీవితమే నాటకరంగం, వంశాంకురం. పుట.15

నివ్వేం మామూలు మనిషివా? ప్రేమ సర్పంచివి. ప్రేమ సర్పంచి రూపు లచ్చరూపాలకి ఒక బుడ్డపైస తెకుటివ కాది"[1].

జనాన్ని సవ్యంగా నడిపించగల నాయకుడు వీరదాసు. అతని స్వభావాన్ని కళ్ళకు కట్టించే ఈ సంభాషణలు పరిశీలిద్దాం.

"సూరప్ప: అన్నా! ఇంక రాయుడయ్యని ఏం చేద్దామంటావు? సర్కారుకి పట్టిచెయ్యటమేనంటావా?

వీరదాసు: (నవ్వి) అన్నిటికీ అగ్నిమంత్రం మనికి రాదు తమ్ముడూ! కట్టె వంక పొయ్యి తీర్చె మాట నిజమే కాని, అన్నిటికీ ఈ వైద్యసూత్రం వర్తింపచేయగూడదు... ప్రభుత్వం బంజరు భూములిస్తాంటున్నది గదా! అక్కడికే పోదాం. రేపటినుంచి సంతకాల కార్యక్రమం ప్రారంభం చెయ్యి. ఎంత వీలుంటే అంత త్వరగా ఈ పీడనుంచి విముక్తులై మన జీవనవాడను మనం చేరుకోవాలి.

సూరప్ప: జీవన వాడా?

వీరదాసు: అవును. కొత్తగా మనం నిర్మించుకోబోతున్న గ్రామానికి పేరు. జీవన వాడు"[2].

---

1. కె. చిరంజీవి. జీవితమే నాటకరంగం, ఊళ్ళోళ్ళు మేలుకుంటున్నారు పు. 49.
2. అదే. 'బీళ్ళు తిరగబడుతున్నాయి'. పు. 144

భర్త హింసించినా సరే ఐదవతనమే కావాలనుకుని అతన్ని జైల్లోకి పంపడానికి ఇష్టపడని ఇల్లాలు వరమ్మ ఆమె స్వభావాన్ని క్రింది సంభాషణలు స్పష్టం చేస్తాయి.

అనంతమ్మ: బిడ్డా! వానిమీద కేసు బెట్టాలె. ఊకో రాదు. నిజ్జె వున్నదున్నట్లుగా జెప్పు. ఎక్కువేమి జెప్పొద్దు. నీకు జరిగింది జెప్పు చాల్. జైల్ల నూకేద్దాం కొడుకుని.

వరమ్మ: జైల్లనా? వద్దు జైల్ల నూకిస్తె సచ్చిపోతాడు. సస్తె నా పసుపు కుంకుమ లేంగావాలె? అయ్య జైలుకు బోతె నన్ను, నా పిల్లను ఎవ్వలాదుకుంటరు? అందుకే అసలు నిజం జెప్ప. నే జెప్ప. పుల్లన్న పొట్లగిత్త పొడిసిందనే జెప్త. మొగడు జెప్పుమన్నట్లు అబద్ధమే జెప్త." [1]

బలహీన వర్గాల వారు తమ చెప్పుల కింద ఉండాలనుకునే నీచులు రాయుడు, ఆనందమూర్తి 'శాంతిసమరం'లోని వారి సంభాషణలు చూస్తె వారి నైజం తెలుస్తుంది.

---

1. జీవితమే నాటకరంగం, కె. చిరంజీవి. పుట.59

ఆనందమూర్తి: నాయకత్వం నాకప్పగించండి. ఎలా ఆ ముష్టి వెధవలను - ఎవరూ లేరుగా - ముష్టివెధవలను లొంగదీస్తానో చూడండి. సరేనా?

రాయుడు: అంతకంటేనా? వాళ్ళు బతకకుండా వుండడమే నాకు కావల్సింది.

ఆనందమూర్తి: కాదు వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడకుండా వుండడమే మనకు కావల్సింది. నేర్చుకోండి. నో. ఇంతకంటే వివరాలంగా మాట్లాడుకోనక్కరలేదు.... చెప్పండి. పూర్తి వివరాలు కావాలి నాకు వాళ్ళ హిస్టరీ. జాగ్రఫీ, సైన్స్, సోషల్. అన్నీ కావాలి." 1.

భూస్వాములను ఎదిరించి సొంతగా బ్రతుకుతున్న వారిని హింసించాలనుకునే వారి నైజానికి పై సంభాషణలు దర్పణం పడుతున్నాయి.

భార్యాభర్తల మధ్య కొట్లాటలు జరిగినప్పుడు, పరిస్థితి విషమించినప్పుడు, వాళ్ళు మరీ నాగరికులైతే ఆ సంభాషణల్లో వింత పోకడలు కనిపిస్తాయి. వారి

---

1. జీవితమే నాటకరంగం. కె. చిరంజీవి, పు. 159.

స్త్రైణాన్ని బయటపెడుతాయి. ఈ సంభాషణలను పరిశీలిద్దాం.

MM/V2/F* ఛీ పెళ్ళి! ఉత్తినే చేసుకున్నావా పెళ్ళి? పాతికవేలు కట్నం పోస్తే ఇదుగో - ఈ తాళికట్టావు.

MM/V1/M** ఇదుగో - ఈ - కన్ను - యాభైవేలకు అమ్మి నీ కుక్కల కింద చేసిన అప్పులు తీర్చాను.

MM/V2/F (గుండెలు బాదుకుంటూ) నాయనో, నాయనో, నేను చేశానా అప్పులు?

MM/V1/M మరి నేను చేశానా?

MM/V2/F నువ్వే, నువ్వే చేశావు. నీ తాగుడు కింద. నేనింకా Dog racesలో గెలుచుకొచ్చిన డబ్బు నీ బొంద మీద పోసాను.

MM/V1/M నీ బొందమీద - జూదంలో కొట్టుకొచ్చిన డబ్బేలా- నేనూ పోశాను జోస్యళ్ళలో.

MM/V2/F I hate you devil (అంటూ ఒక గ్లాసు విసిరేసింది)

---

* Miracle machine / voice 2 / Female (కృష్ణవేణి)

** Miracle machine / voice 1 / Male (కుమార్.

mm/v1/m: I hate you Demon (అంటూ మరో గ్లాసు విసిరేశాడు)

mm/v2/F: You devil!

m/v1/m: You demon!"[1]

తాగుబోతు స్వభావాన్ని 'శాంతి సమరం' సంభాషణాల ద్వారా అందించిన తీరు క్రింది సంభాషణల్లో కనబడుతుంది.

పుల్లన్న: ఒరె ఒరె ఒరే! అసలు సంగతే మర్చిపోయిన గురూ! ముందు దిగకముందే సత్తెం ఒప్పేయ్యాల, లేకపోతే ఒట్టు మడిసికన్న అబద్దాలె వస్తయి. లోకం గందా ఈ పాడులోకం కోసం అన్ని తప్పులు కూతవె కుయ్యాల.

ముసలయ్య: అయితే నువ్వింత కాలం ఆడినయన్నీ అబద్దాలెనంటావా?

పుల్లన్న: ఆ అబద్దాలే. పచ్చి అబద్దాలే రాసుకో."[2]

---

1. కె. చిరంజీవి, జీవితమే నాటకరంగం, కాలయంత్రం పుట.213.
2. అదే, శాంతిసమరం, పుట. 170.

కలహాభోజుడైన నారదుని పాత్ర
స్వభావాన్ని రచయిత ఈ క్రింది సంభాషణల్లో
చక్కగా శ్రోతమనకు హత్తుకునేట్లు రాసారు.

కృష్ణుడు: నారదా! నన్ను రక్షించు

నారదుడు: నారాయణా!

కృష్ణుడు: కాలహరణం భరింపరానిది.

నారదుడు: నారాయణా! (తనలో) ముళ్ళమాటలు పెట్టి కలహములు
పెంచువాడని ప్రభువులన్నారు గాని, అది నా తరమా?
అయినను మన కలహములు లోక కళ్యాణములు!
ఇందులో ముళ్ళ మాటలు కలహములనునది చెప్పించకుండనే,
ఒక లఘు పరీక్ష పెట్టెదగాక! (నవ్వి) కాలహరణమునకు
ఒకింత కాలక్షేపమైనా ఉండవలయును గదా! అదియునుం
గాక, అందరును ప్రభువుల వేదన, తమ వేదనగా
నటించువారే, భ్రమించువారే, భావించువారే, ఎవరి
వేదనవెంత లోతులో తెలిసికొనుటకు - హా దేవదేవా!
ఇప్పుడు దొరికినది అదను! (నవ్వి) నారాయణా!
నారాయణా!"[1].

---

1. శ్రీ. చలంజి, జీవితమే నాటకరంగం, శ్రీకృష్ణశిరోభారం. పుట. 97.

పాత్రల స్వభావాలకనుగుణంగా సంభాషణలు రాయడంలో చిరంజీవి గారు కృతకృత్యులు.

## చమత్కారం:

సంభాషణలో చమత్కారం శ్రోతల్ని సమ్మోహితుల్ని చేస్తుంది. 'వంశాంకురం' లోని ఈ చమత్కార సంభాషణల్లో గల ఆహ్లాదం చూద్దాం.

పావని : క్షమించాలి డాక్టర్, కాస్త ఆలస్యమైంది. మా వారు కవులు గదా! మతిమరుపు నటిస్తారు.

డాక్టర్ : నటిస్తారా ?

పావని : మతి మరుపు నటించి ఒక బస్సులో ఎక్కించవలసింది పోయి ఇంకో బస్సులో ఎక్కించారు. నటన గాకపోతే ఏ ఒక్కరోజు టీ ఇచ్చినా, కాఫీ అని తాగుతాడే మరి."1.

ఇదే నాటకంలో చమత్కారం మేళవించిన మరో సంభాషణ.

---

1. కై. చిరంజీవి, జీవితమే నాటకరంగం, వంశాంకురం. పుట. 12

"డాక్టర్ జేమ్స్: పాపం! ఐ లైక్ దిస్ ప్రియురాలు.

మిసెస్ జేమ్స్: షూట్ చేస్తాను, మళ్లీ ఆ మాట అన్నావంటె.

డాక్టర్ జేమ్స్: ఓ మై ఫెయిర్ లేడీ డాక్టర్! జీవితంలో ఒకే ఒక్కసారి నిన్ను మరిచిపోయిన మధుర క్షణమిది. ఓ వసంత...

మిసెస్ జేమ్స్: ఆ పిల్ల పేరు వసంత కాదు.

డాక్టర్ జేమ్స్: ఆ వసంతకాలంలోని ఋతుకన్య నిన్ను మరిపించింది.

మిసెస్ జేమ్స్: నిన్ను మరిపించిందా? నన్ను మరిపించిందా? మరో అంత మైమరపు అవసరమైతే anaesthesia యిచ్చి పడేస్తాను. జీవితాంతం మైకంలోనే పడి వుండేలా.

డాక్టర్ జేమ్స్: దట్స్ నైస్. (అని పెద్దగా నవ్వాడు)

మిసెస్ జేమ్స్: మళ్లీ వేరె తలెత్తకుండా ఇస్తుంటాను (ఇద్దరు నవ్వుకుంటారు)"[1]...

భార్యాభర్తల మధ్య హాస్యపు సన్నివేశాలు చిరంజీవి గారి సంభాషణల్లో చక్కగా పండించారు.

'శ్రీకృష్ణ శిరోభారం' పౌరాణిక నాటకం కాబట్టి

---

1. కె. చిరంజీవి. జీవితమే నాటకరంగం. వంశాంకురం. పుట. 6.

సరళగ్రాంథిక భాషలో చమత్కారం, హాస్యం చక్కగా పండించారు రచయిత కె. చిరంజీవి 'శ్రీకృష్ణ శిరోభారం'లో వాసంతిక, వసంతుడు ల సంభాషణలు ... ఒక మచ్చుతునక.

వాసంతిక: ప్రభువుల వారి భారం పట్టపు రాణి భారం. ఆ పట్టపు రాణి భారం ప్రియసఖ్యులనైన నా భారం.

వసంతకుడు: (నవ్వుతూ) నీ భారమే ఇకపై నా భారమగు గాక! నాకు సంక్రమించి, నాతోనే ఆగక, అది నా ప్రజలకున్నూ వ్యాపించుగాక.

వాసంతిక: నీకా (నవ్వి) నీకెందుకొస్తుందయ్యా వసంతకా!

వసంతకుడు: అంతే.... ఒసే ఒసె జంతికా! నా చర్మం మందమనా నీ అభిప్రాయం."[1].

'ఆకలిమందు' నాటకంలోని ఈ క్రింది సంభాషణలు పరిశీలిద్దాం.

గాంజోష: ఈ కోతులకు ఆహారమిచ్చి నాలుగు మాసాల-వన్ సెకండ్. వెటమి-యు- నాలుగు మాసాల పదిహేడు దినాలయింది.

---

1. కె. చిరంజీవి, జీవితమే నాటకరంగం, శ్రీకృష్ణశిరోభారం. పుట. 79.

ఇక్కడున్న ఈ జంతువులకన్నిటికీ ఒక్కొక్క మాత్ర వేసాను. అంతే మళ్లీ ఆకలిగాని దప్పికగాని లేదు. ముట్టుకు చూస్తారా ఒకదాన్ని?

కర్తరంజన్: ఛీ. ఛీ. ముట్టుకోను. కాని...

రాంజోషి: ఏమిటి మీ అనుమానం. అంత పరిశీలనగా చూస్తున్నారు.

కర్తరంజన్: ఏదో కొయ్యబారినట్లుగా, అంటే, గడ్డకట్టినట్లు

రాంజోషి: (నవ్వి) గడ్డకట్టడం కాదండీ, కండపట్టాయి. జంతువులు కండపట్టాయనండీ."[1]

పై సంభాషణలకు దృశ్యరూపాన్ని ఊహించుకుంటే సైంటిస్టు రాంజోషి, చూపే గిన్నిపందులను చూస్తూ, జుగుప్సాకరమైన అనుభూతి ననుభవిస్తున్న కర్తరంజన్ కదలాడుతాడు.

ఇదే నాటకంలో 'వందరూపాయలకు ఆకలి మందు దొరుకుతుందని' ఆ వింత సంపాదన కోసం చేసిన అలజడని చిరంజీవి గారు చమత్కారంగా ఇలా చెప్పారు.

---

1. కె. చిరంజీవి, జీవితమే నాటకరంగం, ఆకలిమందు పుట. 112.

"ఒకగొంతు: ... రండి బాబులూ! రండి. ఈ అందాల బొమ్మల్ని చూడండి. బాబులూ! ఈ కన్నెపిల్లలు ఇంతవరకు పురుషస్పర్శ అంటే ఏమో యెరుగరు. కేవలం కడుపుకోసమే ఈనాడు అమ్ముడుపోతున్నారు. రండి బాబులు! ఒక్కొక్క కన్నెపిల్ల ఖరీదు కేవలం వంద. మీకు మనస్సైన అందాలబొమ్మను ఎన్నిక చేసుకోండి బాబులూ...

మరోగొంతు: .... ఆలిండియా అనెంప్లాయిస్ అసోసియేషన్ తరఫున మనమెంతయినా అలజడి చేయవలసివుంది. వందరూపాయల పెమ్మటంటే మన మెక్క కొల్లొంచి తెస్తాం! మిత్రులారా! ఉద్యోగం తేనంతమాత్రాన మనకు ఆకలి వెయదా? వేస్తుంది. అధికతరంగా వేస్తుందని ఘంటాపథంగా చెప్పగలను. కాబట్టి ఓ నా మిత్రులారా! మన నిరుద్యోగ వర్గానికే యిందులో అధికతర ప్రాధాన్యం ఇవ్వాలని, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిలో మనపేర్లు నమోదైనప్రకారం ఈ ఆకలిమందును ఉచితంగా పంచిపెట్టాలని..."[1]

---

1. కె.చిరంజీవి. జీవితమే నాటకరంగం, ఆకలి మందు. 115.

చమత్కార సంభాషణలలో చిరంజీవి గారు నాటకాలను హృద్యంగా శ్రోతలకు అందించారు.

## మాండలికం:

కె. చిరంజీవి గారి "ఊరోళ్ళు మేల్కొంటున్నారు" నాటకానికి ప్రేరణ నల్గొండ జిల్లాలో జరిగిన ఒక వాస్తవగాథ. చిరంజీవి గారు ప్రకాశం జిల్లాలో పుట్టినప్పటికీని వృత్తిరీత్యా హైదరాబాదులో వుండడం వల్ల తెలంగాణా మాండలికం పట్ల స్పష్టమైన అవగాహన ఏర్పరచుకున్నారు. అయినా నాటకంలో స్పష్టత కోసం, సహజత్వం కోసం డాక్టర్ దేవరాజు మహారాజు, తెలిదేవర భానుమూర్తి గారల సహాయ సహకారాన్ని తీసుకున్నారు. "ఊరోళ్ళు మేల్కొంటున్నారు"లోని తెలంగాణా మాండలికంలోని సంభాషణలు....

రంగయ్య: బావా! నేనేమన్న? ఏమన్న నేను?
ఒర్లే, అట్ల కోపాన్కొస్తావ్?

బాలరాజు: కోపం - ఎవనికోపం? నేను కోపానొచ్చిన్నా?

ఏమున్న తలోఖున్నదా నీ దగ్గర? అరె, మాట-
మాట మాట్లాడరాదు - ఇంకేమి చెప్తాండు!

సీతమ్మ: నాయ్నా! నీకో దండం. ఫ్రాకా.
ఆర్ది తెల్వని గోరం తిన్నాడు. ఒక మంచి శెడ్డ
నేర్చుకోవటె.

రంగయ్యా: నేనే మన్ననే?

బాలరాజు: 'గవి తీసక పో యిస్తే' అని అంటవ? చెప్పమా
ఏమున్న, గడికిన్ని గడికిన్ని ఇస్తనంటవ్?

రంగయ్యా: మల్ల ఏమందు? ఏమందునె? (ఏడ్పిస్తున్నది)
ఉన్నకాడికి ఇస్తనంటుంటి.

బాలరాజు: ఇగో, సూడు, రంగయ్యా - నాకివ్వాన్ని తెల్వది.
(కోపంలో ఊగిపోతున్నాడు) నా పైసలు నాకుకకూలని.
దసరా పండుగ లోపల గావలె ... లేకుంటే ... లెకుంటే
బాగుండదు చెప్తున్న. మీరు శైల్లెను సద్దులకు పంపేది
లేదు. నేను దివిలె కొచ్చేది లేదు. గంతే.
సమజయిందా? ఆ ఇగ గంతె.

---

1. కె. చిరంజీవి, జీవితమే నాటకరంగం,
ఊరోళ్ళ మేలుకుంటున్నారు, పుట. 43.

'ఊరోళ్ళు వేలాడుతున్నారు' మొత్తం నాటకం తెలంగాణా గ్రామీణ మాండలికంలో సాగుతుంది. మిగిలిన నాటకాలన్నీ వ్యావహారికంలో, పత్రికాభాషలో సాగాయి.

'బీళ్ళు తిరగబడుతున్నాయి' నాటకంలో గోదావరి మాండలికాన్ని రచయిత ప్రయోగించాడు. కాలం బీడు పడింది. అయినా రాయుడు దిగి రాలే; ఎంకటుదాసు పోరినా, తిరిగి ఆ భూమిలో దిగి నాగలి పట్టేదే లేదన్నారు కూలోళ్ళూ, రైతులూ. ఈ సమ్మె ఎంతకాలం సాగిందనుకున్నావ్! వటించి వటించి ఎంకటుదాసు తనువు చాలించినంత కాలం, చాలా ఇడిచిన నాగేటి మేళ్ళు భూమిలో నాటకపోయి మొలిచి సిగిరించినంత కాలం సాగింది! ఓరే సూరప్పో! ఇప్పుడు ఎంకన్న వంపులో ఉన్న మొక్కుబడి చెట్టు, అప్పుడు మేడినుంచి మొలిచిన ఏపచెట్టేరా. రాయుడయ్య స్వాధీనంలోనే వున్నా ఇప్పటికీ ఆ చేను ఎంకన్న వంపనే, ఆ చెట్టు ఎంకన్న చెట్టని పిలవబడుతూ మొక్కుబడులందుకుంటానే వుంది. ముడుపులు

కేట్లించుకుంటూనే వుంది.

సూరప్పు: అయితే ఆసెట్టుని కొట్టేయ్యాల మొక్క బదులయ్య గూడదు. అది నావ్వుకు గుర్తు." [1]

స్వాభావికత, చమత్కారం, మాండలికం సంభాషణల్లో ఉపయోగించడంతో బాటు శ్రోతల హృదయాల్ని ద్రవింపజేసే సంభాషణలు రాయడం కవి నేర్పును ప్రస్ఫుటం చేస్తుంది. "ఊరోళ్ళు మేలొకుంటున్నారు" లో సంభాషణ సరళి అందుకు చక్కటి ఉదాహరణ.

సీతమ్మ: ఎంకటమ్మా! వరాలు పిలుస్తున్నది. నిన్ను.

ఎంకటమ్మ: వస్తున్న.... నివ్వెందుకమ్మ కంట్లతడి పెట్టుకుంటావ్?

సీతమ్మ: ఏంతే, ఈ అడవిల ఇంకో ఆడుబిడ్డ వచ్చి పడిందని (బిడ్డ ఏడ్పు)." [2]

---

1. కె. చిరంజీవి, జీవితమే నాటకరంగం, చీకట్లో తిరగబడుతున్నా పుట. 134.

2. అదే, ఊరోళ్ళు మేలొకుంటున్నారు. పుట. 51.

పోలీసు సిబ్బంది ఫైర్ వెస్ సెట్ లో మాట్లాడుకునే సంభాషణలు, ప్రత్యేక ధోరణిలో వుంటాయి. చాలా నేర్పుగా సంభాషణలు నిర్వహించాల్సి వుంటుంది. 'ఆకలిమంటు' లో అటువంటి సంభాషణలు రాయడంలో చిరంజీవి గారి నేర్పును చూడవచ్చు.

ఫైర్‌వెస్: కంట్రోల్, కంట్రోల్ రూమ్, డి.సి.పి కాలింగ్ సి.పి.

సిపి: యస్, సిపి స్పీకింగ్. కారియాన్

డిసిపి: గుడ్ ఆఫ్టర్‌నూన్ సార్! సిటీ బ్యాంకు మేనేజర్ సరెండరయ్యాడు. ఓవర్

సిపి: గుడ్. మరి డబ్బు? డబ్బు దొరికిందా? ఓవర్.

డి.సిపి: లేదు సర్! అంతా ఖర్చు పెట్టాడట. వాడూరంతటికి జనానికి పంచి పెట్టాడట. ఒప్పుకుంటున్నాడు. ఓవర్.

సిపి: సరే, కస్టడీలో వుంచండి. నేను డాక్టర్ రాంజోషీ గారిని తీసుకొస్తున్నాను. ఒక్కమాట మళ్ళీ హోం మినిస్టర్ గారి నుంచి మెసేజ్ ఏదైనా వచ్చిందా? ఓవర్.

డి.సిపి: లేదు సర్! ఓవర్

సిపి: దట్సాల్ రైట్. ఓవర్" 1.

నాటకాలకు ప్రాణమైన సంభాషణలను రేడియోకు అనువుగా రాయడంలో చిరంజీవి గారు నేర్పరి. పాత్రలపరంగా, చమత్కారంగా, సన్నివేశపరంగా సంభాషణలు రాసి నాటకాలకు నిండుదనాన్ని సమకూర్చారు ఆయన.

# శిల్పసౌందర్యం - ముగింపు

## శిల్ప సౌందర్యం:

" ఏ నాటకమందైనా నిర్వాహణ శిల్ప విషయమున ప్రధానమైన అంశము మూడు. 1. వస్త్వైక్యమును సాధించడం, 2. రచన ఉదాత్తంగా వుండడం, 3. పాత్ర పోషణ ఉత్తమంగా ఉండడం." 1.

చిరంజీవి గారి 'వంశాంకురం', 'ఊరోళ్ళు వేలాడుతున్నారు', 'శ్రీకృష్ణ శిరోభారం'. 'ఆకలిమంటు', 'ఆకళ్ళు తిరగబడుతున్నాయి', 'శాంతి సమరం', 'కాలయంత్రం' నాటకాలలో ఆ మూడు అంశాలను పరిశీలిద్దాం.

## 1. వస్త్వైకము:

'వంశాంకురం' లో రచయిత ఆకృతి షేయత్

1. డా॥ పి.ఎస్. అప్పారావు, దశరూపక సందర్శనం. పుట. 28.

ఇన్‌సెమినేషన్ ద్వారా సంతానం కనిఇచ్చే వారు
కావాలన్న ఒక ప్రకటన ఆధారంగా వస్తువును
నిర్మించుకున్నారు రచయిత. అది నాటకీయం, సందేహాత్మకం
కావటంకోసం పావని, ధర్మారావులను గతంలో
ప్రేమికులుగా చిత్రించి, పావని కుటుంబంలో
హై ఫెర్టిలిటీ లేని కారణాన, అందునా ఆడపిల్లలే
సంతానంగా కలిగిన కారణాన ధర్మారావు ఆమెను
పెళ్ళి చేసుకోకపోవడం, ధర్మారావు వివాహమాడిన
సుందరికి అసలు సంతానయోగమే వుండదు. పావని,
దేశికాచార్యులు దంపతులవుతారు. వారికి ఇద్దరు
మగపిల్లలు. వంశోద్ధారకుని కోసం పరితపించే ధర్మారావు
డాక్టర్ల సలహాతో ఇచ్చిన ప్రకటనకు స్పందించి
పావనిని ఆ ధర్మ నిర్వహణ కోసం ఒప్పించింది
దేశికాచార్యులే. ఈ సంఘటనలను పొందుపరచడంలో
చిరంజీవి గారు చూపిన నైపుణ్యం చక్కగా కనబడుతుంది.

పుట్టిన బిడ్డ ఆడనో, మగనో కావడానికి
ఆడవాళ్ళు ఏమాత్రం కారణంకాదని మగవాళ్ళలో వున్న
'X, Y' క్రోమోజోముల్లో 'X' క్రోమోజోము గర్భానికి

కారణమైతే ఆడబిడ్డ, 'Y' క్రోమోజోము గర్భానికి కారణమైతే మగబిడ్డ జన్మిస్తారన్న విషయాన్ని స్పష్టం చేయడం కోసం, ఆర్టిఫిషియల్ ఇన్ సెమినేషన్ ద్వారా గర్భం దాల్చిన పావని ఇద్దరు ఆడ శిశువులకు జన్మనివ్వడం. మళ్ళీ ఈ సంఘటనలన్నింటికి ముగింపు ఇవ్వడం కోసం భర్గరావు వద్ద పనిచేసే రామయ్య, మారుమనువు కుతుర్ని సొంత కూతురుగా పెంచడం. చివరకు పెళ్ళి చేసి అత్తవారింటికి సాగనంపడం ద్వారా 'ప్రేమ' అనేది కడుపుకు సంబంధించినది కాదని హృదయానికి సంబంధించినదని తెలియచెప్పడం ద్వారా కథలో ఎటువంటి బ్యాలన్స్ తప్పకుండా నడిపించారు రచయిత. ఈ నాటకంలో ప్రతి సంఘటనకి లింక్ (సంబం ముఖ్యం. దానిని రచయిత చక్కగా సాధించారు.

## ఊరోళ్ళు మేల్కొంటున్నారు:

ఈ నాటకంలో 'వరమ్మ' పెళ్ళి అనంతర జీవితం విషాదాంతం కనిపిస్తుంది. తనవాళ్ళు కట్నం ఇవ్వనందుకు భర్త పెట్టే బాధలు, ఆ బాధలు భరించలేక

ఫ్రెండింటికి వస్తే, వాళ్ళూ ఆదరించక, చివరకు భర్త దగ్గరకు వచ్చి మృత్యుముఖంలో చావుదెబ్బలు తినడం, చావు బ్రతుకుల్లో వున్న తనను ఊరివాళ్ళు ఆదుకోవడం కథంతా ఒక క్రమంలో సాగుతుంది. ఎక్కడా సస్పెన్స్ లోపించదు.

## బీళ్ళు తిరగబడుతున్నాయి — శాంతి సమరం

ఈ రెండు నాటకాలు ఒకదానికి, రెండవది కొనసాగింపు. 'బీళ్ళు తిరగబడుతున్నాయి'లో అణగారిన వర్గాల్ని రాయుడు లాంటి వారు తమ ఉక్కుపాదాల కింద నలిపేస్తుంటే, వారినందరిని ఏకం చేసి ఒక కొత్త గ్రామాన్ని నిర్మించుకునేందుకు నాయకుడు వీరదాసు ప్రజల్ని బంజరు భూముల ను సేద్యపు భూములుగా మార్చేందుకు కార్యోన్ముఖుల్ని చేస్తే 'శాంతి సమరం'లో ఆ గ్రామాన్ని మృత్యువాకిటగా మార్చేందుకు యత్నించే ఆనందమూర్తి లాంటి సరికొత్త 'విలన్' ఆటకట్టించాలని, స్వీయరక్షణకు ప్రజలచేత 'శాంతి సమరం' చేయిస్తాడు.

ఈ రెండు నాటకాలలో సన్నివేశాలు ఇతివృత్తానికి ఆయువుపట్టుగా నిలిచాయి, సాగే కథనం స్పష్టంగా వుంది.

## శ్రీకృష్ణశిరోభారము:

ఈ నాటకంలో వస్తువు కృష్ణశిరోభారమే. ఆ కృష్ణశిరోభారానికి మూలం అన్వేషించి పరిష్కారం చూపడం ఇందులో వున్న కథ. ఉద్యానవనం, కృష్ణుని మందిరం, కైలాసం, భూలోకంలో గ్రామం ఇలా ఎన్ని సన్నివేశాలు మారినా అన్నీ కథాగమనంలో అవసరమై సాగినవే. కొన్న ఎక్కడా వస్త్వైక్యత లోపించినట్లు లోపించదు. నాటకాన్ని చక్కని ఆకృతిలో నడిపించారు రచయిత

## ఆకలి ముందు:

ఒక నిరుద్యోగి పూటకు గతిలేక, సొమ్మసిల్లి ఒక పార్కులో స్పృహలేకుండా పడిపోయి, లాన్

సైంటిస్ట్‌గా మారి ఈ ప్రపంచంలో అత్యంత ప్రధానమైన 'ఆకలి' నే ఇక లేకుండా చేసేందుకు ఆకలిమందును కనుక్కోవడం, దానివల్ల అల్లకల్లోలం చెలరేగడం, వ్యాపారస్తులు తగాదా పడడం, పోలీసులు శాంతిభద్రతలు పరిరక్షించలేక తనవద్దకు రావడం తన ప్రేయసి పెళ్ళికి సరేననడం లాంటి ఊహాల్ని కలగా మార్చుకుంటాడు. ఊహాల్లోంచి వర్తమానంలోకి వచ్చి తనలోతానే నవ్వుకుంటాడు ఈ నాటకంలో ఏకవస్తువు 'ఆకలిమందు'. దానివల్ల సంభవించే పరిణామాలు కథనంలో చక్కగా సాగి నాటకానికి పరిపూర్ణత తెచ్చిపెట్టాయి.

కాలయంత్రం:

ఇది సైంటిఫిక్ నాటకం. ప్రయోగాత్మకంగా సాగిన ఈ శ్రవ్యనాటకంలో ప్రధాన పాత్రధారి విశ్వం అనే సైంటిస్ట్. అతను కనిపెట్టిన కాలయంత్రంలో కుమార్ అనే వ్యక్తి ప్రయాణించి తన భవిష్యత్తును సందర్శించి, జీవితంపై విరక్తి కలిగే స్వానుభవాన్ని

ఆగి పొందించుకుని, తను ప్రేమించిన కృష్ణవేణిని పెళ్ళి చేసుకోనని అనడం, చివరకు ఆ అమ్మాయి అలగడంలో తప్పు తెలుసుకుని ప్రేమను పెళ్ళిగా మార్చుకోవడం, అందుకు విశ్వం ప్రోత్సహించి అభినందించడం ఈ నాటకంలోని ఇతివృత్తం. ఈ నాటకంలోని సన్నివేశాల మధ్య ఇంటెన్స్ కల్పించడం అనేది జరగలేదు.

ప్రతి నాటకంలోనూ చిరంజీవి గారు వస్త్వైక్యమును ఎక్కడా లోపింపజేయలేదు. తద్వారా శ్రోతకు 'అయోమయం' అనేది పొరసిల్లదు.

## రచన ఉదాత్తంగా సాగడం:

చిరంజీవి గారి ప్రతి రేడియో నాటకంలో ప్రత్యేకత కనిపిస్తుంది. ఎన్నుకున్న ఇతివృత్తాన్ని, అనువైన సన్నివేశాలలో బంధించి, దానికి సమగ్రమైన, సంపూర్ణమైన రూపాన్ని కల్పించారు.

రచనాశైలిలో ప్రత్యేకతను చాటుకుంటూ తనపైన ఎవరిముద్ర పడనీయకుండా, సమస్యను ఎన్నుకుంటే దానికి పరిష్కారం చూపడం (తనపరిధిలో) అనే ఆలోచనలతో రచనా శైలి సాగుతుంది.

ఈ శైలికి 'ఇళ్లు తిరగబడుతున్నాయి', 'శాంతి సమరం', 'ఊరోళ్లు – – ఉంటున్నారు' అనేవి చక్కని ఉదాహరణలు.

లోకం వింతపోకడలను సున్నితంగా విమర్శిస్తూ, వాటిని సరిదిద్దుకోవాలని హెచ్చరించే రీతిలో సాగిన 'వంశాంకురం' నిజంగా ఒక ఆణిముత్యం.

అలాగే ఒక నిరుద్యోగి ఊహకు రూపకల్పన 'ఆకలిమంటు', పౌరాణిక నాటకం 'త్రిశీర్ష శిరోభారం', సైంటిఫిక్ నాటకం 'కాలయంత్రం' నాటకాలు రచనపరంగా ఉదాత్తంగా, అందంగా సాగినాయి. చిరంజీవిగారి విలక్షణ - శైలికి తార్కాణాలు. అందుకే అవి జాతీయ స్థాయిలో

అన్ని భాషల్లోకి అనువదింపబడ్డాయి. తన ఉదాత్తమైన రచనా పటిమ ద్వారా చిరంజీవి గారు తన నాటకాల్లో తెలుగు ప్రజల జీవితాన్ని, సమస్యల్ని చిత్రించారు.

పాత్రపోషణ:

చిరంజీవి గారి రేడియో నాటకాల్లో పాత్ర పోషణ ఉత్తమంగా సాగి నాటక సౌష్ఠవానికి ప్రాణంగా నిలిచిందని చెప్పవచ్చు.

'వంశాంకురం' లో ఆస్తికుడు, మానవతావాది, ధర్మ నిర్వహణకు కట్టుబడిన వ్యక్తిగా 'దీక్షాచార్యులు' పాత్రను చాలా ఉత్తమంగా చిత్రీకరించారు. క్షేత్రం, బీజం కన్నా 'స్థితి' ప్రధానమని నమ్మిన వ్యక్తిగా దీక్షాచార్యులు పాత్ర నిర్మితమైంది.

అలాగే 'శాంతి సమరంలో' నూ, 'బోట్లు తిరగబడుతున్నాయి' లోనూ కథానాయకుని పాత్ర వీరదాసు.

భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా పోరాడే వ్యక్తిగా, స్వయం సమృద్ధి సాధన వైపు అనుచరులు ఉన్ముఖులయ్యేట్లు చేయడం, నవ జీవనం కోసం, ప్రజలకోసం. అదే ప్రజల చేత నవ 'జీవనవాడ'ను నిర్మింపచేసే ధీరోదాత్త నాయకుని పాత్ర 'వీరదాసు'.

'ఊరోళ్ళు ఏమంటున్నారు'లో 'వరమ్మ' పాత్ర వరకట్నపు కోరల్లో నలిగే ఎందరో అభాగ్యస్త్రీల జీవితాలకు ప్రతిరూపం. అలాగా అదే నాటకంలోని 'బాలరాజు' పాత్ర అత్తగారు ఇస్తానన్న కట్నం ఇవ్వలేదన్న నెపంతో భార్య. సకల విధాలుగా బాధించే దుష్టపాత్ర.

'శాంతి సమరం'లోని ఆనందమూర్తి, 'బీళ్ళు తిరగబడుతున్నాయి'లోని రాయుడు పాత్రలు తోనే వ్రాసిన కల్కి వంటి అరాచక శక్తులకు, భూస్వాముల దౌర్జన్యాలకు ప్రతీకలైన పాత్రలు.

'ఆకలిమందు' నాటకంలోని కరణరంజన్,

శ్రీమాన్ జీల పాత్రలు వ్యాపారస్తుల స్వార్థపర ధోరణికి అద్దం పట్టాయి.

గ్రామీణ జీవితంలోనూ, గ్రామీణ సమస్యలలోను ప్రగాఢమైన సంబంధం వున్న చిరంజీవి గారు తన రచనలన్నింటి పాత్రల్లో, స్వభావాల్లో వాటిని స్పష్టంగా చిత్రించగలిగారు. చక్కని సృజనాత్మక దృష్టి, క్రియేటివిటీ కలిగిన చిరంజీవి గారు 'కాలయంత్రం' లోని విశ్వం పాత్రను 'ఆకలిమండు'లోని 'రాంజోషి పాత్రను అందంగా మలిచారు. పౌరాణికాల పట్ల అవగాహన కలిగిన ఆయన నారదుడు, ఈశ్వరుడుల పాత్రలను 'శ్రీకృష్ణ శిరోభారం' లో చక్కగా చిత్రీకరించారు.

చక్కని సంభాషణాలలో, అవసరమైన పాత్రల సృష్టిలో, ఇతివృత్తానికి అనుకూలమైన సన్నివేశాలలో అందమైన ఆకృతులుగా ఈ శ్రవ్య నాటకాలను రూపొందించడంలో చిరంజీవి గారు పూర్తిగా కృతార్థులైనారు.

## ముగింపు:

కె. చిరంజీవి గారి ఈ నాటకాలన్నీ హిందీలోకి, కొన్ని ఇంగ్లీషులోకి అనువదింపబడ్డాయి. డాక్టర్ మొదలి నాగభూషణశర్మ, డాక్టర్. జి.ఎస్.సేన్ 'నిర్మల్', దాశరథి రంగాచార్య, దండమూడి మహీధర్, వేమూరి రాధా కృష్ణమూర్తి, వాకాటి పాండురంగారావు గారలు ఈ నాటకాలను అనువదించారు. శ్రీకృష్ణశరోభారం, వంశాంకురం నాటకాలకు 1976లో 'తెలుగు విశ్వవిద్యాలయం' అవార్డు లభించింది.

కె. చిరంజీవి గారి నాటకాలన్నీ స్పందించి రాసినవే. నల్గొండ జిల్లాలో జరిగిన ఒక వాస్తవగాథను ఇతివృత్తంగా గ్రహించి "ఊరోళ్ళు మేల్కొంటున్నారు" ను రచించారు. ఈ నాటకం 1986 అక్టోబర్ 16 న రేడియోలో ప్రసారమయింది.

'బీళ్ళు తిరగబడుతున్నాయి' అనే నాటకం కె. చిరంజీవి 'ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి' కోసం

'నేలదిపాట' అనే పేరుతో రాసిన రంగస్థల నాటకం ఆధారంగా రేడియో కి రాయబడింది. మక్సిమ్ గోర్కీ రచించిన జానపద గాథ ఆధారంగా ఇది రాసారు. ఈ నాటకం 1976 ఫిబ్రవరి 19 న రేడియోలో ప్రసారమైంది. 'శాంతి సమరం', 'బీళ్ళు తిరగబడుతున్నాయి' కి తరువాయి భాగం.

ఈ రెండు నాటకాల గురించి, చిరంజీవి గారి మాటల్లో చెప్పాలంటే "'బీళ్ళు తిరగబడుతున్నాయి' అనే నాటకం ఒక గ్రామం పాదు కుదురుకోవడంలో సమాప్తమైతే, 'శాంతి సమరం' అనే నాటకం ఆ జీవవాడ గ్రామ ప్రజలెలా పాతుకు పోకుండా, వేళ్ళూనకుండా, మొలకెత్తకుండా, తలెత్తకుండా, 'నిర్జలం' (అస్థిరం) గావించబడతారో, అందుకు వ్యతిరేకంగా ఎలాంటి సమరం చేయవలసి వస్తుందో, విశదీకరించడానికి చేసిన ప్రయత్నమిది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం దాదాపు నూటపది రాజ్యాలు సామ్రాజ్య వాదుల సంబంధహస్తాల నుంచి విడివడి స్వతంత్ర రాజ్యాలయ్యాయి. వీటిని

తృతీయ ప్రపంచ రాజ్యాలనీ, వర్ధమాన దేశాలని పిలుస్తున్నాం. అలా కొత్తగా పుట్టిన వర్ధమాన దేశమే - గ్రామమే - ఈ ఊరివన వాడ"[1].
'శాంతి సమరం' మే 20, 1976 న రేడియోలో ప్రసారం అయింది.

'వంశాంకురం' అనే నాటకం ఒక వింత ప్రకటనకు ప్రతిరూపం. 'శాన్ ఫ్రాన్సిస్కో క్రానికల్' అనే అమెరికన్ పత్రికలో 1975 ఏప్రిల్ 18 న ఒక ప్రకటన "Childless husband with infertile wife wants test tube baby, English or Northwestern European back ground. Indicate fee and age. All answers confidential"[2] అంటూ వెలువడింది.

ఈ నాటకం 1975 అక్టోబర్ 20 న రేడియోలో

---

1. కె. చిరంజీవి, జీవితమే నాటకరంగం, పుట 219.
2. అదే, పుట. 218.

ప్రసారం కాగా, 'అభ్యుదయ' మాసపత్రికలో 1979 మార్చి, ఏప్రిల్ సంచికలలో అచ్చు వేయబడింది.

'శ్రీకృష్ణశిరోభారం' 1976 నవంబర్ 18 న రేడియోలో ప్రసారమైంది.

'ఆకలిమందు' నాటకం రాసినప్పుడు రచయిత వయస్సు కేవలం 20 సంవత్సరాలు. 1955లో 'ఫలితంగలి' అనే తన కలం పేరుతో రాసాడు. 1957 నవంబర్ లో 'అభ్యుదయ' పత్రికలో అచ్చయింది. 1964లో ఒకసారి, 1979లో మరోసారి ఈ నాటకం రేడియోలో ప్రసారమైంది. 'దీనికి బాలంత్రపు రజనీకాంతరావు Theme music ను సమకూర్చారు'[1].

'కాలయంత్రం' నాటకం H.G. Wells రాసిన నవల 'The time machine' ను ఆధారంగా చేసుకొని రాయకపోయినా దాని స్ఫూర్తితో రాసాడు.

---

1. డా. చిరంజీవి, జీవితమే నాటకరంగం. పుట. 218.

ఇది 1982 జూలై 15 న రేడియోలో ప్రసారమైంది. ఈ నాటకం గురించి చిరంజీవి గారు "H.G. Wells గారు 'The time machine' లో మానవకళ్యాణం కోసం ఒక ఊహాలోకాన్ని - Pretty little people ని సృష్టిస్తే, కాలయంత్రంలో లోకం యొక్క వంకర నడకను సరిదిద్దడానికి చిన్న ప్రయత్నం చెయ్యడం జరిగింది"[1] అని వివరించారు.

తెలుగులో 'సింగీతం శ్రీనివాసరావు' దర్శకత్వంలో వచ్చిన 'ఆదిత్య-369' చలనచిత్రం ఈ నాటకాన్ని పోలివుంటుంది.

వాస్తవంగా జరిగిన సంఘటనలకు మనస్ఫూర్తిగా స్పందిస్తే జీవితం సార్థకమైనట్లే అన్నది నిజమైతే, సంఘటనలకు స్పందిస్తూ సాధ్యమైనంతగా వాటికి తన నాటకాల ద్వారా పరిష్కారాన్ని సూచించి కె. చిరంజీవి గారి జన్మ ధన్యమైనట్లే. వారు జనాన్ని జాగృతపరిచిన ధన్యజీవి.

---

1. కె. చిరంజీవి, జీవితమే నాటకరంగం. పుట. 220.

# ఉపయుక్త గ్రంథ సూచిక :-


1. అప్పారావు. పి.ఎస్.ఆర్. డా॥ 'తెలుగు నాటక వికాసం', హైదరాబాదు, 1967.

2. అప్పారావు. పి.ఎస్.ఆర్. డా॥ 'దశరూపక సందర్శనం', (వ్యాసం: విషాద సారంగధర), పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్, హైదర్ గూడ, హైదరాబాద్, 1984.

3. ఇనాక్, కొలకలూరి. ఆచార్య. 'సాహిత్య దర్శని', జ్యోతి గ్రంథమాల, అనంతపురం, 1985.

4. కమల. ఆర్. డా॥ 'విశ్వనాథ వారి నాటకములు - ఒక పరిశీలన', తెలుగు అకాడమి, హైదరాబాదు, 1991.

5. గంగప్ప. ఎస్. డా॥ — 'తెలుగు నాటకం', శ్రీ ప్రచురణలు, గుంటూరు, 1985.

6. చిరంజీవి. కె — 'ఆటబొమ్మలు' (దృశ్య నాటిక సంకలనం), విశాలాంధ్ర పబ్లిషర్స్, హైదరాబాదు, 1991.

7. చిరంజీవి. కె. — 'చీమ మనుషులు' (నవల), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1979.

8. చిరంజీవి. కె — 'జీవితమే నాటకరంగం', (శ్ర)వ్య నాటిక సంకలనం, విశాలాంధ్ర పబ్లిషర్స్, హైదరాబాదు, 1989.

9. చిరంజీవి. కె. 'బోలో స్వతంత్ర భారత్ కీ జై' (నవల), విశాలాంధ్ర పబ్లిషర్స్, హైదరాబాద్ - 1983.

10. జయప్రభ. డా॥ 'నాలుగో గోడ' (తెలుగులో ఆధునిక నాటకం), చరిత ప్రచురణలు, హైదరాబాద్ - 1992.

11. నాగభూషణ శర్మ. మొదలి. 'పాతిక సంవత్సరాల తెలుగు నాటకం' (వ్యాసం), ప్రచురణ యువభారతి, మహతి - 1972.

12. మల్లికార్జునరావు. కప్పగంతుల 'నాటక సమీక్ష' క.గా.కా.కో ప్రచురణలు రాజమండ్రి - 1979.

13. మారుతీరావు. గొల్లపూడి. 'దృశ్యాదృశ్య నాటకాలు' (వ్యాస యువభారతి ప్రచురణలు, మహతి - 1972..

రాధాకృష్ణమూర్తి. మిక్కిలినేని. 'ఆంధ్ర నాటక రంగ చరిత్ర', రేణుకా గ్రంథమాల, వెంకటేశ్వరా ప్రింటర్స్, మద్రాస్ - 1969.

5. విజయ్ కిరణ్. 'సాహిత్య విమర్శనము'.

6. శివలక్ష్మి. పి 'శ్రీశ్రీ రేడియో నాటికలు - ప్రయోగవాద ధోరణులు' విశాలాంధ్ర పబ్లిషర్స్ హైదరాబాద్ - 1993.

శ్రీకాంత్ శర్మ. ఇంద్రగంటి 'ఆలోచన' (వ్యాస సంకలనం) హైదరాబాద్.

8. సత్యనారాయణ. ఎస్వీ. 'రేఖా చిత్రాలు' (సాహిత్య వ్యాసాలు) విశాలాంధ్ర పబ్లిషర్స్ హైదరాబాద్ - 1987.

19. సుబ్బరామిరెడ్డి. గండవరపు — 'ఆధునిక తెలుగునాటకం' (మొదటి భాగం) ప్రవీణ్ ప్రచురణలు సికింద్రాబాద్ - 1989.

౨౦. సుబ్బరామిరెడ్డి. గండవరపు — 'ఆధునిక తెలుగునాటకం' (రెండవ భాగం) ప్రవీణ్ ప్రచురణలు, సికిందరాబాద్ -1991.